
రామాయణం

# రామాయణంలో విశిష్ట పాత్రలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఙవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

"శ్రీరాఘవం దశరథాత్మ జయ ప్రమేయం
సీతాపతిం రఘువరాన్వయ రత్న దీపం
ఆజాను బాహు మరవింద దళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి"

# రామాయణంలో విశిష్ట పాత్రలు

## వ్యాస సంకలనం



ఆకుండి రామశ

# రామాయణంలో విశిష్ట పాత్రలు

(వ్యాస సంకలనం)

గ్రంథకర్త

**ఆకుండి రామశర్మ**

తిరుమల తిరుపతి దేవస్థానం వారి
ఆర్థిక సాయంతో ప్రచురింపబడిన గ్రంథం

56043

ప్రచురణ కర్త

శ్రీమతి ఆకుండి శారదాంబ

శ్రీకాకుళం

# వ్యాస సంకలన కర్త ఆత్మ నివేదనం

ధర్మ స్వరూపుడైన శ్రీరామచంద్రమూర్తి ఆదర్శ గాధను, మహిళాలోకానికి మణిపూస సీతాదేవి కధను, లోకకంటకుడైన దశకంఠుడు రావణుని వధను అతిలోక సుందరంగా అభివర్ణించిన ఆదికావ్యం శ్రీమద్రామాయణం. రామాయణ ఆర్ష సాహితి కర్మ మార్గాన్ని బోధిస్తుంది. ధర్మోపాసన, ధర్మపాలన విహిత కర్తవ్యంగా ప్రబోధిస్తుంది. సత్యధర్మ పాలనా నిరతులను మానవ జీవితాలకు విజయ సోపానాలని నిరూపిస్తుంది. సత్యధర్మపరక్షులకు మృత్యు భయం లేదని భరోసా యిస్తుంది. అరిషడ్వర్గల బారిన పడకుండా మానవాళికి సకల సన్మంగళాలను సమకూరుస్తుంది.

ధన ప్రదమును కీర్తి ప్రదమును, ఆయుర్వృద్ధికరమునగు ఆదికావ్యం రామాయణం చదివినను, వినినను, సమస్త పాతకములు నశింప గలవు. రామాయణ పాఠకులకు కుటుంబవృద్ధియు, ధనధాన్యాభివృద్ధి కల్గును. సోదరభావం అభివృద్ధి యగును. తేజస్సు పొందగలరం. ఉదాత్తమైన ఫలశ్రుతిని రామాయణానికి పెద్దలు నిర్దేశించారు.

రామకథ ఆదర్శ దాంపత్యమునకు నిర్వచనం సత్యవాక్యపాలనకు ప్రతీక. పుత్ర కర్తవ్యమునకు కరదీపిక. భాతృ ప్రేమకు దర్పణం. ధర్మ మార్గమును, సతీ ధర్మమును, మిత్ర ధర్మమును, సేవక ధర్మమును శాసించిన రామకథ అజరామర అనిర్వచనీయ అద్భుత గాథ. తరములు మారినను, యుగములు గడచినను, నాటికి నేడికి ఏనాటికి అందరికి అన్ని వేళల అత్యంత ప్రియతమ కథా సుధాంతాల రామకథ. అట్టి రామకథా మధువనములో సంచరించిన

మహోన్నత మహత్తర పాత్రలు మనల్ని ఎంతగానో ఆకట్టుకొంటాయి. ఆ పాత్ర చిత్రణల ప్రాశస్త్యాన్ని, వైశిష్ట్యాలను అన్వేషణా భావంతో, ఆస్వాదనా ధ్యేయంతో ఈ సంకలనానికి పూనుకొన్నాను.

నా మేధస్సునకు అందినంత వరకు నేను ఎంపిక చేసుకొన్న పాత్రలు – మాతలలో కైకేయి, కౌసల్య తపస్వినులలో అహల్య, శబరి, ఋషిపుంగవులలో విశ్వామిత్రుడు, అగస్త్యుడు, మిత్రవరేణ్యులలో గుహుడు, సుగ్రీవుడు, రామాయణ మహాత్మ్య ముఖ్య హేతువు – ఆదర్శ నాయిక సీతాదేవి, సౌభ్రాత్రమునకు పర్యాయ పదమన దగిన భరతుడు. రామాయణ పాత్రలు వేనికవే విశిష్ట గుణపోషకమును ప్రబోధించగలవన్న సదాలోచన నన్ను పురికొల్పింది.

రామాయణ మహాకావ్యమందలి పాత్రలను గూర్చిన నిశిత పరిశీలన అందలి పాత్రల తీర్పు, నేర్పు సర్వావలోకనం సాధారణాంశం కాదు. రామాయణ క్షీర సాగర మథనమునకు నాశాయాశక్తులా పూనుకొన్నాను. శ్రీరాముణ్ణి కులదైవంగా ఆరాధించి భక్తి పారవశ్యంతో తపించి రామసేవలో తరించిన ఆకుండి వారి వంశంలో జన్మించడం నాపూర్వకృతసుకృతం. మా ప్రపితామహులు ఆకుండి వేంకట కవి తత్త్వ సంగ్రహ రామాయణ కర్త. మా తండ్రిగారు కీ.శే. విద్వత్కవి ఆకుండి వేంకటశాస్త్రి గారు నిర్వచన అధ్యాత్మ రామాయణ కర్త. మా సోదరతుల్యులు కీ.శే. ఆకుండి సూర్యనారాయణశాస్త్రి గారు ప్రత్యక్ష ఆత్మానుభూతి రామాయణం, వచన అధ్యాత్మ రామాయణ కర్తలు. లోగడ నేను వెలువరించిన "శ్రీ మద్రామాయణ సుధామాధురి" (1997లో ముద్రితం) "రామాయణంలో ఆర్ష ధర్మాలు" (అముద్రితం)తో పాటు ఆంధ్ర పాఠక లోకానికి స్ఫూర్తిని, దీప్తిని ప్రసాదించగల ఆధ్యాత్మిక కరదీపకగా ఈ సంకలనం కొంతమేరకు ఉపకరించగలదను పరిపూర్ణ ఆత్మ విశ్వాసంతో సవినయంగా సమర్పించుకొంటున్నాను. గుణాగుణ నిర్ణయం విజ్ఞ పాఠకలోకానికి విడిచి పెడుతున్నాను.

**ఆకుండి రామశర్మ**

గౌరవాధ్యక్షులు :
శ్రీ గీతా ప్రచార సమితి
శ్రీ కావ్యకంఠపీఠము

తేది 14-52002
(మంగళవారం)

# ప్రియ వచనము

"కవికోకిల వాల్మీకి తన కావ్యం" శ్రీమద్రామాయణం చివరలో "ఏవమేతత్ పురా వృత్తమాఖ్యానం భద్రమస్తు వః" (ఇది రామకథ జరిగింది కల్పితం కాదు దీన్ని హృదయ పూర్వకంగా చెప్పండి - ఆనందం అనుభవించండి! దైవబలం వర్ధిల్లు గాక! అని గొంతెత్తి ఆలోచించాడు. అది అన్ని విధాలా సమంజసం.

రాముని చరితం రామాయణం సీత కథ రామాయణం విశ్వామిత్రుని ఉదంతం రామాయణం సుగ్రీవుని చరితం రామాయణం హనుమ ప్రశస్తి రామాయణం- లోకకంటకుడు రావణుని పిరికితనం రామాయణం - ఇంతెందుకు? సమాజ దర్పణం రామాయణం - సత్య ధర్మ ప్రతిష్ఠయే రామాయణం. అందువల్లే అది సుప్రతిష్ఠితమయింది. అందువల్లనే దానికి వ్యాఖ్యలు, వివరణలు, విమర్శలున్న మేలు విధాలుగా వెలసినవి.రామాయణ మహా కావ్యం అది మధ్యాంతరహితమైన పరబ్రహ్మగా ఆరాధింపబడుతున్నవి. భవతు॥ "ఆకుండి" వారి వంశంలో రామాయణం ఆటలాడుకుంది. వారందరు "రామభక్తులు" కావడం అందుకుని దానం. రామాయణంలో విశిష్ట పాత్రలు అన్న ఈ కృతి రచయిత కూడా "ఆకుండి" వారే ! రామశర్మగారు (నేడు యశః కాలములు) "విద్యావంశం" ప్రకారం నాకు సోదరులు. వీరి నాయనగారు "విద్వత్కవి" వెంకటశాస్త్రిగారు నాకు బాల్యంలో వ్యాకరణ గురువులు. నేను పెరిగి, పెద్ద అయిన తరువాత నా అభ్యుదయాన్ని కళ్లారా చూచి, నా పితురుల వలె పొంగిపోయిన ప్రేమ పరిపూర్ణ హృదయాలు. వారి రచనలలో "సుందరీ పరిణయము"నకు కోరి నా చేత ముందుమాట

వ్రాయించుకున్నవారు (1955 సం॥ ప్రాంతంలో నేను ఎమ్.ఆర్. కాలేజి విజయనగరంలో ప్రాచ్య భాషావిభాగానికి అధ్యక్షుడుగా ఉన్న సమయంలో అది నా అదృష్టం" అని భావించేను. నేడు వీరి కుమారుడు రామశర్మగారి రచనకు ఈ మాటలను వ్రాసే అవకాశం కలిగింది. ఇది వరకే "భారతీయ సంస్కృతి అనే వీరి రచనకు నా అశంసనము. అందజేసి ఉన్నాను. ఇది కూడా నా అదృష్ట విశేషమే! ఈ అవకాశం శ్రీ ఆకుండి వెంకట రమణమూర్తి గారు ( శ్రీ రామశర్మగారి కుమారులు స్టేట్ బ్యాంక్ ఉద్యోగి) నాకు కలుగజేసినారు. వీరికి నా ఆశీస్సులు.

ఇక ఈ కృతి విషయం రామాయణంలోగల విశిష్టమైన పాత్రలు" గురించి చక్కని విశ్లేషణ ఇందులో జరిగింది. శ్రీరాముడు, సీత, హనుమ, మొదలైన ముఖ్య పాత్రల చిత్రణం హృద్యంగా సాగింది. (దశరధుడు - లక్ష్మణుడు - రావణుడు మొదలైన కొందరి ప్రసక్తి చోటు చేసుకోలేదు! కవి హృదయం తెలియదు!) విషయం కొత్తది కాదు. పొడిగింపు మాత్రమే కొత్తది. ఆయా పాత్రల స్వరూప స్వభావాలు" సిద్ధాన్నంగా ఒక చోట వడ్డింపబడి ఉన్నాయి. సహృదయాలు, భక్తులున్న శ్రమ లేకుండానే ఆస్వాదించవచ్చు! ఇదే విశేషం.

నా ఆస్వాదాన్ని ఆనందాన్ని ఈ కృతి ప్రకాశకులకు అందజేస్తున్నాను. రామాయణం జగత్ (సృష్టి అంతా రాముడే) అన్న భావనలో రామ లోకంలో ఉన్న రామశర్మ గారికి కూడా ఇది అందుతుందని నా విశ్వాసం.

విశాఖపట్టణం - 13 **అప్పల సోమేశ్వర శర్మ**
(సీతమ్మధార)

# రామాయణంలో విశిష్ట పాత్రలు

## వ్యాస సంకలనం


| క్ర.సం. | విషయసూచిక | పుటల వివరణ |
|---|---|---|
| 1) | కౌసల్య | 1 - 6 |
| 2) | కైకేయి | 7 - 13 |
| 3) | అహల్య | 14 - 18 |
| 4) | శబరి | 19 - 24 |
| 5) | సీతాదేవి | 25 - 32 |
| 6) | విశ్వామిత్రుడు | 33 - 38 |
| 7) | అగస్త్యుడు | 39 - 43 |
| 8) | భరతుడు | 44 - 51 |
| 9) | శ్రీరాముడు | 52 - 66 |
| 10) | హనుమంతుడు | 67 - 77 |
| 11) | గుహుడు | 78 - 83 |
| 12) | సుగ్రీవుడు | 84 -94 |


"శుభం"

(జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా)

ఆధ్యాత్మిక మాసపత్రికలో ప్రచురితమైన వ్యాస సంకలనం

# కౌసల్య

శ్రీమహావిష్ణువు శ్రీరాముని రూపంలో జన్మించుటకు కోసల దేశం వంటి దేశమును, అయోధ్య వంటి పట్టణమును దశరధుని వంటి ధర్మాత్ముడగు మహారాజును, కౌసల్య, కైకేయి, సుమిత్ర వంటి మాతృమూర్తులు మరియొక చోట కానరారు. అశ్వమేధాయాగానంతరం పుత్రకామేష్టి చేయుటకు రంగం సిద్ధం చేయబడినది. యజ్ఞం సలక్షణంగా జరిగింది. విష్ణుమూర్తి దశరధుని పుత్రుడుగా కౌసల్య గర్భమున జన్మింప నిశ్చయించు కొనెను. మహా తపస్వియగు ఋశ్య శృంగుని పవిత్ర నేతృత్వంలో పుత్ర కామేష్టి యాగమున హోమగుండం నుండి ప్రజాపత్య పురుషుడు బయలు వెడలి పాయసముతో నిండిన పాత్రను దశరధ మహారాజానకిచ్చెను. దశరధుడా పాయసమును గైకొని హ్రీ, శ్రీ, కీర్తి కాంతల వంటి తన ముువ్వరు భార్యలు కౌసల్య, కైకేయి, సుమితత్రలకు పంచి పెట్టెను. ఈ పాయస ప్రదానంలో మొదట దశరధుడు అర్ధ భాగం కౌసల్య కిచ్చెను. మిగిలిన అర్ధ భాగంలో ఒక సగభాగం సుమిత్ర కిచ్చెను. ఆ మిగిలిన సగ భాగమును రెండుగా విభజించి యొక సగభాగం కైకేయికి, మిగిలిన భాగమును మరల సుమిత్రకిచ్చెను ఈ పాయసంలో అర్ధభాగం స్వీకరించిన కౌసల్య గర్భమందు చైత్రమాసమున శుక్లపక్ష నవమి నాడు పునర్వసు నక్షత్రమున కర్కాటక లగ్నమున పంచ గ్రహములు ఉచ్ఛస్థితి యందుండగా శ్రీరామ జననం జరుగుట సర్వజనవిదితం. రాముడు దశరధుని జేష్టపుత్రుడు. అపురూపమగు గుణసంపదతో అసామాన్యమగు గుణరత్నములు కలవాడుగా రాముడు దినదిన ప్రవర్ధమానమయ్యెను. రాజు కుండవలసిన లక్షణములన్నియును రాముని యందు రాశీభూతములై యున్నవి.

రామునికభిషేకం చేసి విశ్రాంతి పొందవలెనని దశరథునికి సంకల్పం కల్గెను. సభాంగణమున రాముని పిల్చి తన అభీష్ట అభిషేక కార్యము నెల్లరకు తెలియజేసినాడు. రాముని రాజ్యాభిషేకమునకు దశరథుడు ఆనతిచ్చెను.

శ్రీరాముడు తన తల్లి కౌసల్య అంతఃపురమున కేగునప్పటికి ఆమె దివ్యానందముతో దేవతాగారమున దుకూలధారిణియై వాఙ్నియమముతో వర్తిల్లు చుండెను. రాముడు మాతృదేవత పాదపద్మములకు ప్రణమిల్లి తండ్రి యానతిని యెఱింగించి అభిషేక కార్యమునకు పూర్వరంగమును, తదంగములను నిర్వహింపుమని అభ్యర్థించెను. కౌసల్య నిండు మనస్సుతో దీవించిన విధమెట్టిదో వివరంగా పరిశీలిద్దాం. "వత్సా! శ్రీరామచంద్ర! నీవు చిరంజీవిగా వర్ధిల్లుము. నీ పట్టాభిషేక మహస్సుతో నీశత్రువులు హతులైనారు. పట్టాభిషిక్తుడవై మమ్ములనందరిని సంతోషపరుచుము. ఈ ఇక్ష్వాకు రాజ్యలక్ష్మి నీకు చేకూరుటతో నాభాగ్యం ఫలించినది.'' అని సంతోష పరవశయై సంభాషించినది. ఈ సంతోషం ఎంతకాలమో కౌసల్యకు దక్కలేదు. కైక కోరిన వరములతో రాముని పట్టాభిషేక ప్రయత్నమునకు భంగం వాటిల్లెను. రామవనవాస కఠోరవార్త కౌసల్య కర్ణ పుటములకు చేరలేదు. స్వభావవినీతుడగు రాముడు పుత్రాభిషేకమునకు కుతూహలపడుచున్న తల్లి కడకేగి దండ కారణ్యమునకు పోవుటకు ఆజ్ఞ నొసంగుమని కోరినాడు. ఆ భయంకర దారుణ వార్త చెవిని బడగానే మొదలు నరికిన సాలవృక్షము మాదిరి నేలబడి కౌసల్య విలపించసాగెను. ఆమె మాతృ హృదయం విలవిలలాడి పోయినది. కొంత సేపటికి మనస్సు కుదుటబడిన పిదప కౌసల్య రామునితో ఇలా అంటుంది. "రామా! నీవు అడవి కేగవద్దు. మందిరముననే యుండి తల్లికి సేవ లొనర్పుము. మాతృ సేవ మంగళదాయకం. జననీ సేవా ఫలితంగా స్వర్గసుఖముల ననుభవించిన కాశ్యపుని దృష్టాంతముగా జూపినది. రాముడు వనవాసమున కేగినచో తన ప్రాణములే నిలువవని ఖండితముగా చెప్పినది. కౌసల్య మాతృప్రేమను శంకించని రాముడు పితృ వాక్పాలనం పుత్రుని కర్తవ్యముగా హితబోధ చేసినాడు. పితృవాక్య పరిపాలకులైన కందుడు, పరశురాముడు, సగర పుత్రులు మొదలగు వారిని ప్రమాణముగా జూపినాడు. పిత్రాజ్ఞ పాలనము కంటె ఉత్తమ ఆర్ష ధర్మం మరియొకటి లేదని రాముడు నుడివినాడు.

కౌసల్య 'మాతృ దేవోభవ' యను ధర్మమునకు ప్రాధాన్యమిచ్చి రాముని కర్తవ్యములు ధర్మములు నిర్ణయింప అభిలషింప జూచెను. రెండును మాతృ పితృ ధర్మములు పవిత్రములే, శిరోధార్యములే. అయినా వానికి వైరుధ్యం ఏర్పడినది. కౌసల్య మహా పతివ్రత అయినను, ఆమె చెప్పిన ధర్మములు సమంజసమే అయినను రాముడు మాత్రం తండ్రి యాజ్ఞకు ప్రాధాన్యత నొసంగవలెనని నిశ్చయించుకొనెను. అంతట కౌసల్య మరియొక మార్గం ఆశ్రయింప చూసెను. 'గోవు వత్సమునను సరించునట్లు నేను నీ వెంట వనముల కేగుదెంచెదను. నన్ను గొనిపొమ్మని' వేడుకొన్నది. భర్త సేవకన్న పుత్ర వ్యామోహం బలీయమైనదని కౌసల్య వర్తనం ఋజువు చేసింది. అపుడు రాముడు పతివ్రతా ధర్మ పన్నములు తల్లికి చెప్పవలసి వచ్చింది. "భార్యకు భర్త దైవం కనుక నీ ధర్మం నీవు నెరవేర్పుము," తండ్రి వాక్యమును నేను జవదాటలేను. వనవాసమే నాకు అభిమతం. అవశ్య కర్తవ్యం'' అని నిర్ద్వంద్వముగా చెప్పినాడు రాముడు. అతడు ఎప్పుడూ రెండు మాటలు చెప్పడు (రామో ద్విర్నాభి భాషతే). తనను అనుగ్రహింపమని చివరిసారిగా కౌసల్యను రాముడు వేడుకొన్నాడు. ఈ సత్యాగ్రహంలో రాముడు కృతార్థుడయ్యెను. ఆశీస్సులర్థించగానే తల్లి కౌసల్య లొంగి పోయినది. పొంగిపోయినది. రాముడప్పుడు ధర్మ మార్గమున దృఢముగా నిలబడెను. (ధర్మిష్టే వర్త్మని స్థితిః) ఆ సందర్భంలో ప్రపంచంలో ఏ మాతృమూర్తి చేయని లోకోత్తర ఆశీర్వచనములను రామునికి కౌసల్య గావిస్తుంది. వాల్మీకి దివ్య లేఖిని నుండి వెలువడిన ఆ మంగళాను శాసనము మనల్ని ఒడలు పులకరింప జేస్తుంది. సత్యాగ్రహ వ్రతంలో సఫలత సాధించిన రాముడిని కౌసల్య ఏమియు చేయలేక పోయినది. రాముని ధర్మదీక్షానిరతికి వశంవదయై "రామా! ధృతిమంతుడవై నియములతో పాలించు ధర్మమే నిన్ను రక్షించు గాక! మాతా పితృ శుశ్రూషా ప్రభావముచే సత్య వాక్పాలనా దీక్షతో నీవు చిరంజీవి అగుగాక! సత్యము నిన్ను రక్షించుగాక! మూడడుగులచే భూనభోంతరాళముల నాక్రమించిన త్రివిక్రమ స్వామికి కల్గిన మంగళం నీకు కల్గుగాక!" అని మంగళాశీర్వచనము లతో అభిషేచన మొనర్చి కౌసల్య చందన మాల్యా భరణములతో మంత్ర శక్తి సమన్వితమైన 'విశల్యకరణి' అను ఓషధి రక్ష కట్టెను. ఇట్టిది కౌసల్య హృదయం

ఆమె వాక్కులు మృదు మంజుల భరితం. కనుకనే ఆమె పుత్రుని మాటలకు సమ్మతించినది. పుత్ర వాత్సల్య మహిమ ఎట్టిదో చెప్పుటకు కౌసల్య జీవితం ఒక ఆదర్శ వృత్తాంతం. రాముడే పుట్టకుండిన బిడ్డలు లేరన్న చింత మాత్రమే కౌసల్యకు మిగిలి యుండెడిది. రాముని వనవాస దీక్ష కౌసల్యకు దుఃఖ భాజనమయ్యెను. ఆమె జన్మకు సుఖమను మాటయే లేదు. భర్త దశరథుని వలన పొందవలసిన సౌఖ్యమూ సమకూరలేదు. చివరకు కన్న కొడుకైనా సుఖపెట్టక పోవునా అని కౌసల్య ఆశపడుట సహజమే కదా! ఆమె నామమాత్రం పట్టమహిషి. స్వపత్నుల సూటిపోటి మాటలు తప్పలేదు. రాముడున్నపుడే ఆమెకు అవమానములు అనివార్యమయ్యెను. ఇక రాముడు అడవికి వెళ్ళిన పిదప ఆమెకు పట్టు గతి దుస్సహం, దురూహ్యం. ఆమె కైక ఆజ్ఞాను బద్ధురాలై జీవిత శేషం గడపగల్గుట సాధ్యమా? ఆవేదనతో మానసికంగా ఆమె డస్సి పోయినది. రాముని యువరాజ్యపట్టాభిషేకంతో తన దుఃఖములన్నియు సమసిపోవునని ఎన్నో కలలు కన్నది కౌసల్యామాత. ఆమె చేసిన వ్రతాలు, ఉపవాసాలు, దానములు, నియమములు - అన్నియు చవిటి భూమిలో నాటిన బీజముల వలె నిష్ఫలములైనవి, నిరుపయోగములైనవి. విలపించుచున్న కౌసల్య దీనాలాపములను విన్న లక్ష్మణుడు క్రుద్ధుడై, కైకేయీ మాటలకు లోబడి కామపరవశుడైన తండ్రి అడ్డం వచ్చెనేని అతడిని కూడా వధించెదననియు, లేదా బంధించెదననియు, తండ్రియైనా దారి తప్పి నడుచువానిని శిక్షింప వలసినదే అన్న విపరీత విలక్షణ మనోవైకల్య స్థితికి చేరుకొన్నాడు. రాముని హితవచనములతో లక్ష్మణుడు ప్రశాంతుడై వనవాస దీక్షలో అన్నగారిని అనుగమించుటకే సిద్ధపడినాడు. సీతారామలక్ష్మణులు వనవాసమునకై అయోధ్యను వీడిన వెంటనే తనను కౌసల్య మందిరమునకు గొనిపొమ్మని దశరథుడు కోరినాడు. రాముని తల్లి కౌసల్య నివాసంలో తప్ప మరియొక చోట తన మదికి ఊరట కలుగదన్న భావన అప్పటికి అనుభవం మీద తెలుసుకొన్నాడు దశరథుడు.

సీతారామలక్ష్మణులను అడవికి దిగబెట్టి వచ్చిన సుమంత్రుడి వాక్కులు విన్న దశరథుడు మూర్ఛితుడై పడిపోయినాడు. దశరథుని దీనావస్థకు కౌసల్య దిగులు ద్విగుణీకృతమైంది. రాముని చూడకుండా తానిక జీవించి యుండలేనన్న

భావం అధికం కాగా చివరకు వారి చెంతకు అడవుల్లోకి తనను తీసుకుపోమ్మని సుమంత్రుడ్ని కౌసల్య అభ్యర్థిస్తుంది. సుమంత్రుడెన్ని విధాల ఊర్ధడించినా కౌసల్య దుఃఖం ఉపశమనం కాలేదు. కైక మాటకు లోబడి తన కుమారుడ్ని అడవుల పాల్జేసిన దశరధుడు ఆమెకు ఉన్నా లేనట్లయ్యింది. పుత్రుడా అడవుల పట్టినాడు. భర్తను విడిచి కుమారునితో వెళ్ళుటకు వీలుకాని దుస్థితి ఏర్పడింది. అన్ని విధాల కౌసల్యకు అన్యాయమే జరిగింది. రాజ్యమా నాశనమయ్యింది. సీతారాములు, మంత్రులు, పురజనులు - అందరు దశరధ కైకేయిల క్రూర కర్మకు బలియైపోయారు. రాముని వనవాస దీక్షకు కైకేయి భరతులు మాత్రమే సంతోషింపగలరేమో - ఈ భావపరంపరలతో కూడిన కౌసల్య ప్రసంగములలోని దారుణ వాక్యాలకు దశరధునికి మూర్ఛ వచ్చినంత పని అయినది. కొంతసేపటికి తేరుకున్నాడు. కొంత దనుక "హా రామా! హా కౌసల్యా! హా సుమిత్రా! నేను మరణించు చున్నాను" అని హాహాకారములు చేసి అర్ధరాత్రి దశరధుడు ప్రాణములు విడిచినాడు. ఎంత సేవయినను దశరధుడు లేవకుండుట పరిచారికలకు సందేహం కల్గింది. స్త్రీల రోదనతో కౌసల్యా సుమిత్రాదులు మేలుకొనినారు. కైకేయికి కబురు వెళ్ళింది. అయోధ్యానగరం అంతా విషాదచ్ఛాయలు అలముకొన్నవి. మృతుడైన తన భర్త దశరధుడి శిరస్సును తన అంకముపై నుంచుకొని కౌసల్య బిగ్గరగా రోదిస్తుంది. తన భర్త మరణానికి ప్రధానకారకురాలైన సవతి కైకను నిష్ఠుర వాక్యాలతో కౌసల్య అధిక్షేపిస్తుంది. "మహాతల్లీ! నీ కోరిక ఈడేరింది కదా! రాజా మరణించాడు. ఇక నిన్ను ఎవరూ అభ్యంతరం పెట్టేవారు లేరు. ఈ రాజ్యాన్ని అంతా నీవే అనుభవించు సుఖంగా ఉండు అంటూ కౌసల్య ఆక్రోశిస్తుంది. అచట పరిజనం ఆ మాటలకు కౌసల్యను విడదీసి వేరొక చోటికి గొనిపోయారు. మరలా భరతాగమనంతో కౌసల్య ప్రసక్తి రామాయణంలో కన్పిస్తుంది.

మాతృత్వానికి దీపశిఖ వంటి కౌసల్యా మాత పాత్ర బాల, అయోధ్య కాండలలోనే పరిమితమై వుంది. తన మహోదార, మహోదాత్త సౌజన్య వర్తనంతో తనయునకు తగిన తల్లియై ఆస్తిక జన హృదయకుహరాలలో సమున్నత సుస్థిర ఆరాధ్య పీఠాన్ని అధివసింప జేసుకొన్న ఆదర్శ మాత కౌసల్యా మాత. దశరధుడు అవసాన దశలో నున్నపుడు కౌసల్యను ఊరడిస్తూ పల్కిన

పల్కులలో కౌసల్యా పాత్ర చిత్రణలో వాల్మీకి శ్రద్ధా సక్తులు కన్పబచినాడు. కౌసల్య ఎల్లపుడు దయామయురాలని, శత్రువులను సైతం కనికరంతో చూడగల్గిన నైజం అని, మంచి చెడ్డలు తెలిసిన ధర్మ పరురాలు కౌసల్య అని దశరధుడు అంటాడు. రాముడు వనవాసం ఆరంభించిన అయిదు రాత్రులనే అయిదు సంవత్సరాలుగా భావించి రాముని వియోగంతో అమితంగా ఆవేదన పడిన అమృత హృదయాంతరంగ కౌసల్య

"కౌసల్యా! సుప్రజారామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవ మాహ్నికం"

(బాలకాండ - సర్గ 23)

ఇట్టి ధర్మ నిర్వహణ శిక్షణ కర్తవ్య దీక్షా పరాయణతో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ గావించిన అవతారమూర్తిని మానవ లోకానికి అందించిన కౌసల్య మాత తాను తరించి మనలను తరింప జేసంది.

"ప్రసాద యేత్వాం కైసల్యే రచితో2 యం మయాంజలిః
వత్సలాచా నృశంసా చత్వం హి నిత్యం పరేష్వపి
భర్తాతు ఖలు నారీణాం గుణవా న్నిర్గుణో2 పివా
ధర్మం విమృశమానానాం ప్రత్యక్షం దేవి దైవతం"

(అయోధ్యాకాండ - 61 సర్గ - 7 & 8 శ్లో॥)

# కైకేయి

శ్రీరామునికి పట్టాభిషేక మొనర్చుటకు దశరధుడు తన స్థిర సంకల్పమును నివేదించినాడు. జనులెల్లరు ఉత్సాహాతిశయంతో నుర్రూతలూగినారు. సన్నాహములు సలుప సమకట్టినారు. నగరమున అలంకరణల సంరంభం ఆరంభమైనది పట్టణం యావత్తు ఆనంద సాగరమున తేలియాడుచుండెను. ఇంతలో ఆకస్మికముగా ప్రజాహృదయాకాశంలో నీలి మేఘాలు అలముకొన్నాయి. ఆనందడోలికలు తల్లక్రిందులైనవి. ప్రశాంత వాతావరణం అతలాకుతలమైనది. ఈ అవాంతర దుర్ఘటనకు మూలకారకురాలు కైకేయి. ఈ విపత్తునకు అంతటికి కైకేయి చెంతనున్న ఆమె దాసి - మంధర మూలవిరాట్టు. నిర్మలమగు కైకేయి హృదయక్షేత్రమున, ఈర్ష్యాసూయా బీజములను నాటి, ఆ మరునాటి రామపట్టాభిషేక ప్రయత్నమంతటిని మంధర మంత్రాంగం భగ్నం కావించినది.

మంధర యొనర్చిన మహా ప్రయత్నముకు ఫలం అత్యల్పం. కాని ఆమె విత్తిన భేదోపాయ బీజం దుర్భలమగు కైకేయి మానస క్షేత్రమున చక్కగా అంకురించినది. ఆమె హృదయంలో స్వపత్నీ ద్వేష బీజములను చల్లుటలో మంధర కృతకృత్యురాలైనది. లోకానుభవం కల్గిన మంధర స్వీయకార్యసాధనకు వానిని మొలకలెత్తించి సద్వినియోగం చేసుకొన్నది.

"దర్పాన్ నిరాకృకా పూర్వం త్వయా సౌభాగ్య మత్తయా
కౌసల్యా రామ మాతా నాకథం వైరం నయా పయేత్"

(అయోధ్యకాండ - సర్గ-8 శ్లో॥ 37)

"రాజ్ఞీమణీ! ఒకప్పుడు నీవు సౌభాగ్య మత్తవై గర్వంతో కౌసల్యను అవమానించావు. రాముడు రాజైనచో అపుడు కౌసల్య నిన్ను క్షమించి విడిచి పెట్టునా? అందుకు తగినట్లు అసలు వృద్ధులతో క్రుద్ధమై ప్రతీకారం తీర్చుకోకుండా ఉపేక్షిస్తుందా?" అని కైక హృదయ దావానలాన్ని ప్రజ్వరిల్ల చేసింది మంథర. ఈ మాటల ఈటెలతో కైకేయి మానసము కాక యెక్కినది. ఒకానొక సత్కార్యమును నిర్వహించుట కష్టముగాని, దానిని కూలద్రోయుటకు తృటి మాత్రం చాలదా? ఎంతకాలం నుండియో కైక హృదయమందు ప్రతిష్ఠింపబడిన సద్భావములను ఆర్ద్రభావములను మంథర తన విషమూలికా ప్రయోగంతో మంటగల్పినది. ఈ అమోఘమగు యుక్తి చాతుర్యంతో దాసియైన మంథర, మహారాజు, అమాత్య వర్గం, పురోహితులు హితులైన ప్రజలు - ఎల్లరు నిర్ణయించి నిశ్చయించిన మహాకార్యమును క్షణకాలంలో తల్లక్రిందులు చేయగల్గినది. రామాయణంలో మంథర మంతనమున కట్టి విశిష్టత. విఘాతకారియై విలసిల్లింది. ఈ విషయమున భోజుడు మంథర గూర్చి తన "చంపూ రామాయణం"లో మనోజ్ఞంగా చిత్రీకరిస్తాడు.

'యామేవాహుః నిశిచరకులోన్మీలనే మూల హేతుం
యవ్యాశ్చిత్తం ప్రకృతి కుటిలం గాత్ర మిత్రం బభూవ
అంభోజిన్యాః శిశిరసమయే కాపరీవాచ్ఛ మంథః
కైకేయ్యాః వా హృదయ మదయం మంథరా నిర్మమంథ!

"రాక్షస కులమును కూకటి వ్రేళ్ళతో కూల్చుటకు మూలహేతువైన మంథర తన దేహం వలెనే, సహజ వక్రహృదయం కల మంథర, తామర కొలనులో శిశిర సమయంలో బత్తి గొడ్డు వలె ప్రవేశించి నిర్మల జలాలను పంకిలం చేసినట్లు కైకేయి హృదయకాసారాన్ని నిర్దయగా మథించివేసింది." మంథర మంత్రాంగం వలన రాముని రాజ్యాభిషేకానికి భంగం వాటిల్లింది. రాక్షస సంహారానికి రాజమార్గం ఏర్పడింది. ప్రాణ సంహారకమగు గరళం కూడా ఒక్కో సందర్భంలో ప్రాణ రక్షక శక్తి ప్రదాయకమై ప్రవర్తిల్లుట యనిన ఇదియే నేమో?

మంధర పన్నిన పన్నుగడ ఫలించుటకు ప్రధాన కారణం - దశరథుని మీద కైక సంపాదించిన కామాధిపత్యం కామపరవశుడైన దశరథుడు పడుచు పెండ్లాము కైక మాటలను కాదన జాలక పోయెను. "వృద్ధస్యతరుణీ విషం" చివరకు మిగిలినది చేదు అనుభవం. దశరథుడు రామాభిషేక వార్తను తొలుత తానే కైకేయికి తెలుప వలెనని ఉవ్విళ్ళూరి పొద్దుగ్రుంకక ముందే పరువులెత్తినాడు. అతని స్మృతి పథంలోనికి కౌసల్య, సుమిత్రలు రానేలేదు. ఆ వర్తమానమును ఎవరి మూలముననో కైకేయికి పంపవచ్చునే! కాని ఈ వృత్తాంతమును తానే స్వయంగా తెల్పి ఆనంద జ్యోతిని వెల్గించి ఆమె అనురాగ కటాక్ష వీక్షణములకై తాపత్రయంతో కైక యింటికి వెళ్ళినాడు. వార్త యెఱిగించి తిన్నగా మరలి వచ్చెనా? రాలేదు. కైక అడిగినంతనే ఆమె కోరిన వరములు తీర్చెదనని వాగ్దానం గావించినాడు. చివరకు తనకు అత్యంత ప్రేమాస్పదుడైన రామునిపై కూడ నొట్టుబెట్టినాడు. ఈ విధంగా కైక పన్నిన వలలో మృగం వలె దశరథుడు చిక్కి తరువాత చిక్కుల పాలై ఉక్కిరి బిక్కిరి అయినాడు. కైకేయి సామాన్యురాలు కాదు. అనుకూల అవకాశం యెఱిగిన నెఱజాణ ఆమె. భర్తృవశీకరణ తంత్రమును, కృత్రిమ కోపము నాశ్రయించి ఆమె దశరథుని తన చెంతకు రప్పించుకొన్నది. అతనిచే బ్రతిమాలించు కొన్నది. తాను అర్థించిన వరములను ముసలి మగడు తీర్చుటకు సిద్ధపడినాడు. కైకేయి చేతిలో కీలుబొమ్మ అయినాడు. 'కామేనాశి తమతిః ప్రతిషిద్ధే ప్రవర్తతే'- కామదాసుడై బుద్ధి మాలినవాడు చేయరాని పనులు చేయుటలో సందేహంలేదు కదా! "దుష్కామాంధుల్ పడరాని పాటులకు నిక్కల్‌గారొ యొందేనియున్" (నిర్వచన అధ్యాత్మ రామాయణం కర్త : ఆకుండి వేంకట శాస్త్రి) - అయోధ్యకాండ - 2 సర్గ) అని చెప్పిన కవి వాక్కు దశరథుని పట్ల అక్షరసత్యంగా నిరూపింపబడింది.

మంచితనము కాని, చెడ్డతనం కాని మితిమీరినచో ఏర్పడు అనర్థములు స్వానుభవమునకు వచ్చి దుఃఖదాయక మగును. దశరథునికి రాముని యెడల అతి ప్రేమ కలదు. దానివలననే అతడు కైకేయి సుతునకు రాజ్యమిత్తునని కేకయరాజునకు పూర్వం చేసిన వాగ్దానమును తూట్లు పొడిచెను. భరతుడ్ని

అనుమానించెను. అతనికి వర్తమానం పంపకుండా రామునికి అవ్యవధిలో పట్టం కట్ట.నారాటపడెను. అట్లే కైక యెడల తక్కిన భార్యల కన్న. అతి కామం ప్రదర్శించెను. కనుకనే దశరథుడు కైక కోరిన వరములేవో వినకుండా వాని మంచి చెడులు చూడకుండా, తీర్చడానికి సిద్ధపడినాడు. ఈ రెండింటిలో 'అతి'కి తగిన ఫలములకు శలభమైనాడు.

"అతి రూపాద్ధతా సీతా అతి గర్వేణ రావణః
అతి దానాద్బలిర్బద్ధో హ్యతి సర్వత్ర వర్జయేత్"

అతిరూపం వలన సీత కడగండ్ల పాలైనది. అతి గర్వం వలన రావణుడు హతుడైనాడు. అతిదానం వలన బలిచక్రవర్తి బద్ధుడైనాడు. అందుచేత 'అతి' వర్తనం ఎచటనూ పనికి రాదు.

కైక కోరిన వరాలు పిడుగు పాటు వలె చెవిని బడినంతనే దశరథుడు నిశ్చేష్టితుడయ్యెను. కాలు చేతులాడలేదు. అపుడు ఎటులైన తాను తలపెట్టిన కార్యమును సాధింప నడుము కట్టి అపాయం నుండి తప్పించి ఉపాయం చెప్పిన మంథరకే ఆశ్చర్యం కల్గునట్లు ప్రవర్తించిన కైక సామాన్యురాలు కాదు. వెంటనే యామె రాముని రప్పించి తన వరములను తండ్రి అభీష్టానుసారం చెల్లించుట పాడియని ధర్మోపదేశం చేసెను. తను కోరిన రెండు వరాలు తెల్పెను.

కైక కోరినది న్యాయముగా రెండు వరాలు కాదు. రెండు వాక్యముల రూపమున యున్న అనేక వరములు. రాముని పట్టాభిషేకం నిశ్చయమైనది. దానిని ముందుగా ఆపుదల చేయవలయును. వెంటనే అడవులకు రాముని పంపవలయును. మరల కాలనియమం - పదునాల్గేండ్ల వనవాస దీక్ష, జటా వల్కలధారియై ముని వేషమున రాముడు గడపుట రాముడడవి కేగిన వెంటనే భరతునికి యౌవ రాజ్య పట్టాభిషేకం నిర్వహించుట - ఈ పనులన్ని జాప్యం లేకుండా జరుగవలయును. ఈ గొంతెమ్మ కోరికలన్ని కైకమ్మ దృష్టిలో కేవలం రెండు వరముల క్రిందనే లెక్కకు వచ్చును. దశరథుడిప్పుడు అంధుడైనాడు. అతని అంధత్వము నయనములకు కాదు. అంతరంగమునకే ఆవరించినది.

కైక కోరిన కామితములను రాముడు నిస్సందేహముగా నెరవేర్చుటకు నిశ్చయించెను. అతనిది ధర్మ దృష్టి. వనవాస దీక్షలోని కష్ట సుఖములను అతడు లెక్క చేయలేదు. ఆ వరములాచరింప వలెనని తండ్రి యానతి, తల్లి కూడ చెప్పినది. అతనికి కావలసినది అంతియే కనుక అతడు నిశ్చింతగా వనములకేగ నిర్ణయించుకొనెను. పట్టాభిషేక భంగమునకు రామునికి పరితాపమే లేదు. అరణ్య వాసమునకు సిద్ధపడిన అతని మనస్సు ప్రశాంతమై, పరిపూర్ణమై, పరిపుష్టమై యుండెను.

ధర్మమును, పితృ వాక్య పాలనా మర్మమును జూపి కైక రాముని నిరుత్తరుని చేసెను. వనవాసమునకు సిద్ధపడిన సుగుణధాముని రాముని జూపి ప్రజలను యంత్రప్రతిమలను చేసెను. తీవ్రావేశపరులు, ఉడుకు నెత్తుటివారు ఉక్రోషంతో కైకను తృణీకరించిరి. కొందరు మందలించిరి. మరి కొందరు అవమానించిరి. ఎన్ని చేసినను వాని నెల్ల తన మౌన విలక్షణంతోనే ఆమె పరాజితులను చేసింది. అతిరథమహారథులకు ఆలవాలమైన అయోధ్య ఆనాడు ఒక అబలధాటికోర్వలేక దుర్బలమయ్యెను. వికలమై విచార సాగరంలో విలవిలలాడి పోయినది. ఆమె మాత్రం చలించలేదు. సంతాపము చెందలేదు. 'నైవసా క్షుభ్యతే దేవీనచస్మ పరిదూయతే' - ఈ కీలక ఘట్టంలో వాల్మీకి మహర్షి కైకేయిని దేవీయని పిలుచుటకు ఆమె అర్హురాలా కాదాయను సందేహము కల్గుట సహజమే. కాని కొన్ని సందర్భాలలో, శక్తి యుక్తుల్లో, సాహస ఔదార్యములలో, గాంభీర్యంలో, కార్య నిర్వహణలో, మగవారి కన్న మగువలే మిన్నయని ఋజువు కాబడిన దృష్టాంతములు మనకు కోకొల్లలు. ఈ పట్టున కైకేయి ప్రదర్శించిన స్మరణ శక్తి, సమయోచిత ప్రతిభ - ఎంతమంది ఆక్షేపించినను చెక్కు చెదరని క్షమా సంపద సామాన్య అంశములు కావు. తాదలచిన కార్యసాధన కవసరమగు గుణముల నెల్ల ప్రస్ఫుటముగా ప్రదర్శించిన సమర్థురాలు కైక "నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా" స్త్రీల యొక్క స్మరణం, మేధా సంపత్తి, ధీరత్వం, సహనం - అన్ని భగవదంశములే యని గీతలో భగవానుడు ప్రవచించుట సర్వ జనవిదితం. అట్టి దివ్యగుణము లకు రాశీభూతమైన కైకేయిని 'దేవీ' యని పిలుచుట అన్ని విధాల సమంజసమే యగును.

కైకేయి జనుల లాలనములకు మెత్తపడలేదు. తిరస్కారములకు జంకలేదు. ప్రార్థనలకు లొంగలేదు. బెదరింపులకు అదరలేదు. ప్రశంసాభిశంసనములకు పరివర్తనం చెందలేదు. ధీరతతో నిశ్చలత్వం ప్రదర్శించెను. ఆమె ప్రకటించినది బేషజము కాదు - భీకరత్వమునే! ఎంత పట్టుదల, ఎంతనిగ్రహం! ఎంత ధీరత్వం! ఆమె కరడు గట్టిన భీకరత్వమునకు ప్రతీక. కోపావేశములకు ఆటపట్టయిన ఆ సంక్షోభిత కల్లోల వాతావరణంలో ఉత్తమ సభాసదులు అలంకరించిన ఆవేదికపై మూర్తీభవించిన మాత్సర్యం కైకేయి. అట్టి విషపరిణామమునకు పరిణామక్రమంగా నాధార భూతమైన కైకేయి ఉగ్రరూపం దాల్చిన శక్తి స్వరూపిణి. ప్రత్యుత్పన్న మతియు, భీభత్స మూర్తియునైన కైక చండికాదేవి సాహసమును సహస్ర ముఖమున ప్రతిబింబించిన సరస్వతీ దేవియే కైక. శక్తి యుక్తులను వికృత రూపమున విశ్వరూపంతో విదలించి గగ్గోలు పరచిన అపర కాళీకాదేవియే కైక! ఆమె ధైర్యమును, గాంభీర్యమును, సంకల్ప పాటవమును, నిగ్రహోదగ్రతయు, ఏకాగ్రత స్థిత ప్రజ్ఞా పరిణితి, గాంచినవారు బేలలైరి. ఇదియే కైక యందలి భీభత్స దైవీభావ ప్రదర్శనకు పతాక సన్నివేశం.

లోకకంటకుడగు రావణ వధ నిమిత్తం దశరథుడు ముదిమివయసున అబ్బురంగా పుట్టిన ఆత్మ సుతులను త్యాగం చేసినాడు. కౌసల్య, సుమిత్రాదులు విధినియుక్తులై పతి, సుత త్యాగములకు సంసిద్ధులైరి. శ్రీరామచంద్రుడు పితృ త్యాగ దుఃఖమునే కాక ఇహపర సాధనాశ్రయమగు పత్నిని త్యాగం చేసినాడు. లక్ష్మణాదులు అతిలోభనీయమగు రాజ్య రమావైభవములను అలవోకగా పరిత్యజించినారు. ఇవన్నియు, సరే అన్నింటి కంటెను విచిత్రమైనది. విలక్షణమైనది - సమస్త జీవరాశి అభిలషించు సుచరిత ఖ్యాతిని అవలీలగా త్యాగమొనరించినది అంబ కైకేయి. రామాయణ స్త్రీ పాత్రలలో అతి దుష్ట పాత్ర కైకేయి అను మనలోని భావన కేవలం అపోహయే! స్వార్థరహిత బుద్ధితో చరిత్ర త్యాగం చేసిన కైకేయి వంటి తరుణీమణులు ఇంకే సారస్వతమున కాని, ఇతిహాసమున కాని కానరారు. త్యాగధనులకు

ఆలవాలమగు భారతీయ పవిత్ర సంస్కృతి నిక్షేపమైన రామాయణ సారస్వతంలో కాననగును. వాస్తవంగా "ఋతస్యగోపా" అనదగిన మహామాత కైక. తాను అర్థించిన వరాల బేర సారాలలో దశరథునిపై గెలుపు సాధించి మహత్తర రామాయణా కధా సంవిధానంలో మలుపు త్రిప్పిన మహామహిమోపేతురాలు మానధనురాలు, కారణ జన్మురాలు కైకేయి మహామాత చిరస్మరణీయురాలు.

"వందిత్వా చరణౌ రామ! విసంజ్ఞస్య పితుస్తథా
కైకేయ్యా శ్చాప్య నార్యాయా నిష్పపాత మహాద్యుతిః
సరామః పితరం కృత్వా కేకేయీ ంచ ప్రదక్షిణం
నిష్క్రమ్యాంతః పురాత్త స్మాత్స్వం దదర్శ సుహృజ్జనం"
అయోధ్య కాండ - సర్గ - 18)

# అహల్య

రామాయణంలో అహల్యా గౌతము లిరువురు మానవ ఆకృతిలో నున్న తాపస దంపతులు. గౌతముడు ఒక పవిత్ర ఋషి సత్తముడు. అతడి తపశ్శక్తికి భీతాపహుడైన ఇంద్రుడు, దానిని నివారింపయత్నించెను. మునిపత్ని యైన అహల్య సుందరాంగి దేవతలను కూడ సమ్మోహపరచిన సౌందర్యం అహల్యది. గౌతముని తపశ్శక్తియు వారికి ఆటంకదాయకమయ్యెను. అహల్యా పతనమునకు ఇంద్రుడు రాచబాటలు వెదుకసాగెను. అతడి తపశ్శక్తిని అణచుటకు ఇంద్రుడు అహల్యను చెఱుప సంకల్పించెను. గౌతముడు ఆశ్రమమున లేని సమయం కనిపెట్టి ముని వేషధారియై అహల్యను సమీపించి "క్రీడింప నాకు మనోరధం కలదు. నన్ను అనుగ్రహింపుమని" వేడినాడు. ముని వేషమున వచ్చినవాడు ఇంద్రుడు అని తెలిసికొని మనసు మరలినందున అహల్య అందుకు సమ్మతించినది. "కృతార్ధురాలనైతిని, త్వరగా వెడలి పొమ్మని" హెచ్చరించినది. ఉభయతారకమైన రక్షక మార్గమన్వేషించి తన మర్యాద కాపాడమని ఇంద్రుడ్ని అభ్యర్ధించినది. తన పతనమునకు అహల్య తానే కారకురాలయ్యెను. గౌతముని శీఘ్ర ఆగమనమును శంకించిన ఇంద్రుడు సత్వర నిష్క్రమణమునకు తత్తరపడినాడు. అంతలో సుస్నాతుడైన గౌతముడు ఆశ్రమమునకు మరలినాడు. తొరట్లాడుచున్న ఇంద్రుడు గౌతమునికి కంటపడినాడు. అతడిని చూచి ఇంద్రుడు భయాక్రాంతుడై వివర్ణుడైనాడు. చేయకూడని పని చేసినపుడు ఇంద్రుడైననేమి, చంద్రుడైననేమి మరి కుబేరుడైననేమి - అతడికి పట్టునది దుర్గతియే కదా! గౌతముడు ఇంద్రుని దుశ్చర్యను తిలకించి కోపించి విఫలుడు కమ్మని శపించినాడు. అర్ధాంగి

అంతరంగమును సైతం అవగాహన చేసుకొన్న గౌతముడు అనేకవేల సంవత్సరాలు వాయుభక్షణ చేయుచు బూడిదలో శయనించి ఏప్రాణికి కనపడకుండునట్లు అహల్యను శపించినాడు. ముని వర్జితమైన ఈ ఆశ్రమమును దశరథ పుత్రుడు రాముడు ఏనాడు వచ్చునో ఆనాటికి ఆమె శుచిమంతురాలు కాగలదని, శ్రీరామునికి అతిథి పూజా సత్కారములు గావించి, అతని వలన లోభమోహములను వీడి, నిజరూపం దాల్చి మరల తన యెదుట సంతోషముగా నుండగలదని శాపవిమోచన పరిష్కారమును గౌతముడు సూచించినాడు. గౌతముని శాపఫలితంగా అహల్య రాయి కాలేదు. ఆమెకు యోగావస్థ ప్రాప్తించెను. రాముని ఆగమనంతో ఆయన పాదధూళి సోకినంతనె అహల్య శాపవిముక్తి బడసెను. ఇట్టి కఠోర యోగాభ్యాసం అవలంబించిన తపస్వినిని చిత్రించి వాల్మీకి భారతీయ ఇతిహాసిక ప్రపంచంలో ఔన్నత్యంతో భాసించిన ప్రామాణిక సంప్రదాయానికి వన్నె తెచ్చాడు. ప్రాపంచిక వాంఛలు ఆమె తపశ్శక్తి వలన దగ్ధమయ్యెను. సర్వావయవములు ఆధ్యాత్మిక శక్తులు ప్రసరించుటచే పవిత్రతను ఆపాదించుకోగల్గెయి.

విశ్వామిత్రుని మాట మేరకు లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు గౌతముని ఆశ్రమములో ప్రవేశించినాడు. అతడు అడుగిడినంతనే తపస్సుచే ఇనుమడించిన కాంతితో తేజరిల్లు చుండిన అహల్య కాన వచ్చినది. శాపం అంతమై నందున వారికి అహల్య గోచరమైనది. అహల్యను రాముడు చూచు దృశ్యమును వాల్మీకి ప్రదర్శించిన తీరు అతిమనోహరం. ఆమె సౌందర్యమును సృష్టికర్త చిత్రకళానైపుణ్యంతో అభివర్ణించునట్లుగా ప్రదర్శించెను. యోగాభ్యాస శక్తి వలన ఆమె తేజస్సు ద్విగుణీకృతమై ప్రజ్వరిల్లెను. "తపసాజ్యోతితప్రభామే తపోబల విశుద్ధాంగీం" అని వాల్మీకి అహల్యను గూర్చి ప్రస్తుతించినాడు. అహల్య గాంచినంతనే రాముడేమి చేసినాడు? ఆమె గత పాపపంకిల చరిత్రను సంస్మరించి వైముఖ్యం చూపినాడా? లేదా ఆమె పాపం నుండి విముక్తి గావింతునని ప్రతిన పూనినాడా? ఇవేమియు చేయలేదు. ఆమెను గాంచినంతనె మరుక్షణంలో ఆమె పాదపద్మముల కడ తన శిరస్సును మోకరిల్లి ప్రణమిల్లినాడు.

"రాఘవౌతు తతస్తస్యాం పాదౌజగ్రహాతుస్తదా
స్మరంతీ గౌతమ వచః ప్రతి జగాహసాచతా"

(బాలకాండ - సర్గ 49 - శ్లో॥ 19)

అహల్య రామలక్ష్మణుల పాదములకు నమస్కరించినది. భర్త గౌతముని వాక్కులను స్మరించుచు ఆమె పరమ భక్తి శ్రద్ధలతో అతిధి సత్కారం చేసి వారిని పూజించినది. ఈ శుభతరుణంలో ఆకాశమార్గంలో పుష్ప వృష్టి గురిసింది. అప్సరలు నృత్యం చేసారు. కిన్నెర గాంధర్వులు పరవశులై గానం చేసారు. గౌతముడు సైతం వెంటనే అచటికి వచ్చినాడు. చిరకాల వియోగానంతరం అహల్య గౌతములు కలిసి కొన్నారు. గౌతముడు కూడ యధావిధిగా రాముని పూజించి తరించినాడు.

వాల్మీకి బాలకాండలో త్రివిధములైన స్త్రీ పాత్రలను ప్రవేశపెట్టినాడు. తాటక-రాక్షసాంగన; అహల్య-మునిపత్ని; సీతాదేవి-జనకమహారాజు కుమార్తె, శ్రీరాముని సహధర్మ చారిణి. వారు ముగ్గురు తామసిక, రాజసిక, సాత్త్విక ప్రవృత్తులకు, శక్తులకు ప్రతీకలన దగినవారు. తామసిక శక్తికి ఈ జన్మలో ముక్తి లేదు. అది తాను తరింపలేదు. ఇతరులను తరింపజేయదు. అందువలననే తాటక సంహరింపబడెను. రాజసిక శక్తి తాను ప్రమాదములకు లోనగును, తాత్కాలిక ఆవేశములకు వశమగును. కాని దానిని చక్కదిద్ది సవరించవచ్చును. అందుచే అహల్య కష్టములకు, బాధలకు పెక్కు కాలము గురియై చివరకు పవిత్రతను అపాదించుకొన్నది. తాను తరించి అహల్య ఆదర్శ నారీమణికాగల్గెను. ఇక సాత్త్వికశక్తి తాను తరింపగల్గుటయే గాక తను వరించిన వారిని తరింప జేయగలదు. పవిత్రత చేకూర్చ గలదు. సీతాదేవి మహాసాధ్వియై తన పాతివ్రత్య మహత్త్వ శక్తిచే, తాను తరించి తనను వివాహమాడిన శ్రీరామునికి వన్నె తెచ్చి తరింప జేసెను.

పాత్ర చిత్రణలో వాల్మీకి రామాయణ అహల్యకు అధ్యాత్మ రామాయణంలోని అహల్యకు తారతమ్యం కలదు. రెండు రామాయణాల్లో శాపవిమోచనానంతరం శ్రీరాముడు ఆహల్య పూజా సత్కారము లందుకొనుట సామాన్యాంశం. కాని అధ్యాత్మ రామాయణంలో గద్గద వచనాలతో శ్రీరాముణ్ణి ఎన్నో విధాలుగా అహల్య గుణగానం చేస్తుంది.

"యత్పాద పంకజ రజః శ్రుతిభిర్వి మృగ్యం
యన్నాభి పంకజ భవః కమలాసనశ్చ .
మన్నామ సారరసికో భగవాన్పురారి
స్తం రామచంద్ర మనిశం హృధి భావయామి"

(అధ్యాత్మ రామాయణం - బాలకాండ - 5 సర్గ. - 47 శ్లో॥)

(ఎవని చరణకముల రజము వేదముల ద్వారా వెదుక దగినదో, ఎవని నామరసామృతం శంకర భగవానుడు కూడా ఆస్వాదించునో అట్టి శ్రీరామచంద్రుని ఎల్లవేళల నాహృదయమున ధ్యానించెదను.)

ఈ విధంగా అనేక విధాలుగా రాముడ్ని స్తోత్రం చేసి తాను కేవలం ఆడుదానిననియు, మూఢురాలుననియు, అజ్ఞురాలననియు, శ్రీరామునికి తన అంతరంగాన్ని నివేదిస్తుంది. అహల్యాకృతమగు సంస్తుతిని పఠించిన వారికి సర్వ పాపములు తొలగుననియు, రామసాయుజ్య మంది హర్షం పొంద గలరనియు, పుత్రార్థియగు వాడు ఒభిరామగుణులైన తనయులను కాంచగలరనియు, ఒక వత్సరములోనే వంధ్య పుత్ర సంతతిని బడయ గలదని ఫలశ్రుతి అధ్యాత్మంలో వివరింపబడినది. అంతటి మహామహిమోపేతురాలు, భక్త్యాగ్రగణ్యురాలు అహల్య.

రామాయణంలో అహల్య సౌందర్యమునకు ప్రతీక. ఎంత సౌందర్య వంతురాలో అన్ని బాధలకు గురి అయ్యింది. భారతీయులు పంచ స్త్రీ రత్నములుగా ఆరాధింపబడు వారిలోకి వచ్చువారు - సీత, తార, మండోదరి, అహల్య, ద్రౌపది. ప్రతిదినం ప్రాతఃకాలమున ప్రతి భారత స్త్రీకి అహల్యా నామం స్మరణ యోగ్యమైనది. శ్రీరాముడు సీతను వివాహమాడుటకు దారితీసిన మహత్తర సంఘటన - అహల్యా శాపవిమోచనం. దేవతల అహల్యను అభినందించిరి. అందుచే అమె మనకు ప్రాతః స్మరణీయురాలు కాగల్గినది. తొలుత ఆమె చేసినది తప్పు అనుటలో సందేహం లేదు. గౌతముని శాపవశమున కొన్ని వేల యేండ్లు తపస్సు చేసినది. విశుద్ధాంగి అయినది. అందుచే విశ్వామిత్రుడు వంటి మహర్షి పుంగవుడు ఆమెను మహా భాగనుగా పరిగణించెను. శ్రీరాముడు ఆమె ఆతిథ్యమును స్వీకరించెను. ఆమె యందు

ఏర్పడిన పాప మాలిన్యం తొలగినది. ప్రాయశ్చిత్త ఫలితంగా ఆమె ఆర్యులకు పరిగ్రాహ్యురాలయ్యెను. ఈ ధర్మ సూక్ష్మమును ప్రకటించుటకే విశ్వామిత్రుడు రామలక్ష్మణులను గౌతముని ఆశ్రమమునకు గొని పోయెను. ఆమె శాప విమోచనమునకు విశ్వామిత్రుడు దోహదకారుడయ్యెను. అతని సమక్షంలో రాముడు ఆతిథ్యం స్వీకరించుట వలన ఆమె పరిశుద్ధాంతరంగంతో తాపసుడు గౌతముడు పత్నిగా స్వీకరించెను. తపోరూప ప్రాయశ్చితమున శుద్ధురాలైన అహల్య జీవితం మనకొక గుణపాఠం బోధించు చున్నది. ప్రాయశ్చితముతో తప్పు తీరినట్లే కదా! పశ్చాత్తాపం పొందినవారు తప్పు చేయని వారితో సమానముగా పరిగణించవలెను.

"తతోమయా రూపగుణై రహల్యా స్త్రీ వినిర్మితా!
యస్మాన్న విద్యతే హల్యంతే నాహల్యేతి విశ్రుతే"

ఋగ్వేదమున వర్ణింపబడిన ఉషః సమయమే అహల్య అని ప్రతీతి కలదు. ఉషః సూర్యులు అపహరింపబడిరనియు, వారు ఇంద్రుని సాయం వలన లభించిరనియు ఒక గాధ కలదు. అట్టి సందర్భంలో ఉషస్సు అహల్య అయినచో గౌతముడు సూర్యుడు కావలెను. ఈ సందర్భంలో గమనార్హమైన అంశం-ఋగ్వేద కథకు వాల్మీకి రామాయణంలోని "అహల్యా గౌతముల" కథకు సంబంధం లేదు.

అకలంక భారతీయ నారీత్వానికి, పవిత్రతకు ప్రతీకయై, నిర్మలతకు నిలయమైన పవిత్ర మూర్తిగా వాల్మీకి సృష్టించిన "అహల్య" పాత్ర రామాయణంలో విశిష్టమైనదే కాదు పరిపుష్టమైనదిగా భావించుట సమంజసం.

"సాధు సాధ్వీతి దేవాస్తామహల్యాం సమపూజయన్
తపోజల విశుద్ధాంగీం గౌతమస్యవశానుగామ్
గౌతమో పి మహాతేజా అహల్యా సహితస్సుఖీ
రామం సంపూజ్య విధి వత్త పస్తేపేమహాతపాః"

(బాలకాండ సర్గ - 49)

# శబరి

శబరి జాతిలో జన్మించిన హీనకుల సంజాతురాలు "శబరి" బహుశా నేటి ఆరణ్యకములలో నివశించు సవర జాతి (గిరిజన సంతతి)కి చెందినదై యుండవచ్చును. అయినను ఆమె తన నియమ నిబద్ధ నిష్ఠా జీవిత ప్రభావంచే, గురుశుశ్రూషా పారాయణత వలన, త్యాగ నిరతి వలన పరమ భాగవతోత్తమురాలిగా పండిత పామర తారతమ్యం లేకుండా అందరి మన్ననలను పొందిన సాధ్వీ తిలకంగా, ఆస్తిక హృదయ కుహరాలలో మహోన్నత స్థానం ప్రతిష్ఠింప జేసుకోగల్గింది.

వాల్మీకి మహర్షి ఈమె జీవిత చరిత్రను గూర్చి విపులంగా రామాయణంలో వివరింపలేదు. మరికొన్ని పురాణాలను ఆధారం చేసుకుంటే ఆమెను గూర్చిన విశేషాలు మనకు తెలియ గలవు. అందలి ఉచితానుచితాల మీమాంస, తార్కిక చర్చ శుష్కప్రయత్నం అని నా భావన ఈమె శబరి రాజపుత్రి. తండ్రి ఆమెను స్వజాతీయుడగు ఒక అనామకుని కిచ్చివివాహం చేయ సంకల్పిస్తాడు. కాని ఆ వివాహానికి విముఖురాలైన శబరి సబలగా నిరూపించుకొని దండకారణ్యములకు దరలి పోయినదట మతంగా శ్రమ పరిసరాలలో కొన్నాళ్ళు తిరుగాడినది. స్నాన మొనరించి నిజాశ్రమమునకు అరుదేరుచున్న మతంగ మహర్షిని ఒకనాడు ఆకస్మికముగా చూచినది. ఆమె మహర్షిని చూచుట తోడనే అతని దివ్య వర్చస్సునకు ఆకర్షితురాలై నిర్మల అంతఃకరణతో అతనికి శుశ్రూష గావింప అభిలషించినది. కాని హీన కులసంజాత అగుట వలన ఆ మునికి తన అభిలాష తెలుపుటకు

సాహసింపలేకపోయినది. అతని కంట పడకుండ గనె ఆశ్రమ ప్రాంతమును పరిశుభ్రం చేయుచు అతని నిష్ఠా గరిష్ఠ జీవితమునకు వలయు వస్తు సంచయం, పూజాది ఫల పుష్పాదులు సమకూర్చుచు ప్రశాంత జీవనమునకు అలవాటు పడినది. ఈ విషయం అవగతం చేసుకొన్న కొందరు సమీప వాసులైన మునులు ఆమెను ఆ మహర్షి సమక్షానికి గొని పోయారు. ఆమె ధైర్యముగా తాను చేయు సేవలు స్వీకరింపమని, లేకున్న ప్రాణ త్యాగమునకు సిద్ధ పడనున్నట్లు వినమ్ర భావమున విన్నవించు కొన్నది.

శబరి యౌవనవతి, సౌందర్యవతి. హీనకుల సంజాత అయినను మతంగ మహర్షి సౌజన్య మూర్తియై ఆమె మనోరథం తీర్చుటకు సమ్మతించెను. అల్ప బుద్ధి వారు కొందరందులకు ఆక్షేపించిరి. మరి కొందరు అవహేళన చేసిరి. అందులకు అతడు కించిత్తు ఆందోళన చెంద లేరు. ఆమెను శిష్యురాలిగా అంగీకరించి ఆదరించెను. ఆ మహర్షి తన మరణావసాన తరుణంలో శబరితో "బిడ్డా! కొలది కాలంలో రామలక్ష్మణులు ఈ ప్రదేశమునకు వచ్చెదరు. అపుడు వారికి ఆతిధ్య సమ్మానాది పూజలొనర్చి అంతమున నా చెంతకు చేరుమని" వచించినాడు. నాటి నుండి ఎన్నో యేళ్ళు ఆమె రామ నామస్మరణ చేయుచు రామలక్ష్మణుల ఆగమనం కొరకు, వర్షమును కోరి వదనము చాచు చాతకము వలె, బిడ్డ తల్లి కోసం తల్లడిల్లు చందమున వెన్నెలకు చకోరం భ్రమియించు రీతి, ఎదురు తెన్నులు చూచెను. వారి సందర్శనంతో ఆమె నిరీక్షణ సఫలీకృతమైనది. ఆమె సంతోష పారవశ్యమునకు అవధులు లేవు.

శబరి ధర్మ నిపుణ. సామాన్యముగా భక్తులు మోగులు మున్నగు వారు మానవ మాత్రులగు గురువులు సమాయమున భగవానుని గాంచ వాంచింతురు. భగవదవతారమగు రాముని సాయమున స్వర్గంలో ఉన్న తన గురుసాన్నిధ్యం చేర సంకల్పించిన అపూర్వ అకలంక భక్తాగ్రగణ్యురాలు శబరి. ఇదియే ఆమె గురు భక్తి వైశిష్టం. ధర్మ నిపుణత్వం. శబరి కావించిన తపస్సు - ఆచార్య శుశ్రుషయే! అవివాహితగా నుండి జీవిత శేషమంతయు నిర్మల అంతరంగంతో గురు శుశ్రూష యందే గడపిన ధన్యురాలు. చరితార్థురాలు - శబరీమాత.

"యస్య దేవే పరాభక్తః యథా దేవే తథా గురౌ
తస్యైతే కథి తాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మన"

"దేవుని యందును. అట్లే గురువు నందును. పరా భక్తి యున్న మహాత్మునకు సాధ్యార్థములు సమకూరును." దైవభక్తి ముక్తి నొసగుట నిశ్చయమే కాని గురుభక్తి లేనిచో అది ఎందుకును కొఱగాదు.

రాముని యారణ్యాక దుఃఖ జీవితంలో శబరి సాహచర్య ఘట్టం ఆశ్వాస స్థానం. రాముని కది గతమును మరపించి, భవితవ్యమును జాజ్జ్వల మానం చేసి ప్రకాశము నిచ్చిన దివ్య జ్యోతి. సాంసారికంగా ఏర్పడిన భార్యా వియోగతాప భారమునణంచి కర్త వ్యోత్సాహం ఇచ్చిన దివ్యౌషధి శబరి పరిచర్య.

వాల్మీకి అయోధ్యా కాండాంతమున గుహుడ్ని ప్రవేశపెట్టి కర్మ యోగమునకు నాందీ ప్రస్తావన గావించినాడు. అరణ్యాకాండాంతమున శబరిని ప్రవేశపెట్టి జ్ఞానయోగం గఱపినాడు. తాపసాశ్రమ మండలంలో నారంభించిన జ్ఞానం శబరీ యోగ సమాధి స్థితిలో పరిపక్వత నొంది పరిపూర్ణత చెందినది. కిష్కింద కాండాంతమున జ్ఞానాంతమున వానర పుంగవుల భక్తి యోగం ప్రారంభమగును.

శబరి నివసించిన మతం గాశ్రమ ప్రాంతం భాగవతులకు ఆవాసస్థానం. అదియొక జ్ఞాన కేంద్రం. అదియొక కర్మ క్షేత్రం. రామ లక్ష్మణులను చూడగానే శబరికి ప్రాణములు లేచి వచ్చినట్లయ్యెను. తక్షణమే ఎదురేగి వారి పాదపద్మములకు ప్రణమిల్లినది. వినీతుడైన రాముడామె యోగక్షేమము లరసినాడు. "తపోధన! నీ తపస్సు నానాట వర్ధిల్లు చున్నదా? నీ కోపం, ఆహారం నిగ్రహింపబడినదా? నీ మనస్సు సుఖముగా నున్నదా? నీ గురు శుశ్రూషా ప్రయత్నం సఫలీకృతమైనదా?" అని రాముడు ప్రశ్నించినాడు.

"రామా! నా సందర్శన భాగ్యం వలన నా తపస్సు సిద్ధించినది. నా గురుపూజ ఫలించినది. నా జన్మ సఫలీకృతమైది. నీ పదార్చ్యాల వలన నాకు స్వర్గం సంప్రాప్తం కానున్నది. నేను పవిత్రురాలనైతిని. నీ అనుగ్రహం వలన

అక్షయలోకములందగలను. చిత్రకూటం నీకు చేరినప్పటి నుండియు పంపా తీర జాతముల నుండి వివిధములగు వన్య ఫలములను సమకూర్చి నీ కొఱకు నిరీక్షించు చుంటిని. నీ ఆజ్ఞకు లోబడి నా గురు సన్నిధి కేగుటకు సంసిద్ధురాలను." అని వినీతురాలై ప్రతివచనం చేసింది శబరి. తాను కష్టపడి సమకూర్చిన ఫలములన్నింటిని అర్పించి పంపా సరస్సును, మతంగ మహర్షి నివసించిన ప్రదేశమ నెల్ల రామలక్ష్మణులకు చూపెను. కాని శబరి తన యెంగిలి ఫలములతో రామునికి ఆతిధ్యం ఇచ్చినట్లు వాల్మీకి రామాయణంలో ఏ సందర్భంలోను ప్రస్తావించలేదు. భక్తా వాత్సల్యం, భక్త్యావేశముల రెంటిని మేళవించి ప్రతి ఫలింప జేయవలెనన్న తలంపుతో -పద్మపురాణకర్త' ఆసందర్భము కలుగ జేసినాడు.

"ఫలావిచ సుపక్వాని మూలాని మధురాణిచ
స్వయ మాస్వాద్య మాధుర్యం పరీక్ష్య పరిచక్ష్యచ
పశ్చాన్ని వేదయా మాస రాఘవాభ్యాంధృఢవ్రతా
ఫలాన్యా స్వాద్య కాకుత్స్థః తస్యై ముక్తిం పరాందదే"

పరిపక్వములగు ఫలముల యొక్క మాధుర్యమును స్వయముగా తాను ఆస్వాదించి, పరీక్షించి, భక్షించి దృఢవ్రతయగు శబరి రాఘవులకు నివేదించెను. రాముడా ఫలములనాస్వాదించి యామెకు పరాముక్తి ననుగ్రహించెను.

పరమ భక్తితో మాతృ ప్రేమతో నిచ్చిన ఫలములను రాముడు ఆప్యాయముగా ఆరగించెను. శబరి రామునికి ఆయా ప్రదేశములు చూపుచు, "రామ! సప్తసాగరముల నిందు వీక్షింపుము. ఇందు ఆరవైచిన నారచీరలింతదనుకు నారలేదు. ఇచట గల పూల సౌకుమార్యాములల పోడిమి ఇంకను చెడలేదు" అని చెప్పి మతంగ మహర్షి ఆశ్రమ మహాత్త్యమును వారికి సాక్షాత్కరింప జేసెను. ఆ పవిత్రాశ్రమంలో తానొక పరిచారిక ననియు, తన దేహదారుఢ్యం సన్నగిల్లు చున్నదనియు, తన దేహమును వీడి పరమాత్మలో లీనం గావలెనన్న తన అభిలాష ఎరుకపర్చెను. ఆ మాటలకు రాముడు నీ యిష్టం వచ్చినట్లు యదాసుఖముగా నరుగుము. (గచ్ఛ కామం యధా సుఖం)

అని బదులిచ్చినాడు. అతని యానతి గైకొని హతాశను మకూలమున జ్వలత్పావక సంకాశయై స్వర్గముల నలంకరించెనెర. స్వర్గారోహణ సమయమున అగ్ని నుండి వెడలిన ఆమె విద్యుల్లత ఆ ప్రదేశమును విరాజిల్ల జేసెను. **"విరాజయంతే తల దేశం విద్యుత్యా దామినీ యథా"** ఈ మహోన్నత దృశ్యము గాంచినప్పటి నుండియు తన కడగండ్లు తీరు ననియు, శుభదినములు తనకు ఆసన్నము కాగలవనియు రాముడు సంతుష్టి పొందినాడు.

వాల్మీకి తన రామాణంలో ఇద్దరి విరాధ జాతీయులను ప్రవేశపెట్టుట గమనార్హం. అయోధ్య కాండలో గుహుడ్ని, ఆరణ్యాకాండలో శబరిని ప్రవేశపెట్టి వారిని సంస్తుతించినాడు.

**" గుణాః పూజా స్థానం గుణీఘణ చలింగం నచవయః"** - **గుణవంతుని** గుణములే ఆరాధ్యనీయములు. కాని స్త్రీ పురుష విశేషం కాని వయో భేదం కాని కారణం కాజాలదు. గుహుడు నిష్కామ కర్మ యోగి. శబరి నిశ్చల జ్ఞాన సంపన్నురాలు. గుహుని దైవ భక్తి కన్న శబరి గురు భక్తియే మిన్న. శబరి చెంత నున్నంతకాలం దాశరధులకు మదిలోనికి రాలేదు. అట్టిది ఆమె సాంగత్య మహిమ! గుహుని యింట ఆతిధ్యం గైకొనజాలనని పల్కిన రాముడు శబరి కుటీరంలో ఆమె ఇచ్చిన ఆతిధ్యం గైకొని ఆనందించెను. ఇది శబరి జీవిత వైశిష్ట్యం. ఆమె జీవిత నైర్మల్యానికి నికషోపలం. ఆమె చరితం హరిచందన గంధభరితం. తాను పూతయై యితరులను పునీతం చేయగల ధన్య జీవి ఆమె. శబరీ జీవిత తేజః ప్రభావ పుంజ ప్రసరణ వలన భక్తి లోకం ధన్యమగును. ఆమె ఋషులకు ప్రయాణ మార్గమును ప్రదర్శించెను. ఆదర్శ జీవనమునకు, పవిత్ర చరిత్రమునకు, సంబంధము లేదు. ఇది భారతీయ నాగరికతే పరమార్థం.

శబరి భక్తి జగత్తునకు తేజస్సు కూర్పజాలినది. కాని స్వర్గ మామెకెంత మాత్రం తేజస్సు నీయలేక పోయినది. స్వర్గమున తాను కాంక్షించిన స్థానమును ఆమె స్వర్గీయ మహిమ ద్వారా సంప్రాప్తం చేసుకొన్నది. అందులకు రామానుగ్రహం నిమిత్త మాత్రమే అని "స్వేన తేజసా" అను విశేషణంతో వాల్మీకి సూచించినాడు. సుప్రసిద్ధ రామాయణ టీకా తాత్పర్య కర్త

గోవిందరాజస్వామి, రాముని దృష్టిలో శబరి యెంతటి మహనీయురాలో వాల్మీకి భావపరంపరలను తెలియజేసినాడు. పరిశీలిద్దాం. "శబరి విజ్ఞానము నందు నిత్యం అబహిష్కృతురాలై యుండెను. ఆమె జాతి చేత హీనురాలై నప్పటికి వైజ్ఞానికంగా గురు బహిష్కరణం పొందలేదు. అనగా దూరంలో ఉంచబడలేదు. ఆచార్యానుగ్రహం చేత బ్రహ్మ జ్ఞానం పొందిన ధన్య జీవి" రాముని మనస్సుకు స్వాంతన కల్గింది. పదపడి రామలక్ష్మణులు పంపా తీరమునకు పయన మారంభించారు.

శబరి పాత్ర చిత్రణ ద్వారా ఎట్టి భేద భావములు లేక సర్వ మానవుల నాదరింపవలయుననియు, సదవకాశం లభించినచో సర్వజనులు ఉన్నతి బడయుగలరను పరమ సత్యమును వాల్మీకి కడు మనోహరముగా ప్రస్ఫుటం చేసినాడు. శబరి పునీత వినీత తాపస జీవితం అగ్రజన్ముల వాని అహంకరించు వారి కనులు తెరపించు గాక! సామాన్యులకు కూడా ధర్మ నిర్వహణ కర్తవ్యమును ప్రబోధించు గాక! 'సర్వేజనా స్సుఖినోభవంతి'

"యత్రతే సుకృతాత్మానో విహర న్తిమహర్షయః।
తత్పుణ్యం శబరీ స్థాన ంజగామాత్మసమాధినా"

# సీతాదేవి

రాజర్షి యగు జనక మహారాజు. యజ్ఞము చేయబూని నేల దున్ను ముండగా నాగేటికి తగిలి ఒక పేటిక దొరికెను. అందొక ఆడబిడ్డ ముద్దుల మూటగట్టుచు మరిపముల ముత్తెపు రాశివలె దేదీవ్యమానముగా వెలుగొందుచున్నది. ఆ పసికందును గొనిపోయి జనకుడు ఆనందంతో అల్లారుముంద్దుగా పెంచి పెద్ద జేసినాడు ఆమె ఎవరోకాదు. రామాయణంలో ఆదర్శ నాయిక - సీతా సాధ్వీమణి. ఇట్లు సీతాదేవి కారణజన్మురాలై భూమి పుత్రికగా లభించుట. ఆపైన రాజర్షియగు జనక మహారాజునకు లభ్యమై అతనికి అభిమాన పుత్రిక యగుట రామాయణంలో విశేషాంశములు. అటులనే శ్రీరాముడును, సంతతి కొరకు తపించి, పరితపించి యున్న దశరధ మహారాజునకు ఆశ్రిత రక్షణార్ధం పుడమిపై నవతరించిన పురుషోత్తముడు. పుత్రకామేష్టి యజ్ఞమున ప్రాజాపత్య పురుషుడు అనుగ్రహించుట పాయస ఫలితంగా జనియించుట శ్రీరామ జన్మ వృత్తాంత విశేషం. ఇట్టి సీతారాముల సతీ పతులగుట సముచిత సందర్భోచిత సంఘటనమే కదా! ప్రపంచ కళ్యాణమ్మున చేకూర్చి శాంతి ధర్మ స్థాపనకు సీతారాముల జననం కారణ భూతమను విషయం సర్వ జనవిధితం.

ఋషి తుల్యుడైన వాల్మీకి తన కావ్య వాఙ్మయంలో ప్రసక్తాను ప్రసక్తంగా ఆధ్యాత్మిక తత్త్వమును విశ్వ సత్యములను ప్రియకాంత వలె లలితంగా మృదుశైలీ ఉపజ్ఞతో వ్యంగ్య వైదుష్యంతో ఉపదేశం చేయగల సమర్ధుడు. కావ్యమున నాయికా నాయకులు విలక్షణ లక్షణోపేతులై ఆదర్శప్రాయులై,

ఋజా వర్తనమున ఉత్తమ శీలమునకు దృష్టాంతములుగా నిలుతురు. పలుకులలో, ప్రవర్తనమనులలో అంతటి ఆదర్శ శీలమునే ప్రభోదించు వారలై ఉందురు. అట్టి ఆదర్శ దంపతులే సీతారాములు. వారే రామాయణ కావ్య ప్రశస్తికి, ప్రాచుర్యానికి కారణ భూతులు, కారణ జన్ములు.

రామాయణ మహాత్మ్యమునకు ముఖ్య హేతువు ఆదర్శ ధీరోదాత్త నాయకుడు రామునితో పాటు సీతా దేవియు అర్ధ భాగం పాలు పంచుకొన్నది. వాల్మీకి రామాయణాన్ని ఒక సందర్భంలో సీతాదేవి చరిత్రగనే వారొన్నాడు.

**"కావ్యం రామాయణం కృత్స్నం సీతయాః**
**చరితం మహత్ పౌలస్త్య వధ మిత్యే తత్ చకారచరిత్రవ్రతః"**

వాస్తవానికి రామాయణం అంతా సీతాదేవి చరిత్రే. ఆమె కారణంగానే దుష్టశిక్షణ, శిష్ట రక్షణ జరిగినదనుట జగద్విదితం. ఆ చరిత్రకు రావణ సంహారం పరమావధి. సీతాదేవి చరిత్రను వాల్మీకి దీక్షతో, దక్షతతో వెలార్చి జగతి కందించినాడు. పరమ సాధ్వీ తిలకమైన సీతాదేవి చరిత్ర వర్ణన. ఆమె పాత్ర చిత్రణా ఘట్టములు ఆస్వాదింప వలసి యున్నది. నాయికా పాత్ర చిత్రణము మహాకవియైన వానికైనను అక అగ్ని పరీక్ష వంటిది. తొలుత కవి ఎదుర్కొను సున్నిత అంశం - నాయికా సౌందర్య వర్ణన. వర్ణింప కుండా మిన్న కుండినచో కావ్యం రసవత్తరంగా భాసించదు. సీతా స్వయంవర సందర్భంలో ఆమె సౌందర్య వర్ణన ప్రసక్తే కవి తీసుకు రాలేదు. అది అనుచితమని భావించిన వాల్మీకి ఎత్తుగడలో సీతాదేవిని ఒక త్యాగమూర్తిగా పాఠకులకు పరిచయం చేస్తాడు.

"రాస్య దయితా భార్యా నిత్యం ప్రాణ సమాహితా జనకస్యకులే
జాతాదేవమా యేవ నిర్మితా సర్వ లక్షణ సంపన్నా నారీణా
ముత్తమావధూః సీతాప్యను గతా రామంశశినం రోహిణి యథా"

రామునికి ప్రియ భార్యయు, నిత్యం ప్రాణం వలె ఎడ బాయనిదియు, జనక వంశమున జన్మించినదియు, దేవమాయ వలె సృష్టింపబడినదియు, సర్వలక్షణ సంపన్న నారీ మణులలో ఉత్తమురాలగు సీతాదేవి, రోహిణి చంద్రుని అనుసరించినట్లు రామునను గమించి వెళ్ళింది. సౌందర్యం, ఆభిజాత్యం,

పతివ్రతా శీలం మున్నగు గుణాతిశయములచే సీత పరిగ్రాహ్యా యోగ్యురాలని వాల్మీకి నిర్దేశిస్తాడు. ఇంతవరకు సీత నోపంట ఒక్క పలుకైన పలికించలేదు. వివాహానంతరం కూడ ఆమె చాలాకాలం వరకు అత్తమామలు, భర్త, మరదుల చాటున ఒక అపురూపముగ్ధ వలె వ్యవహరించిన నూతన వధువు ఆకుల మాటు పిందె వంటిది. ఆమెను గూర్చి యితరులు చెప్పుటయే గాని సీతకు తనకు తానుగా సంభాషించిన సన్నివేశములరుదు.

"తస్య భూయో విశేషణ మైథిలీ జనకాత్మజా
దేవతాభి స్సమారూపే సీతా శ్రీరివరూపిణీ"

రూపు గొన్న లక్ష్మి, దేవతా సౌందర్యవతియైన సీత రాముని చిత్త వృత్తిని అతని కంటె విశేషముగా గ్రహించి వివేకంతో ప్రవర్తిస్తుంది. రాముని అంతరంగాన్ని అతని కంటె సీతయే అధికంగా హృద్గతం చేసుకోగల్గుతుంది. రామాయణ ముందెల్లడను సీత వ్యక్తిత్వం అడుగున మెరుపు తీగ వలె దోబూచులాడు చుండును. ఆమె తన ప్రాణ విభుడైన శ్రీరామ చంద్రునికి అనుకూలవతియైన సహధర్మచారిణిగా భాసించినది. సీతాదేవి వ్యక్తిత్వం అయోధ్య కాండ నుండి క్రమేణా ప్రస్ఫుటమవుతుంది. అడవికేగ నున్న తన నిశ్చయాన్ని చెప్పే నిమిత్తం రాముడు సీత చెంత కేగిన సందర్భంలో వనవాస క్లేశాలు, అరణ్యా వాస అరిష్టాలు ఏకరువు పెట్టి అత్తమామల సేవ చేస్తూ అయోధ్యలో నిబ్బరంగా ఉండమని హితవు చెపుతాడు. పట్టాభిషేక భంగ వార్త విన్న సీతకు ఏ మాత్రం చింత కలుగలేదు. తన భర్తను అడవుల పాల్జేసిన అత్త కైకేయిని సాధారణ స్త్రీ చాపల్యంతో ఆడిపోసికొనలేదు. వరమిచ్చి నందులకు మామ దశరథుడ్ని పట్టి పల్లార్చ లేదు. వనవాస దీక్షకు వంత బాడిన రాముడ్ని నిందా వాక్యములతో నిలదీసి మనసు నొప్పించలేదు. అట్టిది ఆమె వ్యక్తిత్వం. అయోధ్యలోనే ఉండి నిర్వహింపవలసిన ధర్మములాచరింపమని కర్తవ్య బోధ చేసిన రామునికి సీత ఆర్ష ధర్మ సమ్మతంగా ప్రతివచనం చెపుతుంది. "రామా! నేనెట్లు సంచరింప వలయునో నాకు నాతల్లి, నాతండ్రి పుట్టినప్పటి నుండియు బోధించారు. నా విద్యుక్త ధర్మములు నీవిప్పుడు బోధింప నక్కర లేదు." సీతాదేవి ఎన్నో యుక్తులతో తనను కూడా వెంట గొనిపొమ్మని

నిష్కర్షగా చెపుతుంది. సీత వినీత అయినప్పటికి సందర్భమును పురస్కరించుకొని స్వతంత్ర ఆలోచనలు గల దృఢ సంకల్పం గల భారత నారీమణిగా నిరూపించు కుంటుంది. భర్త చెంతనుండటయే భార్యకు కర్తవ్యమని తానిప్పుడో యెఱుగుదునని రామునికి కరాకండిగా చెప్పగల్గిన ఆత్మ స్థైర్యం సీతకు వెన్నతో బెట్టిన విద్య. సీత యిట్టి ధర్మ విశ్వాసము ధర్మాచరణ దీక్షగల సాధ్వీమణి యగుట చేతనే వాల్మీకి ప్రారంభంలోనే "సీతాయాశ్చరితం మహాత్" అని యెలుగెట్టి ఉద్ఘోషించినాడు.

స్వభావరీత్యా సీత ముద్దరాలైనను స్వతంత్ర భావములు పుణికి పుచ్చుకొన్న యేరు నగధీర వనిత. యాగకర్మలు ఆచరించే మునుల సంరక్షణార్థం రాక్షస సంహారంగావింతునని రాముడు ప్రతిన సల్పినపుడు అది కారణ రహిత హింస కాగలదేమోయని సీత శంకించి రాముడ్ని నివారింప హెచ్చరిస్తుంది. ఆ సందర్భంలో ఆమె ప్రదర్శించిన ధర్మ జ్ఞానం ప్రశంసార్హం. అపరాధం లేకుండా రాక్షసులనైనను సంహరించడం తనకు సమ్మతం కాదని ఖండితంగా చెపుతుంది సీత. ఏ రాక్షసులకు పట్టుబడి తానెన్ని అనర్థములకు పాలై అష్టకష్టాలు పడిందో అట్టివారి పక్షం వహించి సీత పల్కడం విధి వైపరీత్యం, విధి వైచిత్ర్యం కాక మరేమిటి? అంతటి సంయమనం ప్రదర్శించిన స్త్రీ పాత్ర ఏ సారస్వతంలో మనకు అగుపించదు.

క్షత్రియ కాంతయగు సీతాదేవి రాజస ప్రవృత్తికి ఆకరముగా నుండుటలో అబ్బురమేది గోచరించదు. మాయ లేడిని వెంటబెట్టుటకు వెళ్లిన రాముని ఆర్తనాద స్వరాన్ని విన్న తర్వాత తన భర్తకు సాయంగా వెళ్ళమని తొందర పాటులో లక్ష్మణుడ్ని నిందిస్తుంది. అందులో ఆమె రాజసం ఉట్టి పడుతుంది. భర్త కపాయం శంకించిన ఆందోళనతో తత్సమయోచిత ఆవేశానికి లోనై లక్ష్మణుడ్ని నానావిధాలుగా తప్ప బల్కుతుంది. ఆమె మనస్సు యందు చిర కాలం అట్టి భావం సుస్థిరమై నాటుకొని వుండదు. అప్పటి సీతాదేవి ప్రవర్తన -

"ప్రాయస్సమాపన్న విపత్తి కాలే ధియోపి పుంసాం మలినా భవంతి"

సాధారణంగా ఆపద కల్గినపుడు మానవుల బుద్ధి కలుషితమగునన్న ఆర్యోక్తికి లక్ష్యమైనది. ఆపద ఇంతలో రానే వచ్చినది. రామలక్ష్మణులిరువురు

లేని సమయం చూసుకొని రావణుడు సీతాదేవిని బలాత్కారముగా అపహరించెను. అయినను ఆమె మనోధైర్యము సడలలేదు. సద్యః స్ఫురణం వీడలేదు. రావణుని రథంపై నుండి తన జాడలు భర్తకు తెలియుటకై తన ఆభరణములను కొన్నింటిని మార్గమధ్యంలో పడవైచునట్లు చేసింది. మహాభారతంలో రాజసమునకు ప్రతీక యనదగిన పాంచాలి కూడ యింత నేర్పుగా వ్యవహరించినట్లు మనము పరికించలేము. ఆమె సమయస్ఫూర్తి కది ప్రబల తార్కాణం.

అశోక వనము నందున్న సీతాదేవి లోకంలోని ఉత్తమ కాంతలకు మూళిమండనం. ఆమె మూర్తీ భవించిన సత్త్వగుణం. ద్రవీ భూత కరుణ రసావిష్కరణకు ఆటపట్టు. కరడుగట్టిన శోక దేవతకు ప్రతిరూపం. జానకీ సతిపతివ్రతలకు శిరోలంకారమై భాసించు దివ్య పునీత చరిత. క్షాంతి, దాంతి, దయ, సౌశీల్యం మున్నగు సుగుణ పుంజములతో సీతను బోలు సతీ తిలకమును సకల పతివ్రతా లోకంలో మనం కాంచజాలం.. రాముని సౌజన్యమునకు సీతాదేవి పాతివ్రత్యం సువర్ణమునకు సుగంధమబ్బినట్లు కీర్తనీయమైనది. ఆ నాయకుని శీల సంపదకు వన్నె తేగల్గిన సౌశీల్యం జన్మతః అలవడింది. సీతాదేవి జీవితం త్యాగపరంపరల సమ్మేళనం. పతి వియోగం వలన ఏర్పడిన బాధలనుభవించి, దుఃఖములు దిగమ్రింగి విశ్వ కళ్యాణమునకు దోహదపడుటకు అవతరించిన ప్రకృతి స్వరూపిణి సీతాసాధ్వి పాతివ్రత్య సిద్ధాంతమునకు సీత పెట్టని కోట. మానవరూపంలో అతిశయించిన దివ్యాంగనా రత్నం, పాతివ్రత్యమునకు వరవడి పెట్టిన పరమ పతివ్రతా తిలకం సీత. పతి నంటిపెట్టుకొని నిత్యం భోగములనుభవించుటయే ఆమె అభిలాష కాదు. పతితో సమానంగా కష్టములను భవించుట, పతి క్షేమం కోరుట ఆమె ఉత్తమ ఆదర్శురాలు.

సీత పాత్ర రామాయణంలో ప్రముఖ్యతను బడయుటయే గాక పెక్కు సందర్భములలో రాముని కన్న మిన్నగా శోభిల్లెను. ఆమె పాతివ్రత్య ప్రభావం తిరుగులేని పణం. దానిని ప్రదర్శించుటయే వాల్మీకి పరమావధి. ఆమె ఉత్తమ సాధ్వీత్వమును ప్రకటింప జాలిన కరుణ రస ఘట్టములు ఆమె వియోగ

సందర్భములే! ఆదర్శ గుణోపేత, ఆమె చరిత్ర ఆమె సౌశీల్యం ఇల్లాండ్ర కెల్లరకు మేల్బంది.

"త్రిలోక రాజ్యాన్ని పాదాల ముందు పరుస్తానంటే దానిని ఎడమ కాలి కొనతో కూడ తాకనంది. చిన్న బుచ్చిన భర్తనే లక్ష్యపెట్టక అగ్ని గుండంలో నడచిన మహాభిమానవతి సీత. కనుకనే సీతాయశ్చరితం." (రామాయణ రత్నమాలలో ఇంద్రగంటి వారి వ్యాఖ్యలు) - చిరస్మరణీయాలు.

సీత భూమి పుత్రిక. ప్రకృతికి ముద్దు బిడ్డ. లతలు, తరువులు ఆమెకు సోదరీ సోదరులు. నదీ పర్వతములు ప్రియ మిత్రములు. ఆ కారణమున్నే ఆమెకు గల్గిన ఆపదను చూచి అవియెల్ల వాపోయినవి. సోదరికి ఏర్పడిన ఆపదకు గౌతమి క్రుంగి రోదించెను. ఇక మగవారి కంటె మగు వలకు ప్రకృతియన్న పరమ ప్రీతి. చిగురులన్నను, సుమములన్నను, మృగములన్నను, ఖగములన్నను - పడతులకు ప్రాణం. అందున సాధు జంతువులన్న సాటిలేని ప్రేమ. ఇట్టి మృగయా వాత్సల్యమే సీత నిక్కట్ల పాలు గావించినది. దీనినే కుత్సితుడగు రావణుడు మాయావి మారీచును పాయంగా లేడి రూపుదాల్చ జేసి సీతాపహరణంనకు నాందీ పల్కి రక్తి కట్టించినాడు. సీత సర్వాంగ సుందరీ రత్నం. ఆమె మహాలక్ష్మి యొక్క మారు రూపమని గదా ప్రతీతి శ్రీ సూక్తంలో మహర్షులు వర్ణించిన మహాలక్ష్మియే సీత :

"పద్మ ప్రియే పద్మిని పద్మ హస్తే పద్మాలయే పద్మ దళాయతాక్షి
విశ్వప్రియే విష్ణు మనో నుక్కలే తతాద పద్మం మయి సన్నిధత్స్వ"

రావణుడు సీత సౌందర్యమును గాంచినంటనే స్తంభించి పోయెనట. (అతిష్ఠత్ ప్రేక్ష్య వైదేహీం రామ పత్నీం యశస్వినీం) రావణుడు సీతాదేవి సౌందర్యమును గాంచిన పిదప కల్గిన భావ పరంపర గమనిద్దాం :

"కమలానాం భుభాం మాలాం పద్మినీ వహిబిభ్రతే"

సీత చక్కదనం నదీ ప్రవాహం ఒడ్డుల నొఱయునట్లు అతని మనస్సుకు హరించుచున్నదట. ఉపములకు వాల్మీకి మహాకవి కాళిదాసుకు తీసిపోడు. సీత యొక పవిత్ర తరంగిణి. ఆమె సౌందర్య కాంతులు ఆ నదీ తరంగ పంక్తులు. రావణుడు ఆ నదీ ప్రవాహము నాకట్టి దానిని తన స్వార్థము

నకుపయోగింప ఉద్యమించిన ఉన్మత్తుడు. సీత యతి వేషధారిని జూచి యదార్థ యతియని భ్రమించి ప్రమాదం పాలయినది. ఆశ్రమ ప్రాంగణమునకు వచ్చిన అతిధికి చేయదగు సేవలు సీత భక్తిప్రపత్తులతో చేసెను. కపటి, చెనటియగు రాక్షసుడు ఆ సేవలను అందుకొనుచునే తుదకామెను అపహరించుకొని శీఘ్రముగా లంకకు కదలిపోయినాడు. అట్టి విపత్తి సమయమున, ఒంటరిపాటును, జంకుగొంకులు లేక, భయంకరుడగు దుష్ట రాక్షసునితో తిరస్కార పూర్వకముగా నుడివినపల్కులు సీతాదేవి ధైర్యమునకు, పాతివ్రత్యమునకు ప్రతీకలు. ఆమె పట్టుదలకు ప్రపంచమే నిర్ఘాంత పోయినది. తన పాతివ్రత్యంతో దగ్ధం చేయగల శక్తి సీతకు కలదు. కాని రాముని చేతనే రావణ సంహారం గావింప వలెనన్నదే ఆమె నిశ్చయం. రావణుడు సీతాదేవి తల వెంట్రుకలను పట్టుకొని పైకెత్తి వెడలినాడు. మానినీ కేశ గ్రహణం మృత్యు దేవత కరగ్రహణమని రావణుడెఱుంగ జాలడు. భారతంలో దుశ్శాసను డొనర్చిన ద్రౌపదీ కేశగ్రహనమునకు ఫలితం మనం కనులార గాంచలేదా?

అశోక వనంలో బంధించబడిన సీతను సత్వరంగా తన వశం అయ్యే విధంగా పూనుకొమ్మని రాక్షస వనితలందరిని కఠినంగా ఆజ్ఞాపిస్తాడు రావణుడు. అపుడు వారు సీతను పలువిధాల బెదరించి పరిపరివిధాల హింసిస్తారు. అయినా చెక్కు చెదరని మనో నిబ్బరంతో సీతాదేవి వ్యవహరిస్తుంది.

"దీనోపారాజ్య హీనోవా యోమే భర్తానమే గురుః
తంనిత్యమనురక్తా స్మియథాసూర్యం సువర్చలాః"

"దీనుడైనా, రాజ్య హీనుడైనా నాభర్తయే నాకు పెద్ద దిక్కు." "సువర్చల సూర్యుడిని అనుసరించినట్లు రాముని యందే అనురాగవతినై యున్నాను." - దాంపత్య ధర్మానికి జీవగఱ్ఱలాంటి ఈ వాక్కులు అనకల్గిన సామర్థ్యం సీతకు తప్ప మరెవరికి వుంటుంది? ఒక మానవ కాంత రాక్షసునికి భార్య కావడం అసంభవమని నిష్కర్షగా సీతని వేదిస్తుంది.

సర్వ జీవుల యెడద హూరసమును ప్రసరింప జేయుటమే రామాయణ నీతి. అట్టి నీతికి ఆలవాలంగా సీతాదేవి వెలుగొందుతుంది. శత్రువుకైనా

అపచారం తలపెట్టని అకలంక హృదయం సీతది. రామ రావణ యుద్ధ పరిసమాప్తి అనంతరం, సీతను వేధించిన రాక్షస రమణులను దండించుటకు హనుమంతుడు పూనుకొవాలని భావిస్తాడు. కొనియాడు తగిన ఔధార్యం వివేక సంపత్తి, ధర్మాధర్మ విచక్షణ, కరుణమూర్తీ భవించిన ధర్మావతారుని సహధర్మచారిణి సీత అతడ్ని దండింపవలదని వారిస్తుంది.

"పాపానాం వాశుభానాం వావధార్హాణం ప్లవంగమ
కార్యం కరుణ మార్యేణ నకశ్చిత్నా వరాధ్యతి"

మంచి వలన కాని, చెడ్డవలన కాని వధార్హులైన వారిని ఉత్తములు, కారుణ్యామే చూపాలి అని సీత చెపుతుంది. ధర్మ ప్రభువు శ్రీరామచంద్రునికి తగిన ధర్మపత్ని సీతాదేవి సతీలోకానికే సిగబంతియైన సీతమ్మ చరిత్రను అధ్యయనం చేసి ఆమె వ్యక్తిత్వాన్ని అనుకరించి అంగనాలోకం వారిమనుగడ వెల్గించుకొవాలన్నదే వాల్మీకి హృదయం.

"విశుద్ధా త్రిషులోకేషు మాధిలీ జన కాత్మ జే
నహిహాతు మియం శక్యా కీర్తి రాత్మవ తాయధా:"

# విశ్వామిత్రుడు

ప్రపంచ కళ్యాణమునను సంతరించి, సుస్థిర శాంతి ధర్మ ప్రతిష్ఠాపన మొనర్చుటకు సీతారాములు మానవ రూపమున జనన మొందిరనున అంశం సర్వజన విదితం. వారిని సంయోగమొనర్చు శక్తి, భార్యా భర్తలు గావింప గల ప్రభావం, అవకాశం రామాయణంలో మహర్షి పుంగవుడు విశ్వామిత్రునికే సంప్రాప్తించినది. కథా సంవిధానం దృష్ట్యా విశ్వామిత్రుని పాత్ర రామాయణంలో గురుతరమైనది, కీలకమైనది. రాముని బాల్యదశ నుండి దశరథుని రాజభవనంలో ప్రవేశించినప్పటి నుండి శ్రీరాముని వివాహానంతరం తాను హిమవత్పర్వతముల కేగునంతవరకు ప్రధాన పాత్రను నిర్వహించినది విశ్వామిత్రుడు. ఈ ఋషి సత్తముడ తన ధర్మమును నిష్కళంకంగా నిర్వహించెననుట నిర్వివాదాంశం. ఈ తేజస్సంపన్నుడగు తపోనిధియెదుట శ్రీరాముడు అన్నెంపున్నెం యెఱుగని సామాన్య బాలుడు మాత్రమే! విశ్వామిత్రుని తపశ్చర్యలు, విశేషాలు, బాలకాండ యందు విశేషముగా విపులముగా వివరింపబడినవి. అవతార పురుషుడైన శ్రీరామునకు గురువుగా, పథ నిర్దేశకుడిగా, శక్తి ప్రదాతగా విశ్వామిత్రుడు వ్యవహరించుట విశిష్టతను కన్న అంశాలు. అట్టి ఆచార్యోత్తముడు, రామునికి భాగ్యముగా, రావణుని పాలిట దౌర్భాగ్యముగా పరిణమించినాడు. ఇక శ్రీరాముడు కూడా తన గురువు పట్ల తన విద్యుక్త ధర్మములను, విహిత కర్తవ్యములను సక్రమంగా నిర్వహింప గల్గిన ఆదర్శ నాయకుడు.

శ్రీరామునకు విశ్వామిత్ర మహర్షి కేవలం గురువే కాదు; వినమ్ర భావమున ఆరాధ్యుడునై ఉండెను. అతడు రామునికి సర్వ శాస్త్రములను

బోధించి - శస్త్రాస్త్రము లొసగుటయే గాక, వాని యదార్ధ తత్త్వమును గ్రహించిన వాడు కావున రాముడ్ని యధోచితంగా పూజించెను. రాముని శక్తి సామర్ధ్యములను ఆకళించుకొని వానిని వికసింప జేసిన మహానుభావుడు విశ్వామిత్రుడు. భావి కార్య నిర్వహణకు వలయు సాధన సంపత్తిని శ్రీరామునికి సమకూర్చినవాడు ఈ మహర్షియే! ఆకాలమున కోసల రాజ్యమందు పెక్కురు లెక్కకు మించిన ఋషి పుంగవులుండెడివారు. కాని వీరిలో శ్రీరాముని మహిమను గ్రహించి అతడి ధర్మకర్తవ్యపాలన, నిర్వహణకు సంపూర్ణంగా ప్రోది చేసినవాడు విశ్వామిత్రుడొక్కడే! ఇతడు విశ్వమునకే మిత్రుడు కావున విశ్వామిత్రుడని లోకవ్యవహారం కలదు. తన తపశ్శక్తిని, అద్దాని ఫలితములను, పరహితార్ధ చింతనతో, నిస్వార్ధంగా, నిశ్శంకతో పంచిపెట్టిన నిష్కామ కర్మయోగి విశ్వామిత్రుడు. ఎన్ని అవరోధములు ఏర్పడినను, మరెన్ని కడగండ్లు ఎదురైనా వానిని అధిగమించి కంకణబద్దుడై క్రతు నిర్వహణ కొనసాగించిన వీర మహర్షి పుంగవుడతడు. రావణుని క్రూర కర్మములను కనులార గాంచి రామునికి క్రమశిక్షణ అలవర్చి దుష్టశిక్షణకు శస్త్రాస్త్ర నైపుణ్యమును కల్గించి ప్రయోగింప జేసిన మహనీయనుడు విశ్వామిత్రుడు. పెచ్చు పెరిగిన రావణ బాధిత ప్రజల దీనాలాపములను, ఆర్త నాదములను విని, తాను స్వయముగా హిమవత్పర్వతము నుండి దిగి వచ్చి సిద్ధాశ్రమంలో పీఠం వైచెను. దశావతారములలో ఒకడైన వామనుడు కూడా బలిచక్రవర్తిని తుద ముట్టించినదీ సద్ధాశ్రమము నందే కదా! అందుచేత విశ్వామిత్రుని సిద్ధాశ్రమ వాసం అసుర సంపూరణార్ధం నడుము కట్టిన భగవానుని అవతరణ సూచకం. ఇచట నుండి బయలుదేరి దశరధుని కడకరేగి రాముని బడసి రావణవధకు అనువైన రాచబాటలు నిర్మించెను. రాముని జీవితమును సక్రమ మార్గమున పెట్టిన దైవశక్తియే విశ్వామిత్రుడు. సర్వకార్యముల యందు పౌరుష దైవీశక్తుల సమ్మేళనమే సత్కార్య సాధనకు బలమైన పునాది. మానవ శక్తికి సంకల్ప బలం కల్గించి పరిశ్రమ చేయుటకు అదియే దోహదకారి. దైవశక్తి ఉన్నత స్థాయిలో నుండి మానవకృషికి సముచిత ఫలమును సమకూర్చును. మానవ ప్రయత్నం ఎంతటి ప్రబలమైననున దైవబలం లేనిదే ఫలితం సంపూర్ణంగా సాధింప లేము. విశ్వామిత్ర దశరధుల సమావేశ సంఘటన అందులకు తార్కాణం.

విశ్వామిత్రుని ఆగమన సందర్భంలో దశరథుడు సముచిత రీతిని సత్కరించి మహర్షి ఆజ్ఞలు తనకు శిరోధార్యమనియు సేవకుని వలె పాలించెదనని అభయమిచ్చినాడు. తన యజ్ఞ నిర్వహణలో రాక్షసుల బారి నుండి ఆత్మరక్షణకై పది దినములు రామలక్ష్మణులను తన వెంట పంపుతున్న అభ్యర్థనకు దశరథుని మనస్సు అతలాకుతలమయింది. వికసిత వదనారవిందం విషాదపూరితమై వికలత చెందినది. ఇక్ష్వాకు వంశరాజులు తాము ఆడిన మాటకు విఘాతం లేకుండా ప్రవర్తించు సత్యవాక్య పాలనాదక్షులన్న ప్రఖ్యాతి కలవారు. అది వారికి అనూచానంగా వస్తూన్న విశిష్టత. పెద్ద వయసులో అపురూపంగా జన్మించిన నోముల పంట శ్రీరామచంద్రుడ్ని భీకర రాక్షసులతో పోరు సల్పుటకు సమ్మతించుట దశరథుని ప్రాణ సంకట మనోస్థితికి తీరని వేదనకు నాంది పల్కెను. కరాకండిగా అతడితో పంపజాలనని నుడుపుట ఆడిన మాట తప్పుటయే! అది ఇక్ష్వాకు వంశమునకు తీరని కళంకం, అపచారం. చివరకు వశిష్ఠుని అనుశాసనంతో శ్రీరాముని పంపుటకు సమ్మతించెను. దశరథుడు దేవకార్యం నిమిత్తం పెక్కు బాధలనైన యనుభవించుటకు సమాయత్తమైనాడు.

దశరథ మహారాజు సత్యవాక్యపాలనకై ప్రథమ రంగమున తీవ్ర బాధలనుభవించెను. రాముడు అడవి కేగిన పిదప కృంగి కృశించి ద్వితీయ రంగమున ప్రాణములనే అర్పించెను. సత్య సంధతకై ఎట్టి బాధలనైన భరించుటకు తమ ప్రాణములనైన తృణప్రాయంగా విసర్జించుట చేతనే ఇక్ష్వాకుల కీర్తి చంద్రికలు ఆచంద్రార్కం సుస్థిరమై దశదిశల ప్రసరించినది. రఘువంశ దీపకుల ప్రతిష్ఠ మరింత యినుమడించినది.

రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట గావించిన ప్రయాణములును, వారు గాంచిన ప్రకృతి దృశ్యములు, విన్న గాథలు - ఒడసిన అనుభవములు, వారి జీవితములకు నూతనోత్తేజము కల్గించినవి. విశ్వామిత్రుని గురుత్వము వలననే శ్రీరాముడు తన ధర్మ నిర్వహణ క్రతువుకు సకల సంపత్తిని సమకూర్చుకొని ఆత్మోద్దీపమును, ఆత్మ విశ్వాసమునను చేకూర్చుకొని తన ధర్మమును గురుతర బాధ్యతగా స్వీకరించినాడు.

మహోత్కృష్టముగా ధార్మిక ప్రమాణములు నిలుప గల్గిన మహోన్నత మంశమగుట చేతనే అతి కష్టం మీద 'బ్రహ్మర్షి' పదవిని సిద్ధింప జేసుకొని అంతటితో తృప్తి పడక, సూర్య వంశ గురుత్వ పదవికి విశ్వామిత్రుడు ఆశించినాడు. బాలురైన రామలక్ష్మణులను యజ్ఞ సంరక్షణకైగొని పోయి "బల" "అతి బల" విద్యలను వారికుపదేశించి సంతోషించినాడు. కాకున్న యుగయుగముల పరిశ్రమించి ఘోరతపస్సు చయేసి బ్రహ్మర్షి ప్రాపణం పొందిన తేజో ఘనుడు, తపోధనుడు విశ్వామిత్రునికి రాక్షస బాధానివారణ యొక అసాధ్య కార్యం ఎంత మాత్రం కానేరదు. మంత్ర విశ్రుత మార్గము.

శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రునితో నున్నంత వరకు సౌందరౌన్నత్యములతో లీనమై శాంతి సుఖములతో నోలలాడిరి. సర్వ ప్రకృతితో సంబంధ బాంధవ్యములను ప్రబలం చేసుకొనిరి. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను పెక్కు ఋశ్యాశ్రమములను సందర్శింప జేసెను. దారి పొడవునను, వివిధ మనోజ్ఞ దృశ్యములను చూపి వానిని విశదీకరించెను. ఈ బాహ్య దృశ్యములే ఆసోదరుల అంతర్దృష్టికి సాధనములయ్యెను. వీరు గంగానదిని దాటుచున్నపుడు గంగ నుండి వీరికొక గంభీర నాదం చెవుల బడెను. సరయూ గంగల సంగమ ప్రాంతమున సర్వదానినదించు ఆనంద గీతమే యా ధ్వని. అటనుండి తాటకా వనమును దాటిన వెంటనే మృదు మంజుల మారుత స్పర్శయే వారిని పులకరింప జేసినది. వారి మకేనులు చల్లబడినవి. పవిత్ర సిద్ధాశ్రమ శాంతి వాతావరణమే ఆ స్పర్శ సుఖమునకు కారణ భూతం.

రామలక్ష్మణులకు సిద్ధాశ్రమ సందర్శనం ఒక కమనీయ మధురానుభూతి. అచట గల మృగ పక్షి జాలముల సంరంభ కోలాహలమును కనులారగాంచిరి. సర్వ భూతములతో విశ్వామిత్రునికి గల సన్నిహిత బాంధవ్యమును మనసార తిలకించిరి. సిద్ధాశ్రమం నుండి మిధిలకేగు తరి మృగ పక్షి జాలములు వారికి సుస్వాగతం పల్కినవి. వారి యెడ బాటుకు విచారం ప్రకటించినవి. విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో ముందుకు ప్రయాణం సాగించినాడు. మార్గమధ్యంలో వర్తకులగు సూర్య వంశ ప్రభువుల

ధార్మిక ప్రవృత్తి యందు గల ప్రగాఢానురాగమే ఆ మహాతేజ శ్శాలికి ఆ వంశ గురుత్వం స్వీకరింప వలెనన్న ఉత్కంఠకు కారణమయ్యెను.

సుందరకాండలో హనుమంతుడెట్లు ప్రధాన భూమికను నిర్వహించెనో బాలకాండలో విశ్వామిత్రుడు సూర్యవంశమునకు రాజర్షియై పూర్ణ తపశ్శక్తిని ఒడసి, అయోధ్యలో దశరధ సౌధమును వీడినది లగాయతు శ్రీరామునికి గురువుగాను, భక్తుడుగాను మారిపోయెను. ఆ రెండు ధర్మాలు నిర్వహించుటలో సఫలీకృతు డయ్యెను. మాతాపితరులకు బిడ్డల యందు గల వాత్సల్యము మించినది గురు శిష్య వాత్సల్యం. జననీ జనకాల ప్రేమబంధం భౌతికం; గురు శిష్యుల అనుబంధం మానసికం, ఆధ్యాత్మికం. శ్రీరాముడు తనతో ఉన్నంత కాలం ఒక పర్యాయమైనను అవతారమూర్తిగా అతడు అభివర్ణించలేదు. దశరధుని సన్నిధిలో కూడ 'శ్రీరాముని నేనెఱుంగుదును; ఆయన సత్య పరాక్రమశాలి' (అహం వేద్మి మహాత్మానాం రామం సత్య పరాక్రమమీ) అని మాత్రంనుడివెను. వశిష్ఠుడు శ్రీరాముని సన్నిధిలో బాల్యం నుండి సర్వదా కనిపెట్టుకొని ఉండినను ఆయన తేజశ్శక్తిని గ్రహింప జాలక పోవుట యిచట గమనార్హం. రావణుని గూర్చి ఒక్క మాటయైనను రామునికి విశ్వామిత్రుడు ఏ సందర్భంలోను ప్రస్తావించలేదరు. దుష్ట రావణుని నామమైన ఉచ్చరించుటకు ఇచ్చగింపలేదు. శ్రీరాముని ఆత్మోద్దీపనమే తన విహిత కర్తవ్యంగా, విద్యుక్త ధర్మంగా భావించిన వివేకధనుడు విశ్వామిత్రుడు శ్రీరామునిలోని గూఢ శక్తి ప్రజ్వలన, దాని వికాసం తన పరమార్ధమని భావించిన ఉచితజ్ఞుడు విశ్వామిత్రుడు.రాజాధిరాజు ముద్దు బిడ్డలగు రామలక్ష్మణులను సరయూ నది తీరం ప్రశాంత పచ్చిక బయళ్ళలలో నిద్రింప జేసిన ఘనత, క్రమత విశ్వామిత్రునికే దక్కింది. తెలతెలవారు చుండగా విశ్వామిత్రుడు శ్రీరాముడ్ని నిద్రనుండి మేల్కొలుపు శ్లోకం ఎంతటి మహిమాన్వితమో పరికించండి:

"కౌసల్యా! సుప్రజారామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూలం! కర్తవ్యం దైవమాహ్నికమ్"

ఇట్టి ధర్మ నిర్వహణ శిక్షణ, ఉన్నత తేజోద్దీపక ప్రేరణ విశ్వామిత్రునికి కాక మరెవరికి సాధ్యపడుశోణా' నదీ తీరమున రాత్రి విశ్రమించినపుడు తన

వంశగాధను రామలక్ష్మణులకు విశ్వామిత్రుడు విపులంగా వెల్లడించెను భగవంతుని అవతార గాధలు, ఇక్ష్వాకుల వీరచరిత్రలు, విశ్వామిత్రుని స్వీయచరిత్ర మున్నగునవి రామలక్ష్మణులకు ప్రబోధకరములై ఉత్తేజితులను చేసినవి.

వాల్మీకి కవి "ప్రకృతి కుడ్యములుగను, ఆకాశమును పైకప్పుగల భవనమున, శ్రీరాముని భగవత్స్వరూపునిగను, విశ్వామిత్రుని పూజారిగాను జేసి ఆ దేవాలయంలో రామాయణ పారాయణం రేబవళ్ళు జరుగునట్లు చిత్రించెను.' (రామాయణ పరమార్థంలో శ్రీ ఈ. పాండు రంగారావుగారి వ్యాఖలు)

దైవ సంభూతుడగు శ్రీరాముని యెడ విశ్వామిత్రుడు ప్రకటించిన భక్తి, అనురాగం, అందులకు ప్రతిస్పందనగా శ్రీరాముడు ఆయన పట్ల చూపిన శ్రద్ధా భక్తులు, వినయ విశ్వాసాలు - రాముని భగవత్స్వరూపా విష్కరణకు ప్రబల నిదర్శనమనులు. తాటక వధ, సిద్ధాశ్రమమున సుబాహు సంహరణ, మారీచు నొక్క బాణంతో సుదూర ప్రాంతములకు పారవైచుట మున్నగు ఘట్టములు రాముని దైవత్వ శక్తికి తార్కాణములు వానికి సూత్రధారి విశ్వామిత్రుడు. అహల్యా శాపవిమోచనా సంఘలనకు దోహదకర్త ఈ మహర్షి పుంగవుడే! శివ ధనస్సును భగవదంశ సంభూతుడు శ్రీరాముడే ఎత్తెడి సమర్థుడని భావించి అందుకు పురికొల్పిన వాడు విశ్వామిత్రుడు. సీతారాముల వివాహంతో విశ్వామిత్రుని వినీత ధర్మ కార్య నిర్వహణ సఫలీకృతమై పరిసమాప్తి చెందుతుంది. హిమాలయములకేగిన అతని జాడలు, ప్రసక్తి రామాయణంలో విపులంగా మకనం పరికించం. విశ్వామిత్రుని నిష్కామ కర్మకు ప్రబల నిదర్శనం అతడి నిరాడంబర నిష్క్రమణం.

"అచింత్య కర్మా తపసా బ్రహ్మర్షి రతుల ప్రభః
విశ్వామిత్రో మహాతేజావేత్స్య సంపరమాంగతిన్
నాస్తి దన్యతరో రామ త్వత్తో2న్యో భువికశ్చన
గొప్తా కుశిక పుత్రస్తే యేనతప్తం మహత్తపః

# అగస్త్యుడు

వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణంలో తపః సంపన్నులగు ఋషులు అనేకులు మనకు తారసిల్లుదురు. అట్టి తాపస మండలంలో అగస్త్యుడొక అసామాన్య ఋషి పుంగవుడు. అగము (వింధ్య పర్వతం) నడచుటచే అతడికి ఆపేరు కల్గినదని ప్రతీతి.

"అగస్త్య ఇతి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా"

ఇతని ఆశ్రమ ప్రాంతమున దేవతలు, యక్షులు, నాగములు, పతంగములు మున్నగు వారు నియమితాహారములను గైకొనుచు ధర్మమును ఆరాధించుచు వసియించు చుండుట గాన వచ్చును.

"అత్ర దేవాశ్చ యక్షాశ్చనాగాశ్చ పతగై స్సహ
వసంతి నియ తాహారాధర్మ మారాధయిష్ణవః"

అహింసా మార్గ ప్రవర్త కుల చెంతసకల భూత రాశి తమ తమ వైర భావములను విస్మరించి యుండునని 'పతంజలి' తన యోగశాస్త్రంలో ప్రవచించిన అంశం సువిదితం.

(అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైర త్యాగః)

పరశురాముని వద్ద గల వైష్ణవ ధనస్సు ఒకప్పుడు వరుణుడు గ్రహియించి అగస్త్యుని ఆధీనం కావించెను. అప్పటి నుండి ఆచాపం అగస్త్య మహర్షి వద్దనే అలరారుచున్నది. అగస్త్య మహర్షి సందర్శనమునకు తన

అంతరంగం ఆత్రపడుచున్నదని శ్రీరాముడు సుతీక్ష మహర్షి కెఱింగిస్తాడు. సాధు జన సంగతి సర్వార్థ సాధకము గదా! రాముని అభిలాషను సుతీక్ష్ణుడు హృదయ పూర్వకముగా అభినందించెను. దుష్ట శిక్షణ సత్కార్య సాధనలో అంతర్భాగమైన రావణ వధ నిమిత్తం అతని ప్రాణములు గొన జాలు బాణం కూడా అగస్త్యుని వద్దనే కలదు. ఆ ధనుశ్శరముల సంపాదన రామునికి అవశ్య కర్తవ్యం. కనుక అగస్త్య సమాగమమునకై అతని ఆశ్రమమునకు పయనమగుట రామునికి అనివార్యం.

ఇక అగస్త్య మహర్షి మహిమ అత్యద్భుతం. ఇల్లలుడను రాక్షసుడొకడు కపటపు ఆలోచనలతో ఆ ప్రాంతమున నివసించు ఋషుల ఆతిథ్యమున కామంత్రణ మొనర్చెడివాడు. వాతాపియను నతడు అతడి సోదరుడు, ఆ విందున పశువుగా మారుచుండెడివాడు. ఇల్వలుడు వాతాపిని వధించి ఆ మాంసంతో నాలుక త్రుప్పుడుల్లునట్లు భోజ్య పదార్థములు పేసగించుచుండెడివాడు. కల్లకపటము లెఱుంగని ఆయా మంత్రిత ఋషి సత్తములా దుష్ట యసురుల వర్తనము నెఱుంగ లేక రుచ్యమగు ఆ భోజ్యములను కడుపార నారగించెడివారు. అంతలో సోదరుని పిలుపులు విని గర్భ శోకమున ఖండఖండములుగా నున్న వాతాపి రూపొంది మేక వలె అరచుచు ఋషి కుక్షిని చీల్చుకొని ఈ వలకు వచ్చెడివాడు ఆతిథ్యమునకై పోయిన అమాయక ఋషివరులు అసువులు గోల్పోవు చుండెడివారు. అంతట ఆ అసురసోదరులిరువురు ఆనందాతిరేకంతో ఆ ఋషి మాంసఖండముల ఆరగించి అలరు చుండెడివారు. ఇట్లు వేలకొలది మునులను వారు భక్షించెడివారు. కొంతకాలమునకు ఈ వంచన గ్రహించిన దేవతలు అగస్త్యుని దరిజేరి సోదరుల ఆగడములను నిగ్రహింపమని ప్రార్థించిరి. అందులకు అగస్త్యుడు అంగీకరించెను. ఇల్వలుని నియంత్రణమును అంగీకరించిన అగస్త్యుడు 'వాతాపి' ని భుజించి గర్రున తేన్చెను. ఇల్వలుడు యథాప్రకారం వాతాపిని పిల్చుచుండగా అగస్త్యుడు పకపక నవ్వి 'నాచేత జీర్ణంగావించు కొనబడిన నీ సోదరుడు బయటకు రాగల్గిన శక్తి ఇంక ఎక్కడిది' అని పల్కెను.

[illegible] అగస్త్యుని శక్తిలో [illegible] ప్రాణాలను నెత్తుటిధారలలో నేకప్పి [illegible] ప్రద్ధమైన [illegible] మంటలతో దగ్ధ [illegible] మూసుకొన్న అగస్త్య మహర్షి అంతటి [illegible] కార్యము నెరవేర్చగలిగిన [illegible] సమర్థుడు.

తాపస మండలమునకు ముకుటాయమానమైన తపస్వి పుంగవుడు అగస్త్యుడు. అతడి ఆశ్రమం కర్మ భూమియే గాక భోగ భూమియునై యుండెను. లౌకిక ఆధ్యాత్మికముల పరస్పర సమ్మేళనముచే పరిణతి నొందిన పవిత్రాశ్రమ స్థానమయ్యెది. ముముక్షువులకు ఈ ఆశ్రమం మార్గదర్శకముగు ఉనికిపట్టు. అప్సరోభామినుల నృత్యగానములకియ్యది ఆటపట్టు. నాట్య విద్యా ప్రావీణ్యం సంతరించుకొన్న అప్సరాంగనలు తమ విద్యానైపుణ్యములను ప్రదర్శించుకొను ప్రాంగణమిది. అక్షర దేవతలు పదునేర్పుటకు ఈ ఆశ్రమంలో ప్రత్యేక స్థానములు ఏర్పాటుచబడినవి. వృత్యాప్తు వంటి దైత్యుని నిగ్రహించిన అగస్త్య మహర్షి దక్షిణ దిక్కును సాధు జన సేవ్యముగా నొనరించెను. అగస్త్యుని ప్రభావం వలన రాక్షసులు ఈ దక్షిణ దిశ వైపు చూచుటకు భయపడుదురు. దానిని ఆక్రమింప జాలకున్నారు. కావుననే దానికి అగస్త్య దిశయని పేరు వచ్చినది. ఆయన ఆదేశము వలననే వింధ్య శైలము పెరుగకున్నది. ఈ ఆశ్రమంలో క్రూరుడు, శఠుడు, అసత్యవాది, నృశంసుడు, కామ వర్తనుడు బ్రదుక జాలడు. అగస్త్య ముని అట్టివాడు. ధర్మమును ఆరాధింప గోరెడు దేవతలు, యక్షులు – ఇచట నియతాహారులై నివసింతురు. ఇచట దేవతలు తమ్ము ఆరాధించు భూతములకు అమరత్వమును ప్రసాదింతురు.

సీతారామలక్ష్మణులు - ముగ్గురు తన ఆశ్రమమునకు సందర్శింప వచ్చు చున్నారను వార్త విన్నంతనే మహదానంద భరితుడై ఆ మహర్షి పుంగవుడు అభ్యుత్థాన మొనర్చి ఆదర భావంతో స్వాగతించి, అగ్నిని ప్రేల్చి అర్ఘ్య పాద్యాదులతో సత్కరించి వారిని ఆరాధించెను. అగ్ని యందు హోమమొనరించి ఆతిథ్యము నొసంగి అతిథిని పూజించుట ఆర్య సంప్రదాయం.

"అగ్నిం హుత్వా ప్రదాయార్ఘ్య మతిధిం ప్రతిపూజనేత్
అన్యధా ఖలుకాకుత్స్థ తపస్వీ సముదాచరనే"

అగస్త్యుని వద్ద గల వైష్ణవ మహచ్చాపం విశ్వ కర్మ నిర్మితం. హేమరత్న విభూషితమైన దివ్యమైన ఈ చాపం విష్ణు మూర్తిది. సూర్య సమానమైన ఈ ఉత్తమ చాపం బ్రహ్మదత్తం. అక్షక సాయకములైన ఈ రెండు తూణీరములు మహేంద్రుడిచ్చినవి. సువర్ణమయమైన ఈ కోశమందు హేమభూషితమైన ఖడ్గం కలదు. ఈ ధనుశ్శరములను, తూణీరములను, ఖడ్గమును స్వీకరించమని అగస్త్యుడు రాముడ్ని అభ్యర్థిస్తాడు. రాముడు వానిని స్వీకరిస్తాడు. ప్రస్తుతం జానకీ సంరక్షణ నిమిత్తం వానిని పరిగ్రహింపవలసి యున్నది.

ఆ సందర్భంలో అగస్త్యుడు సీతాదేవిని మిక్కిలిగా ప్రశంసిస్తాడు. సుకుమారీ రత్నమైన సీతాసాధ్వి ఎన్ని కడగండ్లు నైనను లక్ష్యపెట్టక భర్తననుగమించి బహుళ దోష భూయిష్టమగు నీ అరణ్య భూములకే తెంచినది. నీ వెంట వచ్చి అతి దుష్కర వనవాసమునకు పూనుకొన్న పునీతురాలు సీత నీ భార్య. ప్రపంచరీతిని పరికించినచో సమర్థుడగు భర్తను సంతోషపెట్టుట, విషమస్థుడగు భర్తను విడనాడుట, స్త్రీజన స్వభావముగా గోచరమగును. సాధారణంగా స్త్రీలలో మెఱుపు తీగల వంటి చాంచల్యం, శస్త్రముల వంటి తీక్షతయు, వాయుగరుడుల వంటి వేగమును కనబడుచుండును.

"శతహ్రదానాం లోలత్వం శస్త్రాణ్ణాం తీక్షతాం తధా
గరుడా నిలయోః శైఘ్యమను గచ్ఛాంతి యోషితః"

(అరణ్యకాండ - 13 సర్గ - 6 శ్లో॥)

రామ ప్రభూ! నీ భార్య సీతాదేవిలో పైనుదహరించిన దోషము లిసుమంతయును లేవు. ఆమె అరుంధతి వలె అత్యంత శ్లేష్యపాత్రురాలు. కనుక నెల్ల విధముల ఆమెను సంతోష పఱచుచుండుమని హితవచనం అగస్త్యుడు పలుకుతాడు. సీతాదేవికి సంతోషము కల్గునట్లు ప్రవర్తిల్లుమని అగస్త్యుడు సూచించినాడు. ఆ విధముగా అగస్త్యుడు చెప్పుట వలననే ఆమె

కోరిక అసమంజసంగా తోచినను దానిని నిరాకరింప లేక పోయినాడు శ్రీరాముడు. మారీచుడు మాయా మృగ వేషధారణమును గూర్చి లక్ష్మణుడు సందేహించి నివారించినను రాముడు సీత కోరికను త్రోసి పుచ్చలేదు. అగస్త్యునికి మాటకు రాముడు అధిక ప్రాధాన్యత నొసంగెను.

రాముడు ప్రాంజలియై భార్యా భాతృసహితుడై అగస్త్య సందర్శనంతో సంతుష్టినొంది తాను ధన్యుడనైతినని మనసారా అభినందిస్తాడు. తమ ఆశ్రమ నిర్మాణమునకు అనువైన ప్రదేశమును సూచింపమని అగస్త్యుడ్ని రాముడు అభ్యర్థిస్తాడు. అచటికి రెండు యోజనముల దూరమున గల బహు మృగ ఫలోదమైన 'పంచవటి' యను ప్రదేశాన్ని నిర్దేశిస్తాడు. ఖరాది రాక్షస సంహారమునకు అనువైన రాచబాటలు నిర్మించడం కోసం, శూర్పణఖ శృంగ భంగం చేసి, రావణునిచే సీతాపహరణ వృత్తాంతం కథా సంవిధానాలకు సూత్రధారుడిగా అగస్త్యుడు నిర్వహించిన పాత్ర మహత్తరమైనది, మహిమోపేతమైనదని భావించడం విద్యుక్త ధర్మం, కర్తవ్యం.

శ్లో॥ "కుతోనిశ్చ్య మితుంశక్తిర్మయా జీర్ణస్య రక్షసః
అత్ర వీత్ర్వ హసనీధీ మానగస్త్యో ముని సత్తమః"

# భరతుడు

సౌభ్రాత్రమునకు [illegible] ప్రతీక. అది రామాయణమునందు పరాకాష్ఠకు చేరుకొన్నది. [illegible] నట్టి సౌభ్రాత్రమును మెచ్చుటకు మనకెంత కాలమైనా [illegible] అపూర్వమైనట్లు వారి పవిత్ర [illegible] కూడ [illegible] "[illegible] వంశ్యా రామాయణం" లో శ్రీరామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులను గూర్చి పల్కిన సూక్తులెంతటి మహత్తరమైనవో పరికింతాం.

"[illegible]
[illegible]"

[illegible] యొక్క విశ్వరక్షా దీక్షా [illegible] భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు [illegible] అవినాభావ [illegible].

[illegible] సోదరులు నాడు మువ్వురు [illegible] భక్తిని ప్రదర్శించిరి. మాతా, పితరులు, [illegible] రాముని యెడ తమకు గల భక్తి [illegible] రాముని యెడ తమకు గల భక్తిని పెంచుటకు [illegible] పెంపొందించుకొనిరి. తద్భక్తి [illegible].

లక్ష్మణునికి రాముని యందు గల భక్తి అనన్య భక్తి. అదియొక ఏకాంతిక భక్తిగా పరిగణింపనగును. అగ్రజునకు అపకారం తలంచి భరతుడు ఏతెంచెనను శంకతో భరతుడ్ని తంపనుద్యుక్తుడవుతాడు సౌమిత్రి అటులని వివిధ సందర్భములలో లక్ష్మణుడు భరతుడ్ని సంపూర్ణ హృదయంతో ప్రేమించకను పోలేదు. ఇక శత్రుఘ్నుడు సార్థక నామధేయుడు. సర్వదా శత్రుఘాతకుడై అగ్రజుల కెదురైన అపాయముల నివారణకుపాయముల నారయుచునే ఉండెడివాడు. ఏకలక్ష్య సాధన కవతరించిన భిన్న జ్యోతుల వలె వారి మనుగడ ద్యోతకమై యుండెడిది. ప్రాణికోటి చైతన్యమునకు భాస్కర కిరణ జాలముల వలె జీవికి జీవముల పగిది, రామునికి ముగ్గురు సోదరులు ద్వితీయ హృదయములై పవిత్ర సౌభ్రాతలను ప్రకటించిరి.

రాజులు తరచుగ జ్ఞాతుల యెడ ప్రాణ హారతులు, ప్రాణచ్ఛేదకులునై యుందురు.

"పితౄన్ భ్రాతౄ నిఘ్నంతి అసుతృపోరన్నృపాః" అని భాగవతంలో చెప్పినట్లు నృపులు, తండ్రులను, సోదరులను సంహరింతురు. తల్లి గర్భమును చీల్చుకొని జననమొందిన ఎండ్రకాయలు, త్రేళ్ళు మాదిరి రాజ్య కాంక్షాలోలురైన రాజపుత్రులు తమతమ తల్లితండ్రులను, సోదరులను చంపవెనుకంజ వేయరని 'కౌటిల్యుడు' వివరించినాడు. కాని ఇక్ష్వాకులట్టివారు కాదని కవికుల శిరోమణి మహాకవి కాళిదాసు వివరిస్తాడు :

"దురితైరపికర్తు మాత్మసాత్ ప్రయతంతే నృపసూనవో హియత్
తదుపస్థితి మగ్రహీదజః పితురాజ్ఞేతిన భోగతృష్ణయా"

రాజకుమారులు దుష్కర్మలచే రాజ్యమును వశపఱచుకొన యత్నింతురు. అజమహారాజు అట్లుగాక బోగము నందు విరక్తిచే పిత్రాజ్ఞ యందలి అనురక్తితో మాత్రం రాజ్యమును గ్రహించెను. ధర్మ దీక్షాపరాయణులైన యిక్ష్వాకకులు ఎల్లరు ఎల్లవేళల సౌభ్రాత్ర పరిరక్షణ చేసి లబ్ధ ప్రతిష్ఠులైరి. ప్రపంచేతిహాసములలో అట్టి పవిత్ర నిర్మల నిశ్చల భ్రాతృభక్తిని రామాయణమున తప్ప మరెందును మనం కాంచ జాలము. ఈ అనన్య ప్రేమయే రాముని తల్లియగు కౌసల్య అవ్యాజ ప్రేమకు లక్ష్మణుని పాత్రుని గావించెను.

ఆదర్శమున మిన్నయగు భరతుడు సుగుణ భరితుడు నిరంతరం శ్రీరామచంద్రుని దివ్య మంగళ విగ్రహమును తన మనోనయనముల గాంచి ధ్యానించెడి వాడు. ఇక ఆచరణంలో మిన్నయగు లక్ష్మణుడు రాముని అనుగమించి, పూజించి, సేవించి క్రియా పరిపూర్ణుడయ్యెను. అందుకే వాల్మీకి రామాయణంలో ఈ పవిత్ర సౌభ్రాత్రమునే ఇక్ష్వాకు వంశజులకు కులధర్మమని యెలుగెత్తి చాటినాడు. మహాకవి కాళిదాసు "సౌభ్రాత్ర మేషాం హికులానుసారి' ' అని రఘు వంశంలో లెస్సగా వివరించినాడు.

అగ్రజుని యెడ అనుజల భక్తి ప్రవత్తులు ఈ విధంగా యినుమడించగా ఇక రాముని వాత్సల్య అనురాగము లోకపరి పరికింతము :

**"యద్వినా భరతం త్వాంచ శత్రు ఘ్నంచాపి మానద**
**అస్తి కించిత్ సుఖం లోకేభస్మతత్ కురుతాం శిఖీ"**

లక్ష్మణా! నీవు, భరత శతృఘ్నులు లేని సుఖానుభవము ఏదైన నాకున్నచో అది అగ్ని యందు భస్మమగు గాక! సోదరులు తన యెడ చూపిన భక్తి ప్రేమలు వెల్లువలై ప్రవహింప రాముని హృదయాంతరముల నుండి ఉబికిన ప్రేమ పూరిత వాత్సల్య భరిత సత్య వాక్యమిది. అపార పారావారము వలె నేల నాలుగు చెరగుల నతిక్రమించి ప్రవహించిన దశరధ తనయుల పవిత్ర సౌభ్రాత్రమును మాటలలో వర్ణింప ఎవరికిని శక్యం కాదు.

సోదరత్వంలో భరతుడు సుగుణాల భరితుడు. ఇతడు రామభక్తిలో లక్ష్మణుని కన్న మిన్న. లక్షకమణుడు తన శారీరక సుఖములను పరిత్యజించి రాముని వనవాస దీక్షలో అనుగమించి బుద్ధి పూర్వకంగా తన మనోభీష్ట ప్రకారం అష్టకష్టములను అనుభవించుటకు సిద్ధపడెను. రాజకుమారుడయ్యు. తాను రామసేవలకుడై కంటికి రెప్పవలె అహర్నిశలు సీతారాముల పరిచర్యరలో పరమానందబరితుడై సంతుష్టి అనుభవించెను. కాని భరతుడు కేవలం శారీరక సుఖములనే కాదు, విశాల సామ్రాజ్య పరిపాలనాది భోగములను విసర్జించి శ్రీరాముని ఆజ్ఞను శిరసావహించిన ఉత్తమ ఆదర్శ సోదరుడు. రాముడు చెంత లేకున్నను అతని ఆజ్ఞాపాలనములో చిన్నమెత్తు ప్రమత్తతకు

తావియ్యలేదు. రాముని పాదుకలను సైతం సింహాసనమునుంచి తానతడి ప్రతినిధిగ రాజ్య పాలనం గావించి అతని సొత్తు భద్రంగా అప్పగించెను. తనపాలిట బడిన రాజ్య రమా వైభవమును క్రీగంటనైన వీక్షింపక అందులకు అన్ని విధాల అర్హుడైన రామునికి తిరిగి అప్పగించుట భరతునికి గాక ఈ చరాచర జగతిలోఎవరికి సాధ్యపడును? పరిపూర్ణ యౌవనవతియగు, పరమ సుందరి చెంత నిష్కల్మష బ్రహ్మచర్యవ్రత నిష్ఠాగరిష్ఠుడైన ఆమెను అర్హుడైన వరుని వద్దకు పంపుట వంటి అతిలోక అసిధారా వ్రతమును భరతుడాచరించెను . భరతుని దృఢ భక్తి, రాజ్య తృష్ణా పరాఙ్ముఖతయు మాతృదేవి కైకయీ కల్మషమును పరిహరింప గల్గినది. ఈ సందర్భమున మహాకవి కాళిదాసు ఎంత రమణీయంగా విశదీకరించిడో ఆస్వాదించండి :

శ్లో॥ దృఢభక్తిరితి జ్యేష్టే రాజ్య తృష్ణా పరాఙ్ముఖః
మాతుః పాపస్య భరతః ప్రాయశ్చిత్తమివాకరోతి"

రామాయణ పాత్రలలో దేనికవే విశిష్ట గుణపారమును ప్రబోధించునవే అయినను సీతారాముల అనంతరం భరతుని సౌశీల్యం మకుటాయిమైనది. భ్రాతృభక్తికి భరతుని జీవితం. శీలం ఆదర్శప్రాయ నిరవ్రచనాలుగా భాసిల్లినవి. అనవరతం ప్రక్కనే ఉండి అరణ్యములకు అనుగమించిన సేవ లొనర్చిన లక్ష్మణుని తలదన్నిన సుగుణ సంపదకు ఆకరుడు భరతుడు. భ్రాతృవత్సలుడగు భరతుడు. భ్రాతృవచనానువర్తియగు భరతుడు - ప్రతిజ్ఞా నిర్వహణా ధురీణుడు భరతుడు. రామ పాదుకలను అభిషేకించి రాజ్య శాసనమును వానికి నివేదించుచు పధ్నాలుగు వత్సరాలు గడిపిన నిస్వార్థా త్యాగమూర్తి భరతుడు.

సీతారామలక్ష్మణులు వనవాసమునకేగు తరి భరతుడు మేనమామల యింట వద్దయున్నాడు. అతడికి ఏలనో దుశ్శకునములు గోచరించినవి. ఇంతలో అయోధ్య నుండి పరిచారకులు వచ్చిరి. వెనువెంటనే బయలుదేరమని వార్త యెఱింగించిరి. ఆత్రముగా అతడు అయోధ్యకు పయనమయ్యాడు. అయోధ్యలో కైక నివాసములో 'సర్వభూతముల సహజ గమ్యస్థానమునకు తన తండ్రి అరిగి

నాడన్న కైక మాటలు అతని చెవిని బడగానే అతని తలపై పిడుగు పడినట్లయ్యేను. హాహాకారములతో విలపిస్తూ అవనీతలంలో భరతుడు క్రిందబడినాడు. అతడికి స్మృతి వచ్చినంతనె కైక ఓదార్చి తాను కోరిన వరముల గూర్చి రాముని వనవాసం గూర్చి కైక చల్లగా బయట పెట్టెను. అపుడు కనుగవ నిప్పులు రాలగా తల్లిపై ఆగ్రహావేశాలతో ఊగిపోయినాడు భరతుడు. తల్లియని కూడా సంకోచించక అమెను 'నీచయతీ' 'రాక్షసీ' 'పతిహంత్రీ' అని సంబోధించి పరిపరివిధాల భరతుడు దూషించిన వైనం అతడి అపార సోదర వాత్సల్యానికి దర్పణం పట్టింది. పితృవాక్య పరిపాలనా దక్షుడు జనానురంజకుడైన రాముని యెడల తనకు గల గౌరవమును ధర్మ నిరతిపై ప్రామాణిక బుద్ధిని ప్రకటించుటలో భరతుని మించిన వారు ఈ జగతిలో కానరారు. శత్రుఘ్నుడు రోషావిష్టుడై అచట నున్నవారిపై ముఖ్యంగా కైకపై గవిసిన సందరర్భంలో భరతుడు అతడిని వారించి తన సజ్జనత్వాన్ని ప్రకటిస్తాడు. దుష్టాత్మమైన కైక నందనుడగుట తన తప్పిదమేది లేదని పలికి భరతుడు తనర అకలంక శీలమును ఋజావు చేసికొంటాడు. శ్రీరామునికే పట్టం కట్టెదననియు అతడు రాకున్నచో తపోవేషములో తాను వనవాస దీక్షాపరుడై అడవులలో రామునితో గడిపెదనన్న తన సంకల్పాన్ని వెలిబుస్తాడు. ఆ విధంగా రాజ్యంలోని అమాత్యుల, పురోహితుల, ప్రజల, సభాసదుల మన్ననలను ఒడసిన నిష్కళంక సచ్ఛీలుడు భరతుడు తాను పల్కిన రీతిని సైన్య సమేతుడై తల్లులతో, అమాత్యులతో, పురోహితులతో కూడి రాముని అడవుల నుండి తోడ్కొని తెచ్చుటకై వెడలుతాడు. మార్గ మధ్యంలో భరతుడి పయనాన్ని అపార్థం చేసుకొన్న గుహుని రోషోక్తులకు సుస్మితాస్యుడై రామునికి పట్టం కట్టపోవుచున్నాననియు, ద్రోహబుద్ధి లేదని చెప్పి నచ్చజెప్పి గుహుడ్ని ఆశ్చర్య చకితుడ్ని గావిస్తాడు. తదనంతరం భరద్వాజ మునికి గల సందేహమును నివృత్తి చేసి ద్రోహ చింతకు తన హృదయంలో స్థానం లేదని చాటి చెప్పిన నిష్కళంక నిర్మల చరితుడు భరతుడు. రామానుజుని అనుమానమునకు సైతం గురియై భరతుడు పరోక్షంగా రాముని ప్రశంసా పరంపరలకు పాత్రుడైనాడు. లక్ష్మణుడు వివేక రహితుడై భరతుని

గూర్చి పరోక్షంగా పల్కిన పరుషోక్తులకు రాముని తీవ్ర వాగ్బాణాలకు అనవత శిరస్కుడు కావలసి వచ్చింది. రాముని అంతగా అలరించిన భరతుడు అంతటి అదృష్టశాలి వేరొకడు. రామాయణమున కానరాడు.

భరతుని సౌశీల్యం రామాయణంలో ప్రముఖంగా భాసింప జేయు సన్నివేశం - పాదుకా పట్టాభిషేక ఘట్టం. భరతునికయి వీడ్కోలు చెప్పిన సందర్భంలో అశ్రుజలపూరితులై అన్నదమ్ములు కలతబారగా, గద్గద కంఠగల బద్ధులైన కౌసల్యాది రాజమాలతు రామునితో చెప్పిపోవుటకు శక్తి చాలక తలలు వంచుకొని తరల సాగిరి. తన మాతల కెల్ల అభివాదమొనర్చి తనకుటీరంలోనికి నిష్క్రమించిన ఆ సన్నివేశం చరిత్ర కపురూపమైన సముజ్జ్వల చిత్రం. భాతృజనమునకు ఆదర్శ ప్రాయపరమోదార పవిత్ర తరసం ఘటనమది. సహృదయుల హృదయారవిందములను జలదరింప జేయుకారుణ్యా రస తరంగిణి అది. మానవులను సైతం దేవతలుగా మార్చగల మహోత్కృష్ట శక్తి పాతమది. ఈ పాదుకాపట్టాభిషేకమునకు పవిత్రతను ఆపాదించినవాడు భరతుడు. కనుకనే వేదాంత దేశికాచార్యులవారు ఉపజ్ఞా మహిమచే సమస్త ధరణీ తలమున రాఘవపాదుకా ప్రదానమనును సమాదూఢమొనర్చిన భక్తవరులలో ప్రథమ ఉదాహరణముగా ప్రణమిల్లి ప్రశంసించినాడు :

"భారతీయ పరం నమోఽస్తు నిత్యం ప్రథమో
దాహరణాయ భక్తి భాజాం యదుపజ్ఞఖమశేషతః
పృథివ్యాం ప్రథితో రాఘవ పాదుకా ప్రభావః"

అట్టి భక్తాగ్రేసరుడు భరతుడు రాముని వాత్సల్యమునకు పాత్రుడై యాతని పాదుకలను వశిష్టుని సూచననుసరించి మస్తకమున నడికొని నంది గ్రామమునే నివసించి, అయోధ్యలో కాలిడక, వినమ్ర నిరతితోని జాన్వయ కీర్తి చంద్రికలు ప్రసరించునట్లు భూప్రజాసౌఖ్యములను సమపాళ్ళలో రంగరించి పాలించిన ధన్యజీవి, పుణ్యశాలి భరతుడు.

రామభరత సమాగం రామాయణ సన్నివేశాలలో కడు హృద్యమైనది. దయనీయమైనది. ముని ప్రకాండుల ప్రశంసలచే ముంచి ఎత్తబడిన మహత్తర

సంఘటన అది. తనకు దక్కిన రాజ్యం అన్నకు సమర్పించే అనుంగు సోదరుడు పాద సన్నిధికి పెన్నిధి వలె వచ్చిన రాజ్య రమా వైభవాన్ని తిరస్కరించే అన్నగారు - మహాతేజస్వంతులైన ఆ అన్నదమ్ముల అపూర్వ కలయికను చూడవచ్చిన మహర్షి పుంగవులు మహదానంద భరితులై పులకరించి పోయారు. రాముడీ సందర్భములోనే పెక్కు విధాల భరతుడు నోదార్చి వివిధ తత్త్వ రహస్యములను ఉపదేశిస్తాడు. ప్రశాంత వాక్యములతో భరతుని పరితాపాన్ని పరిహరిస్తాడు. ఎంతైనను భరతుని సంతాపాగ్ని చల్లబడలేదు. తాను సంహాసన మధిష్టించుట తలకుమించిన పని అని తన దృఢ నిశ్చయాన్ని, అంతరంగాన్ని భరతుడు నివేదిస్తాడు :

"రామా! హేమాలంకృతమగు నీ పాదుకలను అధిరోహింపుము. ఇవియే సర్వలోకానికి యోగక్షేమ్మా కల్గిస్తాయి. అట్టి అచంచల విశ్వాసంతో భరతుడు అయెధ్యకు మరలి వస్తాడు. భరతుడొనరించిన ఈ ప్రార్ధన ఆలించి దయార్ద్ర భావంతో అనుగ్రహించి తన చరణ ప్రవాళమునలచే వానిని పునీతమొనరించి తేజోవంతుడగు భరతుని కోర్కె మన్నిస్తాడు. ఆ సందర్భంలో రామునికి ప్రణమిల్లి తన అంతరంగ నివేదనం గావిస్తాడు :

"రామా! నీవలె జటాపటలములు ధరించి, నారబట్టలు వేసుకొని, ఫలమూలాదులచే ప్రాణములు నిలుపుకొనుచు, అయోధ్య పట్టణ బహిః ప్రదేశమగు నంది గ్రామంలో వసియిస్తూ నీపునరాగమనం కొరకు నిరీక్షిస్తున్నాను. నీ దివ్యపాదుకా నివేదిత రాజ్యతంత్రుడనై పదునాల్గు వత్సరములు వ్రతదీక్షాపరుండనై మెలంగుదును." ఇది భరతుడు గావించిన లోకోత్తర భీష్మ ప్రతిజ్ఞ.

అలాగే అడవి నుండి అయోధ్యకు తిరిగి వచ్చిన భరతుని భావపరంపరలు ఎంతటి మహోదాత్తములో మిర అవధరించండి :

"నిజంగా మా అన్నగారి వియోగంతో ఈ నగర శోభమ్మృగ్యమైంది. అయోధ్యకు పూర్వం అందం లేదు. వర్షంతో కప్పబడిన శుక్ల పక్ష రాత్రి వలె వున్నది." అంటూ పరితపిస్తాడు భరతుడు. రాజ్యపాలన చేస్తూ ఏద్దైనా

ముఖ్యకార్యం తటస్థించినా, గొప్ప కానుకలు వచ్చినా, ముందు పాదుకలకు నివేదించిన తర్వాతే కాలానుగుణంగా ప్రవర్తిల్లిన వివేక ధనుడు-యశోవిరాజితుడు భరతుడు. రామాయణంలో భాతృభక్తికి నిదర్శనంగా నిలచిన ఆదర్శ పురుషుడు, అకలంకాత్ముడు భరతుడు. లోకమున సీత వంటి భార్యతో పాటు భరతుని వంటి తమ్ముని బడయుట మహా భాగ్యమని భావించునంతటి ఉత్తమ చరితుడై భరతుడొప్పారినాడు. అన్నదమ్ముల గల ఏ యింటిలో నైన భరతుని వంటి సోదరుని చవిచూడ గల్గితిమేని అది మన పూర్వ జన్మ సుకృత సంకేతం. "సుమహాతేజా భరతాయి మహాత్మనే" అని వాల్మీకిచయే ప్రశంసలందుకొన్న పావన చరితుడు భరతుడు. భరతుని పవిత్ర సౌభ్రాత్ర అధ్యయనమునకు వాల్మీకి రామాయణ క్షీర సాగర మధనం విన అన్యథా శరణం నాస్తి.

"జానామి భరతం క్షాంతం గురు సత్కార కారిణమీ
సర్వమే వాత్ర కళ్యాణం సత్య సంధేమహాత్మని"
(అయోధ్యాకాండ - 111 సర్గ - 30 శ్లో॥)

56043

# శ్రీరాముడు

రామాయణం ఇతివృత్తం ప్రఖ్యాతమని, ఇహపరసాధకమని ఆస్తికులు భావించుచుందురు. రామవృత్తాంతం ఆబాలగోపాలానికి సత్యవృత్తాంతముగనే గోచరించును. అందు అసంగతమైన అసమంజసమైన అంశం మనకు గోచరింపదు. ఈ కథ మహాత్ముడైన ఇక్ష్వాకు వంశీయుల కులమందు సంభవించెనని వాల్మీకి ఘంటాపథంగా వాక్రుచ్చి యున్నాడు.

"ఇక్ష్వాకూణా మిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మానామ్
మహాదుత్పన్నా మాఖ్యాన్న రామాయణ మితిశ్రుతమే"

(బాలకాండ - సర్గ - 5 - శ్లో॥ 2)

ఉపశ్లోకుడైన మహాపురుషుని ఘనతను ఆధారం చేసికొని కావ్య గౌరవం ఆధారపడి వుండును. తాను కీర్తింపబోవు నాయకోత్తముడు విశ్వారాధ్యుడని సూచించుటకు కావ్యారంభంలోనే రామ గుణ సంకీర్తనమును మహాకవి, ఆదికవి వాల్మీకి అద్భుతముగా వర్ణించెను. రామాయణ రచనకు మూలమనదగినది వాల్మీకి అన్వేషించు చున్న పరిపూర్ణ మానవుడు. అట్టి పూర్ణ పురుషుని కొరకు ఉవ్విళ్ళూరుచున్న వాల్మీకికి నారదుడు తటస్థ పడెను. "ఓ వాల్మీకి మునీ! నీవు కోరిన గుణములన్నియు కల నరుడు సామాన్యముగా దుర్లభుడు. అయినను ఇక్ష్వాకు వంశజాతుడు రాముడు అట్టివాడు! అని నుడివినాడు. షోడశ కళాపరిపూర్ణుడగు పూర్ణ చంద్రుని కాంచవలెనని వాల్మీకి ఆశపడు చుండెను. గుణవంతుడు, పరాక్రమశాలి, ధర్మ స్వరూపుడు, సత్యవాక్య పరిపాలకుడు, జితేంద్రియుడు, సర్వభూత హితకారుడు, ద్యుతిమంతుడు

మొదలగు గుణములు కల పురుషోత్తముడ్ని చూడవలెనని వాల్మీకి వాంఛించెను. నిరాకారునికి ఆకారము కల్పించుకొని కన్నుల పండువుగా చేసికొని దలంచెను. తపోవనమునల నివసించు ముని పుంగవుల తపోమౌనములను ఉపనిష ద్రూపమున విలసిల్లిన వాక్కును ఉపాధిగా చేసుకొన్న పురుషోత్తముడ్ని కాంచ అభిలషించెను. నారదుడు ఒక నరశ్రేష్ఠుని రాముని సామాన్య స్వరూపమును ప్రకటించి వెడలిపోయెను. ఆ మణితో మేలిమి బంగారు వన్నెలో ఒక సుందర భూషణము నిర్మించగల్గిన కావ్య సృష్టి వాల్మీకి శ్రీరాముని గుణవర్ణనము నందు వాల్మీకి కేవలం అవతార పురుషుడి వలె గాక ఒక ఆదర్శ మానవుడ్ని కూడా సందర్శించినట్లు మనకు అగుపడును. రామాయణమంతయు ఒక మహావీరుని చారిత్రక గాధ వలె భాసించును. అందుచేతనే రామాదుల వలె నడచుకొన వలెనన్న సందేశము మానవాళికి ఆదర్శప్రాయమై, ఆచరణ సాధ్యం, అనుకరణ యోగ్యం అగుచున్నది.

శ్రీరాముడు ఆదర్శ పురుషుడు. రామాయణ కావ్యనాయకాగ్రణి. పుత్రుడుగా, భర్తగా, శిష్యుడుగా, నృపాలుడుగా, సర్వజన ఆమోద సమ్మోదము లకు అనువైన శీలసంపదకు ఆకరమకైన సకల గుణాభిరాముడు శ్రీరాముడు వాల్మీకి వాంఛించిన లోకోత్తర పురుషుడని తేటతెల్లమవుతుంది. పౌరుషం, పితృభక్తి, ప్రజానురాగం, క్షాంతి, కారుణ్యం మున్నగు లోకోత్తరములైన గుణము లకు ఆలవాలమ్మైన శ్రీరాముడు ధీరోదాత్త నాయకుడు. పితృవాక్య పాలనాదక్షుడు. గురుభక్తి ప్రపూరితుడు. సత్యవ్రతుడు. సదాచార సంపన్నుడు, సమస్త కార్య దురంధరుడు; యుద్ధకుశలుడు; శరణాగత వత్సలుడు; ఏకపత్నీ వ్రతుడు; ప్రజానురంజకుడు; నియతాత్ముడు - ఈ సుగుణ పుంజములకు రాశీభూతుడు అయిన శ్రీరాముని యందు పురుషోత్తమత్వమును సర్వత్రా, సర్వాత్మనా వాల్మీకి మూర్తీభవింప జేసెను. అంతియే కాని, కేవలం, గుణముల మూటగా ప్రదర్శింపలేదు. వానిని మిశ్రమ మొనర్చి ఐక్యతను కూర్చి వానికొక సమగ్ర స్వరూపమును సంతరించెను.

మానవ జీవితంలో స్త్రీ లేకున్న పురుషునికి పరిపూర్ణత్వం సిద్ధించదు. ఇది భారతీయుల అనూచాన సంప్రదాయం. స్త్రీ, పురుషులు ఇరువురు ఒకే

పదార్ధము నుండి ఉద్భవిల్లిరి. భగవంతుడు ఒకరే ఆత్మను స్త్రీ పురుషులుగా, భార్యాభర్తలుగా సృష్టించెనని బృహదారణ్యకోపనిషత్తు సూచించు చున్నది :

"అనన్యా రాఘవేణా హమే భాస్కరేణ ప్రభాయధా"

సూర్యుని నుండి వేరుకాని కాంతివలె సీత రాఘవుని నుండి వేరు కాదు' శ్రీరాముని పరిపూర్ణత్వమునకు సీతాదేవి వ్యక్తిత్వం కూడా తోడ్పడినది. విష్ణువు అగు శ్రీరామునికి లక్ష్మీదేవియే సీతాదేవి కాగల్గెను.

"సమగ్రరూపిణి లక్ష్మీ కమేకం సంశ్రితా నరమే"

సమగ్రరూపమగు మహాలక్ష్మి సీతాదేవి రూపంలో ఒక నరుని ఆశ్రయించినది) రామాయణ మహత్త్వమునకు ముఖ్యహేతువు రామునితో పాటు సీతాదేవియు సగభాగం పంచుకొన్నది. వాల్మీకి దీనినొకపుడు సీతాదేవి చరిత్రగనే వాలొపియున్నాడు.

"కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాం చరితం మహత్
పౌలస్త్య వధమిత్యే తత్ చకార చరిత వ్రతః"

(బాలకాండ - 4వ సర్గ - 7 శ్లో॥)

వాస్తవానికి రామాయణం అంతా సీతాదేవి చరిత్రయే! అందు నాయకుడైన శ్రీరాముడు ధీరోదాత్తుడు. వాల్మీకి ఇంకను తన కావ్య నాయకుడ్ని పెక్కు విధాల వర్ణించాడు.

"రామో విగ్రహవాన్ ధర్మః రామోప్సత్య పరాక్రమః
రామశ్శత్రు విబర్హణః రామస్సత్యే సంగరః"

(అరణ్యకాండ - 37 సర్గ - 3 శ్లో॥)

రాముడు రూపుదిద్దుకొన్న ధర్మం. రాముడు సాధువు. సత్య పరాక్రముడు. శత్రువులను వధించుటలో, పరాజయమెఱుంగని సంగరుడు. ఈ మాటలలో రాముని లోకోత్తర ప్రశస్తి ఇమిడి యుంది. శ్రీరాముడు ఒకప్పుడు కైకేయితో తనను గూర్చి చెప్పుకుంటాడు :

"రామోద్వి ర్నాభి భాషతే"

రాముడు రెండు మాటలు చెప్పడు. అతడికి రెండు నాల్కలు లేవు. అది ఎంతటి ధీరోదాత్తవచనం. అలాగ చెప్పగల్గినవాడు రామాయణంలో రాముడు ఒక్కడే మనకు అగుపిస్తాడు. రాముడు మిత హిత సత్యవాక్య తత్పరుడు. ఆడినమాట మృదువుగా మాటలాడు సంభాషణా చతురుడు. ఎవరైనా కఠినంగా మాట్లాడినా ఉపేక్షించి వినే ఉదారశీలుడు. ఎవరినైనా తానే ఆప్యాయంగా పల్కరించేవాడు. ఎంతటి బలవంతుడైనా బలగర్వం లేనివారు. ఎంతటి ప్రియవాక్య శీలుడైనా సందర్భాన్ని పురస్కరించుకొని గంభీరంగా బెదరించగల సమర్ధుడు రాముడు.

కావ్యమునకు వస్తువు మూలం. నాయకుడు ఆధారం. రసనిరూపణ లక్ష్యం. రామాయణ కావ్యమునకు అవసరమగు వస్తువును గ్రహించి నారదమహర్షి వాల్మీకికి యొసగెను. ఆ వస్తువును గ్రహించి శ్రీరాముణ్ణి ఆదర్శ నాయకుడిగా వాల్మీకి తీర్చిదిద్దెను. క్రౌంచ వధ ఘట్టంలో నవరసములకు వాల్మీకి అంకురార్పణ చేసెను. కావ్య పరమార్థం ప్రయోజనం ఇంకొకటి అపేక్షణీయం. రసములలో కరుణరసం మకుటాయమైనది. పురుషార్ధములకు ధర్మార్ధ కామమోక్షములు ప్రధానములు, ఆధారములు. అట్టి చతుర్విధా పురుషార్థములకు కరుణ రసమును మేళవించి కవులలో వాల్మీకి మేల్బంతి అయ్యెను. ధర్మమునకు ప్రముఖ స్థానం కల్పించి యితర పురుషార్ధములకు పుటము వెట్టి దానిని నిర్మలతరం చేసెను.

"కామార్థ గుణ సంయుక్తం ధర్మార్థ గుణ విస్తరం
సముద్రమివ రత్నాఢ్యం సర్వ శ్రుతి మనోహరం"

(బాలకాండ - 4 సర్గ - 29 శ్లో॥)

కామ, అర్థ గుణములతో కూడినది. ధర్మ అర్థ గుణములతో విపులమైనది, సముద్రం వలె రత్నములతో కూడుకొన్నది. సర్వ శ్రుతి మనోహరమైనది. రామాయణం అనునది వాల్మీకి నిశ్చయాభిప్రాయం ఇక రాముడు మూర్తి మంతమగు ధర్మమని ప్రకటించినాడు. (రామో విగ్రహవాన్ ధర్మః)

అవతార విషయం రామాయణము నందొక ప్రధానాంశం. నరుడు దేవత్వమునందుట-అవతరణమునకు కీలకాంశం. విష్ణువు రాముని రూపంలో నరత్వం దాల్చుట నరుడగు రాముడు దైవత్వం, ప్రడయుట - సాకార నిరాకారముల సంబంధమును స్పష్టము చేయును. సకల గుణ సంపన్నుడగు శ్రీరాముడ్ని నరరూపంలో ప్రదర్శించుటలో పరమ ప్రయోజనం - మానవుడు దైవత్వం పొందగలడు. అది రామునికే కాదు సర్వ మానవులకు సాధ్యపడునని రామాయణం మనకు ధ్రువీకరించు చున్నది. సీతా రాములు నరులయును గుణ పరిపూర్ణులై, ఆదర్శప్రాయులై భగవత్స్వరూపులు కాగల్గిరని వాల్మీకి రామాయణ రచన ద్వారా స్పష్టీకరించినాడు.

శ్రీరాముని జీవితం ప్రతిజ్ఞాపాలనములకు మందారమాలగా పేర్కొనవచ్చును. ప్రతిజ్ఞా పాలనకు ధర్మ నిర్వహణకు త్యాగం అత్యావశ్యకం. త్యాగం లేని ధర్మ నిర్వహణ సంభవం కాదు. విశ్వ కల్యాణార్థం సమిష్టి సుఖ సంపాదనమునకు వ్యక్తి తన సహజ స్వభావాన్ని సంకుచించు కొనవలెను. మహోన్నతాత్మ తన ఔన్నత్యమును కుదించుకొని సామాన్య రూపమును ధరింప వలయును. ఏ మహాత్ముడు తన స్థానము నుండి దిగకుండా మానవ కల్యాణమునకు విశ్వ కల్యాణమునకు తోడ్పడ జాలడు. ఇదియే రాముని అవతార తత్త్వంలోని అంతరార్థం.

రాముని జీవిత ఘట్టములను సమగ్రంగా అధ్యయనం చేసినచో ఆయన దివ్యత్వం మ కనుల ముందు సాక్షాత్కరించును. మన జీవితాలను ఎంత భౌతికంగా అనుసంధానింప ప్రయత్నించినా తళుక్కున మెరసి ప్రకాశించుచునే యుండును.

రాముడు దశరథుని జ్యేష్టపుత్రుడు. లేకలేక కల్గిన సంతానము. అపురూపమైన రూపసంపద అసామాన్యములగు గుణరత్నములు కలవాడు రాముడు విశేషించి తన దోషములను పరదోషములను తెలిసికొనగల సమర్థుడు అతడు. రాజ్యాధిపత్యము వహించువాడు యథేచ్ఛా వర్తనుడుగా నుండరాదు. రాముడు తన యింద్రియములను లోగొన్నదాంతుడు. ప్రశాంతాత్ముడు. అట్టి

కుమారుని అభిషేకంతో ఆదరించి సింహాసనా సీనుడ జేసి వృద్ధ రాజు దశరదుడు రాజభారం నుండి వైదొలగ వాంచించుట సహజమే కదా! రాముని యువరాజుగా నొనర్చుటకు అతని యందున్న అసమాన గుణసంపదయే అందులకు ప్రబలకారణం. రాజుకుండవలసిన లక్షణములన్నియు రాముడిలో రాశీభూతములై యున్నవి. శ్రీరాముడు సతపరాక్రముడు. ఇక్ష్వాకు వంశస్థులలో మేటి యనదగినవాడు. అందరి యందు అమితమైన దయ, జాలి కలవాడు. ఎవనికైనను దుఃఖము కల్గినపుడు తాను కూడ వానితో సమానముగా భోదపడువాడు. సర్వదా నవ్వు ముఖం కలవాడు. ధర్మమును విడనాడని వాడు. ఇంద్రియములను జయించినవాడు. ప్రజాపాలన రీతి చక్కగా నెఱిగినవాడు. లోకాభిరాముడైన శ్రీరాముడు ప్రభువుగా నుండుట ప్రజలందరకు ఆనందదాయకం. పుత్రుల గొప్పదనమును కూర్చి యితరులు కీర్తింపగ వినుట కంటె మించిన ఆనందం ఏ తండ్రికి అభించును. అట్టి ఆనందం దశరధునికి సమకు-రెను. ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదు. కైకేయి కోరిస వరాలతో ఆ సంతోషం పటాపంచలయ్యెను.

భారతీయ హృదయములలో శ్రీరాముడ్ని ఆదర్శ పురుషుడిగా పెద్దలైన గురువులు, తల్లిదండ్రులు చూపుదురు. అది మనకు తరతరాల నుండి వస్తున్న సదాచార సంవద. పితరులను దైవసమానులుగా పూజించుచు సగౌరవంగా వారి అభీష్టానుసారం వర్తించు రాముని వంటి కుమారులు ప్రపంచంలో ఎందరుందురో అందున పుత్రరత్నము లెందరు లభింతురు? కైకమ్మ తల్లికి తన తండ్రి దశరధుడు తొందరపాటున ఇచ్చిన వరములలో అనౌచిత్యమును కాని, అసామంజస్యమును కాని కలవారి బిడ్డడు రాముడు ఇసుమంతైనా నిరసించి వితర్కింపడు. మారుటి తల్లి కైకను పల్లెత్తు మాటయైన పల్కి దూషింపని అపూర్వ ఆత్మ సంయమనం శ్రీరాముడిది.

ప్రజానురంజనమే ప్రధాన ఆశయంగా ఉత్తమ ఆదరశ్రములను పాదుకొల్పిన మహారాజు కావుననే శ్రీరామచంద్రుడు జన్మింపగనే వేదం రామాయణంగా రచింపబడుటకు తార్కాణంగా భాసించగల్గినది.

"వేదవేద్యే పుంసి జాతే దశరథాత్మ జవేదః
ప్రాచేత సాదాస్సీత్సా క్షాద్రామాయ ణాత్మ నా"
(బాలకాండ -

వేదవేద్యుడైన పరమ పురుషుడు శ్రీరాముడు అవతరించగా వేదములే ప్రాచేత సముఖము నుండి రామాయణంగా వెలసినదని ప్రశస్తిబడసినది; వేదసారమే రామాయణం. ధర్మాధర్మమైన విచక్షణా రూపమైన వివేకం కల్గించి జ్ఞాననేత్రం తెరపించునదియు వేదమే! అసత్తు నుండి సత్తుకు తమస్సు నుండి జ్యోతిస్సునకు, మృత్యువు నుండి అమృతత్వమునకు వెలుగు బాటలు ఏర్పఱచి నడపించు ఊతకర్రయు వేదమే! అట్టి వేదమే శ్రీరామచంద్రుని జననంతో రామాయణాకృతిని వహించినదనుట ఎంతటి పరమ సత్యం! లోహితం కోసం అయోధ్యా ధీశుడగు దశరథ మహారాజు యొక్క పుత్రుడిగా నాల్గు రూపములలో మానవునిగా జనించి లోక కంటకుడు అయిన దశకంఠుడు రావణుని వధ కోసం దశరథ పుత్రత్వం అంగీకరింపమని మహేంద్రుడు నియోగింపబడతాడు. ప్రజాప్తై గృహమేదులును త్యాగాయ సంభృతార్థులైన రఘువంశంలో శ్రీరామచంద్రుడే ఒక్కడే కాదు. అతడి పితృపాదుడు దశరథుడు అతడి మాతృమూర్తులు, సోదరులు, మిత్రులు, సేవకులు అందరూ త్యాగశీలురే. ఒకరననేల శ్రీరామచంద్రునితో సంబంధం కల సర్వులును ప్రజాహిత పరాయణులగుటలో ధర్మ ప్రతిష్ఠాపనం సక్రమముగను, సంపూర్ణముగను సఫలీకృతమైనది. ఆ పితృవాక్యపాలనా దురంధరుడు రాముని కుటుంబం వారు త్యాగ నిరతి శయపరంపరలకు ప్రతీకలుగా భాసించిరి. లోకకంటకుడైన రావణుని వధ నిమిత్తం దశరథుడు ముదిమి వయసున తన కబ్బురంగా పుట్టిన ఆత్మ సుతులను త్యాగం చేసినాడు. లక్ష్మణ భరతాదులు అతిలోభనీయమగు రాజ్య రమా వైభవమును త్యాగమొనర్చినారు. కౌసల్యా సుమిత్రాదులు విధిని యుక్తులై పతి సుతత్యాగములకు సంసిద్ధులైరి. శ్రీరామచంద్రుడు పితృత్యాగ దుఃఖమునే గక ఇహపరసాధనాశ్రయమగు పత్నిని త్యాగం చేసి చిచ్చొడిగట్టినట్లు అపూర్వ తాల్మిని వహించాడు. రాముడు

మహానుభావుడు. కష్టము కల్గినను దుఃఖపడకు సుఖము కల్గినను సంతోషపడడు. సుఖదుఃఖములను- జయించినవాడు. రాముని వంటివాడు మరియొకడు లేదు. శ్రీరామచంద్రుడు భార్యను సోదరులను సామ్రాజ్యాదికమైన సర్వస్వమును పరిత్యజించి అహంకార మమకారములను వీడి మహాప్రస్థానం గావించాడు. తన వర్తనము చేత అమృతత్వమునకు తుది సోపానం త్యాగమే అని నిరూపించిన మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడు.

ధర్మ సంరక్షణార్థం ఇంద్రుని అభ్యర్ధన మేరకు అవతరించి "మంత్రశుత్వం చరామసి" అనుతన కాకుత్స్థ వంశీయుల ప్రమాణ వచనములను శిరసావహించి మసలుకొనిన మహాప్రభువు శ్రీరాముడు. మంచిగుణములు. ప్రజలను శిక్షించుటకు రాజదండనం కంటె సమర్థమైనవి వేరొండు ఉండవు కదా! అపుడే రాజశబ్దం సార్థకమై తేజరిల్లును. సమయోచితమగు పరిజ్ఞానము లేనివాడు స్వకీయ కార్యములను ఎట్లు సమర్థించుకొనును? రామునసి మానసము ధర్మ నిష్ణాతమయినది. అవసరం వచ్చినపుడు తన కర్తవ్యమును సూటిగా నిర్ణయం చేసికొను నిబ్బరం కలది. అందుచే అతడు 'కృతాత్మ' డని బహు విధాల ప్రశంసింపబడినాడు. రాజునకు ఆవశ్యకమైన మరియొకర మహత్తర గుణ విశేషం 'ధర్మానుక్రోశత'. అతడు ధర్మమునే అనుసరించును. కావుననే తన కులపతియగు వశిష్ఠునిచే చాతుర్వర్ణ వ్యవస్థ పరిరక్షణకు ఆదేశింపబడి తపస్వియగు శంభూకుని వధించినాడు శ్రీరామచంద్రుడు. అతనికి హృదయం కరవయ్యేనా? మానవత్వం మటుమాయమయ్యేనా? హృదయ చేష్టలు వ్యక్తిగా శ్రీరామచంద్రుని కతీతమైనవి. అవి ప్రభుధర్మమునకు వశంవర్తులై జరుగవలసినవే! ప్రభువుగా శ్రీరామచంద్రుడు అనుష్ఠింప వలసినదే! ఆధర్మ నిర్వహణలో రఘుకుడి దీపకులకు సంపూర్ణ స్వేచ్ఛ లేదు. సీతాదేవి పరిత్యాగ సందర్భంలోను శ్రీరామచంద్రుని ప్రజా హృదయరంజక ధర్మ వశంగత్వమే ఆదర్శ రామరాజ్యాధినేతగా ఉన్నత పీఠమున నిల్పి యుగయుగములందు శ్రీరాముడ్ని ప్రస్తుత పాత్రుని గనొనర్చినది. ఆధర్మ విధేయతను రకిత్యాప ఇక్ష్వాకు వంశమును ప్రపంచమున నవోషో రేఖగా ఉద్దీప్త మొనర్చినది.

శ్రీరాముని యందు గల మరియొక ప్రసిద్ధ గుణమను "జితేంద్రియత'". తన యింద్రియములను జయింపలేని అసమర్థుడు, అశక్తుడు విశాల రాజ్యమును సుభిక్షముగా నెట్లు పాలించగలడు? రాముని ఇంద్రియ నిగ్రహం రామాయణం మందదెలడను కనుల ముందు తాండవించుచునే యుండును. వీనికి తోడుగ ప్రజానురంజకత్వం లేనిచో ప్రయోజనం లేదు. రాముని యందీ గుణం రాశీభూతమై యున్నది. ఈ గుణమే రామరాజ్యమును ఆధర్శ రామరాజ్యముగా జగతిలో రాణి కెక్కించినది.

రాముడు వనవాస దీక్షతో జటావల్కలములు ధరించి మునుల వలెనే అడవిలో ఉన్నను ఆయనే రాజగునని, రాజధర్మం అనుసరించి ప్రజలను రాక్షసుల బారినుండి రక్షింపవలెనని మహర్షి మండలి స్పష్టం చేసినారు. భరతునికి సోదరునిగా, ప్రతినిధిగా రాజధర్మంను నిర్వర్తింపవలసినదేయని మహర్షుల అభిప్రాయం. వనవాస దీక్షలో నున్నను రాముడు తన క్షత్రియ ధర్మం విడనాడలేదు. శరణాగతులను రక్షంచుట రాజధర్మం. రాక్షులను సంహరించి మునులను రక్షింతునని రాముడు మాట యిచ్చినాడు. ఇచ్చిన మాట తప్పుటకు ఇష్టపడని నైజం రామునిది. అతడికి సత్య వాక్పాలనమునందే అమితమైన ప్రీతి కలదు. ఆవశ్యకమైనచో జీవితమును కాని, సీతాదేవితో పాటు లక్ష్మణుడ్ని కాని పరిత్యజించుటకు సిద్ధపడినాడు రాముడు. ఏ ముహూర్తంలో ఆ మాట పల్కినాడో కాని అవియే యదార్థమలయ్యెను.

రావణునిచే సీతాపహరణం జరిగిన అనంతరం మారీచుని వధించిన తర్వాత సీతా విహీనమైన పర్ణశాలకు చేరుకొంటాడు రాముడు. సీతను వదలి తన్ను రక్షంచ వచ్చిన లక్ష్మణుడ్ని చూచి ప్రళయకాలంలో సర్వ జగత్తును దహించదలచిన అపరరుద్రుడి వలె ఎన్నడు లేరంత తీవ్రంగా కోపిస్తాడు రాముడు. ఆ సందర్భం మినహా ఆమాయణంలో రాముడు ఆగ్రహించిన సన్నివేశాలు వ్యుగ్యమనే భావించవచ్చును. సీతాదేవిని అన్వేషిస్తూ వయనిస్తూండగా దీనుడై పడివున్న జటాయువు వారికి కన్పిస్తాడు. జానకి మాతను అపహరించినవాడు రావణుడే అను అంశం జటాయువు ద్వారా

రామలక్ష్మణులు తెలిసికొంటారు. అపుడు రాముడు పరిపరి విధాల పరితపిస్తాడు. "రాజ్యమా పోయింది, అరణ్యవాసం తటస్థించింది; ప్రాణానికి ప్రాణం లాగున చూచుకొనే భార్య సీతను పోగొట్టుకొన్నాను. సీతా దేవిని కాపాడుటలో ఆత్మీయుడైన జటాయువును కోల్పోయాను". రాముని దురదృష్టం ఎంత గొప్పదంటే అది అగ్ని హోత్రాన్ని కూడా కాల్చి వేయగలదు. ధర్మాత్ముడైన రాముడు ఆత్మబంధువు వలె ఆ పక్షిరాజును చితిపై నుంచి దహనం చేస్తాడు. తలపెట్టిన అపూర్వ సంస్కారానికి ప్రతీక రాముని హృదయం.

కబంధ వధానంతరం రామలక్ష్మణులు శబరి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. వారి దర్శనభాగ్యంతో పునీతురాలై తన జన్మ సాఫల్యం పొందగల్గెనని శబరి సంతోష పారవశ్యంలో మునకలు వేస్తుంది. రాముని ఆరణ్యక దుఃఖభాజన జీవితంలో సీతా వియోగ సందర్భంలో శబరి సందర్శన సన్నివేశం రాముని మనఃశాంతికి ఉపశమనం కల్గించినది క్ష్యౌషధి శబరి నిర్మల పరిచర్య. ఆమె ఉపచర్యలతో రామునికి జ్ఞానయోగం సమకూడిట్లయ్యెను. తన క్లేశాలు గట్టెక్కునని శుభతరుణం తనకు ఆసన్నం కానున్నదను ఆశాజ్యోతితో రాముడు సంతృప్తి చెందుతాడు. సీతా వియోగ వ్యధాభరిత దావానంలో సలసల మ్రగ్గిపోతున్న శ్రీరామచంద్రునికి కిష్కింద కాండలో సుగ్రీవుని మైత్రి సాహచర్యం లభించిహనుమంతుడు వంటి భక్తాగ్రగణ్యుడు దొరకడం - అతడికి ఊరట కల్గించే సందర్భాలు కోకొల్లలు తారసపడుతాయి. సుందరకాండ ముగిసే సరికి సీతాదేవి కుశల వార్తని యెఱింగించి లంకకు దూతగా వెళ్ళి దిగ్విజయంగా తిరిగి వచ్చిన హనుమంతుని సందేశంతో రాముడు లక్ష్మణునితో పాటు సంతోషభరితుడవుతాడు.

యుద్ధకాండలో యుద్ధం ఆరంభమవుతుంది. రావణుడి కుమారుడు ఇంద్రజిత్తు ప్రయోగించిన సర్పబాణాలు నాగపాశబంధంతో రామలక్ష్మణు లిరువురు నేలకొరుగుతారు. వానులంతా చుట్టి వేస్తారు. ఆ సందర్భంలో విభీషణుడు అందరిని ఊరడిస్తాడు. అపుడు రామునికి బహిః ప్రాణం వంటి మిత్రుడు గురులను విమోచనం కల్గిస్తాడు. శత్రువుల పట్ల కూడా అపార

వాత్సల్యం చూపించే ధర్మాత్ముడు రాముని అనుజ్ఞ పొంది యుద్ధంలో రామునికి అఖండ విజయం చూకూర వలెనని ప్రార్ధిస్తూ గరుడుడు కదనరంగం నుండి నిష్క్రమిస్తాడు.

తొలిసారి తన ఎదుట పడిన రావణుడ్ని చూచి రాముడు విభ్రమాశ్చర్యాలకు లోనవుతాడు, ఆ రాక్షసరాజు మహాద్భుతమైన తేజస్సుతో చూడశక్యంకాని కాంతులతో ప్రకాశించే సూరర్యబింబం వలె గోచరిస్తాడు. అదృష్టవశాత్తు ఈ పాపాత్ముడు ఇన్నాళ్లకు తన కంటపడ్డాడు. ఇక వీనిని ఉపేక్షించి విడిచి పెట్టరాదని రాముడు నిశ్చయించుకొంటాడు. సీతాపహరణ అకార్యానికి తగిన శాస్తి చేయవలసిన సమయం ఆసన్నమైనదని రాముడు భావిస్తాడు. రాముని శరపరంపరలకు కలత చెందిన రావణుడ్ని పరికించి నావానరసైన్యవీరుల్ని లెక్క లేనంత మందిని చంపి అలిసిపోయిన నిన్ను ఈ తరుణంలో అంతమొందించెను. పోవుటకు అనుజ్ఞ ఇచ్చెదనని ఉదారంగా పల్కుతాడు రాముడు. ఆ మాటల వలన రాముని ప్రవర్తన ఆయన బద్ధ శత్రువు పట్ల కారుణ్యం చూపరులకల ధర్మాత్ముడని ఋజువు చేస్తుంది.

యుద్ధ రంగంలో శత్రువినాశకుడైన లక్ష్మణుడు ఇంద్రాస్త్రాన్ని సంధించి ఇంద్రజిత్తు శిరస్సు నుండి శరీరం వేరుచేసి హతమారుస్తాడు. ఇంద్రజిత్తు వధ వృత్తాంతం వినగానే లంకాధీశుడు రావణనుడు మహోదగ్రుడై అగ్గిరుద్రుడై హుటాహుటిగా రణరంగంలోనికి చొచ్చుకొని వెళ్ళి లక్ష్మణుడిపై శక్త్యాయుధం ప్రయోగిస్తాడు. దూసుకు వచ్చిన ఆ తీవ్రాయుధం లక్ష్మణుడి గుండె తాకి తీవ్రగాయం చేస్తుంది. అచేతనుడై లక్ష్మణుడు నేలకొరుగుతాడు. ఈ వార్త యెటిగిన మరుక్షణం రాముడు అచటికి చేరుకొంటాడు. దుఃఖానికిది అనువైన సమయం కాదని పర్యాలోచించి రావణ వధకు ఉపక్రమించాలని నిశ్చయం చేస్తాడు శ్రీరాముడు. అవక్ర పరాక్రమంతో యుద్ధరంగంలో రాముడు శత్రు భీకరుడై విజృంభిస్తాడు. వానర సైన్య సమక్షంలో రాముడు భీషణ ప్రతిజ్ఞ గావించడం గమనార్హం. "ఈ జగత్తు రావణ హీనమో, రామరాజ్యం పోయి నాకు దండకారణ్య వాసం తటస్థించింది. సీతకు తీరని అవమానం జరిగింది. రాక్షస సంఘర్షణ ఆరంభమైనది. భరించలేని దుఃఖం రావణ వధనాత్క్షణ

కర్తవ్యం. ఆ పని ముగించి పాప పరిహారం గావించు కొంటాను. మూడు లోకాల వారు ఈ యుద్ధంలో రాముని ధీరత్వం రామత్త్వ మహిమ ఎట్టిదో తెలిసికొనే విధంగా విజృంభించి సంచరిస్తాను".

రామచంద్రుని అసాధారణ అవక్ర పరాక్రమానికి ఎదుట నిలువలేక యుద్ధ భూమి నుండి భీరువు వలె పలాయనం చిత్తగిస్తాడు. యుద్ధ భూమిలో ధూళి దూసరితమై పడివున్న లక్ష్మణుడ్ని చూడగానే రాముడి దుఃఖం అవధులు మించి ప్రవహిస్తుంది. ఇక తనకు యుద్ధంతో కాని, తన ప్రాణాలతో కాని, చివరకు అత్యంత ప్రీతిపాత్రమైన సీతాదేవితో కాని నిమిత్తం లేదని పరిపరివిధాల తలపోసిన రాముడు దీనాతిదీనంగా విలపిస్తాడు సకలజగత్తులో కరుణ రసా విష్కరణకు పరాకాష్ఠ ఆ హృదయ విదారక సన్నివేశం :

**"దేశే దేశే కళత్రాణి దేశే దేశే చన బాంధవాః**

**తంతు దేశాం నపశ్యామి యత్ర భ్రాతా సహోదరః**

(యుద్ధకాండ - 102 సర్గ - 12 శ్లో॥)

ఏ దేశంలోనైనా భార్యలు లభ్యమవుతారు. బంధువులు దొరుకుతారు. కాని తోడబుట్టిన వాడు దొరికే దేశమేదీ లేదు.

ఇంటిని ఇల్లాలిని, కన్న తల్లిని విడిచి సహోదర పరిచర్యయే జీవిత పరమార్థంగా, విహి కర్తవ్యంగా భావించి రామునితో అడవులకు అనుగమించిన ఉత్తమశీలుడు రామానుజుని అచేతనావస్థ రామునిలోని సహజ గాంభీర్యాన్ని సడలింపజేసింది. వనవాసమునకేగు వేళ ఇతడు నన్ను అనుగమించినాడు. పరలోక వాసగతుడగు ఇతడినే నేను అనుసరింతును అని మానవ మాత్రుడిలా రాముడు పల్కుటకు వెనుకంజ వేయలేదు. ఆ విధంగా దుఃఖం పెల్లుబికి ఇంద్రియాలు చలించగా విలపించే జితేంద్రియుడైన రాముడ్ని ఓదారుస్తూ విచారించ వలసిన అగత్యం లేదని లక్ష్మణుడు సజీవుడై యున్నాడని సుషేణుడు ధైర్యం చెపుతాడు. విశల్య కరణి ఓషధి సేకరణకు హనుమంతుని సమాయత్తం గావింపమని సలహా ఇస్తాడు. మరుక్షణంలో హనుమంతుడు అదృశ్యుడై వెడలి మరుక్షణం ఆ ఓషధిని సిద్ధం చేస్తాడు. దానిని ఆఘ్రాణించిన లక్ష్మణుడు స్పృహలోనికి వచ్చి రాముడికి అమిత ఆనందం కల్గిస్తాడు. రామునితో పాటు

వానర సైన్యం యావత్తు ఆనందాంబుధిలో మునిగి తేలుతారు.

శత్రు సంహారంలో భీకర ఆకారం దాల్చిన కోదండరాముడు విజయం సాధించేందుకు దేవేంద్రుడు మతలి ద్వారా తన రథాన్ని రామునికి కానుకగా పంపుతాడు. ఇంద్ర సంబంధమైన ధనువు, అగ్ని వలె వెలిగే కవచాన్ని సూర్యుని వంటి బాణాల్ని 'విమల' అనే శక్త్యాయుధాన్ని స్వీకరించమని మహేంద్రుడు రాముడ్ని అభ్యర్ధిస్తాడు. వెంటనే ఆరథానికి ప్రదక్షిణ నమస్కారం గావించి రథారూఢుడై ఆదిత్య హృదయం స్తోత్రం జపించి యుద్ధానికి మరల రాముడు సన్నద్ధమవుతాడు. ఆకాశానికి ఆకాశమే సాటి అన్నట్లు, సముద్రాన్ని సముద్రమే పోలినట్లు, రామరావణుల మధ్య భీకర మహా సంగ్రామం కొనసాగుతుంది. అట్టి అద్భుతావహరణరంగ దృశ్యాలను గంధర్వులు, అప్సరసలు, తనివితీరా చూచి తన్మయులవుతారు. రామచంద్రుడు చివరిగా ప్రయోగించిన బ్రహ్మాస్త్రం' 'తో రావణ సంహార కాండ పరిసమాప్తి చెందుతుంది. అనన్య సాధారణం అనన్య లభ్యమనోహరమైన సుమవృష్టి అంబరవీధుల నుండీ రాముని రథం మీదికి జాలువారుతుంది.

లోకోత్తరుడైన వీరుడు, నీతి విశారదుడు అయిన తన అన్న రావణునుడు మరణించుటకు మూలకారణం అతడు అపార క్రామమోహామున చిక్కువడుటయే కదా! అని సోదరుడు విభీషణుడు పరితపిస్తాడు. ఆ సందర్భంలో రాముడు చేసిన అనునయం ఆర్ష ధర్మ సంకేతం. మరణించువాని గూర్చి విలపించునపుడు అతని సుగుణములనే స్మరించుట యోగ్యుల లక్షణం. మరణంతో శత్రువుల మధ్య వైరాలు సమసిపోతాయి. అట్టి వారికి మనం ఉచిత సంస్కారం నెరవేర్చడం విద్యోక్త ధర్మమని రాముడు విభీషణునికి సలహా యిచ్చి సముదాయిస్తాడు. రావణ సంహార వార్త తెలియగానే అతని పట్టమహిషి మండోదరి పలువిధాలుగా పరిదేవనం చేస్తుంది. దేవతలు కూడా ప్రవేశించ శక్యంగాని లంకా నగరంలో హనుమంతుడు ప్రవేశించి సీతను కలిసికొని, లంకాదహనం చేసినపుడే చాలా ఆందోళన కల్గిందని, సామాన్య వీరులైన వానరులు సముద్రం మీద వారధి నిర్మాణం చేసినారని తెలిసినపుడే 'శ్రీరాముడు' సాక్షాత్తు దైవస్వరూపడని మాకు అవగతమైంది అని బద్ధ శత్రువు భార్య మండోదరి శ్రీరాముడ్ని ప్రస్తుతించడం గమనార్హం.

చిరకాల వ్యధాభరిత వియోగానంతరం సీతాదేవి రాముని సన్నిధికి చేరుకొంటుంది. రాక్షసరాజా రావణుని ఆధీనంలో అలమటించి ఉండివచ్చిన సీతను చూడగానే మానవమాత్రుడి వలె రామునిలో ఆవహించిన మనోభావాల పరిశీలన అభిలషణీయం. రామునికి దైన్యం, హర్షం, రోషం - అని ఒకేసారి పెల్లుబుకుతాయి. యుద్ధం ముగిసింది. శత్రువులు రాముని, అవక్రపరాక్రమాలు చవిచూసారు. రాముని శ్రమ, పట్టుదల సఫలమయ్యాయి. వానరసైన్య సమక్షంలో ప్రతిజ్ఞా పాలనం చేసి రాముడు తన సామర్ధ్యాన్ని లోకానికి చాటి చెప్పి బుజువు చేసుకొన్నాడు. తనకు యుద్ధ భూమిలో సహకరించిన వానర మిత్రుల పరాక్రమం వలన యుద్ధ వ్యూహం కృతార్ధమైంది. అయినా అదంతా కేవలం సీత కోసమే భావిస్తాడు. శీల సందేహానికి పాల్పడి తనకు ఎదురుగానున్న సీత వంటి ఉత్తమురాలు, కంటికలక వానికి దీపకాంతి వలె ఇబ్బంది కల్గిస్తూ యున్నదని రాముడు దిగులు చెందుతాడు. పది దిక్కులలో ఏ దిక్కుకైనా ఆమె వెళ్ళుటకు తన అనుజ్ఞ యొసంగగలనని చెపుతాడు. ఉత్తమ కులంలో ఏ పౌరుషవంతుడు పరుల ఆధీనంలో ఉండి వచ్చిన భార్యను బాధపడుతూ ఏ విధముగా స్వీకరించగలడని రాముడు మధన పడుతాడు. రాముడు ఆ విధంగా పలుకగానే సీతాదేవి చాలా నిష్ఠురంగా ప్రతివచనం చేస్తుంది. ఒక అనాగరికుడు ఒక అనాగరికురాలితో సంభాషించిన తీరులో కర్ణ కఠోర వాక్కులు ధర్మ స్వరూపుడైన రాముని నోట ఎట్లా వెలువడినవి అని సీత రాముణ్ని సూటిగా నిలదీస్తుంది. తనతో జరిగిన పాణిగ్రహణం రామునికి ప్రమాణం కాలేదని రామునిపై తనకు గల భక్తిని, సౌశీల్యాన్ని రాముడు పరిగణించక పోవడం తన దురదృష్టం అని సీతాదేవి దుయ్యబడుతుంది. తనకు దుఃఖానికి సరియైన ఉపశమనం అగ్ని ప్రవేశమే ఇక శరణ్యం అని సీత భావిస్తుంది. నిర్లిప్త మనస్కురాలై ప్రజ్వలించే అగ్నిలో సీతాదేవి ప్రవేశిస్తుంది. అపుడు శంకరుడు, బ్రహ్మ, ఇంద్రుడు, యముడు మొదలగు వారంతా ప్రత్యక్షమై సర్వలోకానికి ధర్మ కర్తయైన శ్రీరామచంద్రుని ఔదాసీన్యాన్ని ప్రశ్నిస్తారు. వెంటనే రాముని జన్మ వృత్తాంతాన్ని బ్రహ్మ ఎరుకపరుస్తాడు. అగ్ని హోత్రుడు సగౌరవంగా సీతాదేవిని రామునికి అప్పగిస్తాడు. సత్యపరాధీనుడనై ముల్లోకాలకు విశ్వాసం కల్పించడం కోసం సీత అగ్ని ప్రవేశాన్ని తాను వారించలేదని, జనకపుత్రి వైదేహి

సీత వంటి పవిత్రురాలు ఈ మూడు లోకాలలోను లేదని, ఆత్మాభిమానం కలవాడు కీర్తి కాంతను విడువలేనట్లు సీతను వదలి తానుండలేనని బదులు పల్కుతాడు రాముడు. అచటనున్న అతిరధ మహారధులైన బలశాలురందరు రాముని అసామాన్య అప్రతిహత శౌర్యపరాక్రమాదులను, ధర్మ దీక్షా పరాయణలేను, సత్యవాక్య పరిపాలనానురక్తిని పలు విధాల ప్రశంసించుచుండగా సీతతో కూడి అవధులు మీరిన అనందాతిశయంతో రాముడు పొందుతాడు. వశిష్ఠుడు తదితర మునిప్రవరులు, బ్రాహ్మణ పుంగవులు అంతా కలిసి శ్రీరామచంద్రుడి సీతాదేవిని మణిమయరత్న సింహాసనంపై అధిష్ఠింప జేసి స్వచ్ఛ సుగంధ జలాలతో అభిషేకించి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని కడురమ్యంగా జరిపిస్తారు. ధర్మ పరిపాలనావతారుడైన రాముడు అయోధ్యా రాజ్యం స్వీకరించి సోదరపాత్ర బంధువులతో కూడి అనేక వేల సంవత్సరాలు పాలించి అనేక యజ్ఞ యాగాదులు నిర్వహించి రామరాజ్య స్థాపన గావించి ఆదర్శ ప్రభువుగా వినుతి కెక్కాడు. సూర్యవంశీయుల పాలన జగజ్జేగీయమానమైనదని రాముడు ఋజువు చేస్తాడు. రాముని రాజ్యపాలనలో ప్రజలు "రాముడు" "రాముడు" అనే మాటలు విడవరు. ప్రపంచమే రామమయంగా మారుతుంది. మానవ ధర్మ కర్మలకు తిరస్కృతి లేకుండా అధరర్మ సంక్షభం నుండి మానవుడ్ని సంక్షేమ పథంలోనికి పయనింప జేయమే రామరాజ్య ప్రధాన ఆశయం. ప్రజాశ్రేయస్సునకు ఆదర్శ భూమిక పురాతన భారతీయ సంస్కృతికి ప్రతీక రాముని ఆదర్శ రామరాజ్యం.

"రామో రామె రామ ఇతి ప్రజ్ఞ నామభవన్ కధాః
రామ భూతం బగద భూ, రాజ్యం ప్రశానతి"

(యుద్ధ కాండ - 131 సర్గ - 97 శ్లో॥)

# హనుమంతుడు

రామాయణంలో 'సుందరకాండ' పుణ్యప్రద ప్రధానమై తనరు చుండునని పారాయణ మొనర్చు వారి అచంచల విశ్వాసం అపార సముపార్జిత ఆధ్యాత్మికానుభూతి పంచమ వేదమని పరగు భారతంలో భగవద్గీత ఉపనిషత్తు స్థానమాక్రమించుకొని ఉజ్జ్వల తారకమై వెలుగొందునట్లు రామాయణంలో 'సుందరకాండ' 'ఆదిత్య హృదయం' పారాయణ ఘట్టాలుగా విరాజిల్లు చున్నవి. సుందరకాండ యందు అభివర్ణితుడైన శ్రీరాముడు సుందరుడు. కథ సుందరం. సీతాదేవి సుందరి. అశోకవనం సుందరం. కావ్యం సుందరం. మంత్రం సుందరం. హనుమంతుడు సుందరుడు. సుందరకాండలో సుందరము కానిది ఏది లేదు. లంకావాసులు లోక కంటకులు రావణాదుల దుష్ట రాక్షస సంహారకాండకు ఈ కాండలోనే నాందీ ప్రస్తావన జరుగుతుంది. అ లౌకికమగు శ్రీరాముని సౌందర్యం, జానకీమాత దివ్య సౌందర్యం హనుమంతుని ద్వారా ఈ కాండలో సమయోచితంగా వర్ణింపబడుతుంది. ఆదికావ్యం రామాయణంలో నాయికానాయకులైన సీతారాముల భక్తకోటిలో అగ్రగణ్యుడైన హనుమంతుని శీలరామణీయకత ఉత్తమ సాధన ధ్వని విధానంలో సుందరంగా వ్యక్తీకరింపబడుట వలన ఇది సుందర కాండయని పిలువబడుటకు సమంజసంగా ఉండును. రామాయణంలో గల అన్ని కాండలలో సుందరకాండ సురుచిరమై, సుబోధకమై అలరినది. "వాల్మీకి సైతం ముచ్చట పడిన కాండ సుందరకాండ." (ఉషశ్రీ వాఖ్యలు)

సుందర కాండలో ప్రధాన కథానాయకుడు హనుమంతుడు అతని వంటి ప్రభు భక్తి పరాయణుడు, బలవీర్య తేజశ్శాలి, రామ సేవా దురంధరుడు,

స్వార్థ త్యాగి, భక్తాగ్రగణ్యుడు రామాయణ ప్రపంచంలో వేరొకడిని కాంచలేము. సర్వదా రాముని సర్వాత్మ నా ఆరాధించిన మహోన్నత భక్తుడు హనుమంతుడు. ఆయన చిరంజీవిగా, నిర్మల అంతఃకరణ గల రామభక్తుడుగా మన హృదయాలలో పాదుకొని సుప్రతిష్ఠింపబడినాడు. హనుమంతుడు సీతారాములను కంటికి రెప్ప వలె సేవించెను. అతడు దాసభావమును పవిత్రీకరించెను. అతడు రామభృత్యుడు, రామ భక్తుడు. ఆతడు అద్వితీయ రామదూత.

"య స్వామతం తస్య మతం యస్య సవేదసః"

దీనికి సాదృశ్యుడు హనుమంతుడే. తన శక్తి సామర్థ్యములను అడంచి వినయ విదేయతలు ప్రకటించిన మహోన్నతుడు హనుమంతుడు. అతడు శ్రీరాముడ్ని అర్థించిన వరమెట్టిది? "ఓ రామా! నా భక్తి సఖ్యతలు సధా నీయందే నిశ్చలమై ప్రతిష్ఠింపబడుగాక!" అట్టి నియతి భక్తి నిస్వార్ధ మైత్రినే ఆంజనేయుడు అభిలషించెను. "రామనిని వీడి అన్యములపై తన హృదయం ప్రసరింపకుండుగాక" అనునది హనుమంతుని జీవిత లక్ష్యం. అందుచేతనే శ్రీరాముడు హనుమంతుడొనరించిన ప్రతీ ఉపకారమందు తన ప్రాణములర్పింతునని, అవి తనయందు లీనమగునని వాగ్దానము గావించినాడు. భగవదాశీస్సులందుకొన్న యిట్టి భక్తి పుంగవుడ్ని విశ్వ వాఙ్మయంలో ఎచటను మనం కాంచజాలం. రాముని కల్యాణ గుణములను కీర్తించి తాదాత్మ్యం పొంది సకలలోకాలకు హనువుంతుడు గుణాతీతుడయ్యెను.

సుందరకాండ హుమంతుని దౌత్యంపై ఆధారపడి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడింది. ఈ కాండలో హనుమంతుడు సమర్ధుడైన రామదూతగా నిరూపితమవుతాడు. మనస్సుతో సమానమైన వాయువుతో సమానమైన వేగం కలవాడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, వాయుదేవుని కుమారుడు, వానరులలో శ్రేష్ఠుడు అయిన శ్రీరామ దూతయగు హనుమంతుడు వంద్యనీయుడు. ఆరాధ్య చరితుడు, రామాయణంలో

సేవాపరాయణతకు పరోపకారీణతకు అకలంక స్వామి భక్తికి పరాకాష్ఠ హనుమంతుని పాత్ర చిత్రణ. వినయమునకు వినయం, రౌద్రమునకు రౌద్రం దాల్చిన అద్భుత గుణశీల విశేషములకు దర్పణం హనుమంతుడు. సీతాదేవికి రాముని సందేశం అందించుటలో హనుమంతుని వ్యక్తిత్వం అతిలోక సుందరమై పొడగట్టును. అంతటి విశ్వాస పాత్రుడైన స్వామి భక్తుడు కార్యదక్షుడు ప్రపంచేతిహాసములలో మరియొకడు కానరాడు.

అంతరంగంలోని భావవిశేషమును, అసామాన్య కార్యముల వలన పొందిన అనుభూతిని మాటలతో వర్ణింపజాలము. సుందరకాండలో హనుమంతుడు ఆచరించిన కృత్యములు వర్ణనాతీతములు. వాల్మీకి అంతటివాడు కూడ వర్ణింపనలవి కానివి. అతడు నిర్వహించిన కార్యముల కిందు హద్దుపద్దులు లేవు. సమకయానుకూలంగా తనకుచితమైన దానిని తనకు తానుగా నిర్ణయించుకొని స్వతంత్రముగా సంచరించిన మేరు నగధీరుడు హనుమంతుడు. సీతాన్వేషణ యత్నములలో కార్యములలో ఔచిత్యము, వివేకం, వివేచన, ఎచట స్పృశించినా అచట హృదయంగమంగామనకు తారసపడును. సంకల్ప సూర్యోదయమున వేదాంతదేశికాచార్యులు "సంసార సముద్రము నతిక్రమించుటకు మనోరూప రావణుని మర్దించుటకు ఆదర్శప్రాయుడైన ధీమంతుడు హనుమంతుడు" అని ఉగ్గడించారు.

బాహ్య సౌందర్యం కన్న ఆత్మ సౌందర్యమే ఉత్కృష్టమైనదను అంశం సర్వులు అంగీకరింతురు. ఆత్మ సౌందర్యంలో హనుమంతుని మించిన వారు లేరు. అవంతయేని మాలిన్యం లేక ఆర్జవ భావంతో పరిపూర్ణ వికాసంతో పరిఢవిల్లు ఆత్మానందంతో అలరారు వానికి ఆత్మసౌందర్య మబ్బుటలో అబ్బురమేమున్నది?

"నతత్ర సూర్యో భాతిన చంద్ర తారకం నేమా
విద్యుతో కాంతి కుతోయ అగ్నిః"

అచట సూర్యుడు ప్రకాశించడు. చంద్రుడు, నక్షత్రాలు ప్రకాశించవు.

విద్యుత్తులు వెలగ జాలవు. ఇక అగ్ని మాట చెప్పనేల? అని యెలుగెత్తి చాటి ప్రశంసించి నట్టి వేయిమంది సూర్యులు ఉదయించినట్టి పరమాత్మ రూపం కలవాడు వాయుపుత్రుడు. అట్టివాడు సౌందర్య వైభవో పేతుడనుటలో సందేహమునకు తావు లేదు. ఆంజనేయుడు శంకరుని అంశమున జన్మించిన వాడు విష్ణు భక్తి ప్రవత్తులచే అనేక మహాద్భుత కార్యములను అవలీలగా ఆచరింపగల్గిన కార్య దురంధరుడు. అందుచే సర్వ దేవతా శక్తి రూప సుందరత్వం మూర్తీభవింప జేసుకొన్న మూల విరాట్టు ఆంజనేయుడు.

"ఐహిక కేష్వపి కార్యేషు మహోపత్సుచ సర్వదా
నైవ యోజ్యో రామచంద్రః కేవలం మోక్షదాయకః"

"ఐహిక విషయముల యందు రామసేవకుడగు నన్ను స్మరింపుడు. మీ కోరికలు నేను తీర్చెదను" అని హనుమంతుడు ఆస్తికవరులకు భరోసా యిస్తాడు.

"ఆంజనేయః పూజితశ్చే త్పూజితాస్సర్వ దేవతాః"

ఆంజనేయుని పూజించిన ఎల్ల దేవతలను పూజించినట్లే అనునది మన అచంచల భక్తి విశ్వాసం. పరాశరసం హితాదులు కరూడ అతడి మహాత్మ్యమును వేనోళ్ళ కొనియాడుచున్నవి. హనుమంతుని యదార్ధ రూప శక్తి విశేషములను యెఱుంగుటకు, స్మరించుటకు సుందరకాండ అధ్యయనం కంటె వేరొక మార్గం లేదు. మన దేవతీ వ్యవస్థలో ఒక విశిష్ట రూపం ఆంజనేయుడు. అందుచేతనే విష్ణువు అంశతో జన్మించిన శ్రీరామునికి ఆతడు నమ్మిన బంటు అయినాడు. హనుమంతుని రామభక్తి అపారం, అమేయం, అచింత్యం. ఆయన జీవితం సర్వం రామమయం. శైవ వైష్ణవ మధ్యమ తాను మాయులవారికి సమానంగా ఆరాధనీయుడు హనుమంతుడు.

హనుమంతుడు జితేంద్రియుడై రాక్షస మాయాజాల విచ్ఛేదన మొనర్చి పరిపూర్ణమగు విజస్వరూపంతో ప్రకాశించుట ఆనంద సంధాయకం. భగవద్భక్తి వలన అపార భీకర సాగరమును లంఘించి భగవత్కార్యమును సఫలీకృతము చేయగలమను గుణపాఠమును హనుమంతుడు మనకందించినాడు. సీతా కుశల వార్త విని చిరకాల వియోగ క్లేశానుభవానంతరం రాముడు సంతృప్తిని

పొంది మహదానంద భరితుడయ్యెను. అందులకు ప్రధాన సూత్రధారి హనుమంతుడు. సుందరకాండకు హృదయం హనుమంతుని దౌత్యం. నాయకాభ్యుదయం, యుద్ధం, మంత్రం, ప్రయాణం, దౌత్యం - అను ఐదు అంశాలు పంచ సంధులుగా, కావ్య మర్యాధకు ప్రతీకలు అని ప్రసిద్ధి బడసియుండుట సర్వజన విదితం.

మహాభారతంలో కౌరవ పాండవ దూత్యమునకు పార్థసారథియే పయనించవలసిన అగత్యం ఏర్పడినది. రామాయణంలో సుందరకాండలో దౌత్య భారం హనుమంతుని భుజస్కంధాల పైబడినది. భగవంతుని దౌత్య మొకచోట, భక్తుని దౌత్యము వేరొక చోట తటస్థించినవి. అన్నదమ్ముల రాజ్య పంపకమున ఐక్యత కల్పించుట శ్రీకృష్ణునికి అప్పచెప్పబడిన రాయబార ముఖ్యోద్దేశం. ఆలుమగలైన ఆదర్శ దంపతులైన సీతారాములకు సాన్నిధ్యం సమాగమమునకు తగు వాతావరణం కల్పించుట హనుమంతుని ముఖ్య కర్తవ్యం. తన కార్య రంగమునకు శ్రీకృష్ణుడు భూతలమున సునాయాసంగా వెళ్ళినాడు. పోయి మధ్యవర్తిగా కౌరవులకు పాండవుల అంతరంగమును నివేదించుట అతడి విహిత కర్తవ్యం. కాని భక్తుడైన హనుమంతునికి తన విద్యుక్త కర్తవ్య నిర్వహణ దుస్తరమైన మహాసాగర లంఘనముతో కూడుకొని వున్నది. జానకీ మాతను అన్వేషించి ఆమెను నమ్మించి రామదూతగా రహస్యముగా తనను పరిచయం చేసుకొని ఆమెకకు ఊరట కల్గించ వలెను. మాయా దక్షులగు రాక్షసుల నడుమ ఆమె విశ్వాసమునకు పాత్రమై తాను రామదూతగా వ్యవహరించి సందులకు తిరుగు ప్రయాణంలో సంకేతంగా ఆమె చెంతనుండి ఏదైన గుర్తు బడయవలెను. ఇంతటి సమర్థవంతమైన దౌత్యమును హనుమంతుడు జరుపవలసియున్నది. వాక్పటుత్వం, రూపం, ఆకలిని విగ్రహించుట, సకల దూత కుండవలసిన విశిష్ట గుణములని పంచతంత్రకారుడు నిర్దేశించియున్నాడు. ఏ రాజుకు మంచి గుణములు కల్గిన కార్యాసాధకులైన దూతలుందురో ఆ రాజుకు దూత వాక్యములచే సర్వ కార్యాలు సఫలమవుతాయని కిష్కింధకాండలోని రాముని వచనాలు

సుందరకాండలో రామదూత పట్ల సఫలీకృతమవుతాయి. ఆంజనేయుడు అస్ఖలిత బ్రహ్మచారి. దానవ మాయాజాలంతో తలమునకలై ఉబ్బితబ్బిబ్బు అవుతూన్న ఒక మహాకార్యం కాదు. ఆ విశ్వాసం సంపాదన కూడ రాక్షస రాజదాని యగు లంకా పట్టణమునందు ఇంక రాక్షసులే - మాయాదక్షులే కాదు - అతిక్రూరులౌదక్షులు. అందువలన హనుమ దౌత్యం కత్తిపై సాము వంటిది. ధైర్యం, దూరదృష్టి, బుద్ధి విశేషం, సామర్థ్యం - వంటి నాలుగు గుణాలు కల హనుమంతుడు తన కార్యసాఫల్యంలో అపూర్వ విజయం సాధించగల్గేడు. సింహికను వధించినపుడు ఆకాశ సంచారులు అన్న వాక్కులను ఆంజనేయుడు ఋజువు చేసుకొన్నాడు. ఆయన దౌత్యం లోకోత్తరమై ఫలప్రదమై రామలక్ష్మణ సుగ్రీవాదులకే కాక యావత్తు వానర జాతికి సంభ్రమాశ్చర్యాలు కొల్పి ఆనంద సంధాయక మవుతుంది. శ్రీకృష్ణుడు తన దౌత్య కార్యమున సఫలుడు కాలేక పోయినాడు. హనుమంతుడు తనకప్పగించిన కార్యములో సాఫల్యము చేకూర్చి ధనుఃఉయడ్డైనాడు. చరితార్థుడయ్యెను. తన పరాక్రమ ప్రభావంతో రాక్షసులను అదరగొట్టినాడు. రావణుని సోదరుడగు విభీషణుడు అంతటివాడు తన సోదరుని కాదని రాముని చెంతకు చేరి శరణాగతిని ఆశ్రయించుటకు అది సఫలీకృతమగుటకు మూలకారకుడు హనుమంతుడు. శ్రీకృష్ణుడు తన విశ్వరూపమును ప్రదర్శించినా కౌరవుల విశ్వాసం పడయలేక 'కృష్ణ మాయ' అని అవహేళనకు పాత్రుడయ్యెను. కాని హనుమంతుడు తన అమోఘ అవక్రపరాక్రమ సామర్ధ్యంతో తానొక అసామాన్య అప్రతిహత వ్యక్తినని రాక్షసుల సన్నిధిలో ఋజువు చేసుకొన్నాడు. తానొక సేవకుడైనా శత్రువుల సమక్షంలో శ్రీరాముడ్ని దివ్య తేజశ్శాలిగా బోధబేగినాడు. ఈ సందర్భంలో ప్రభువు కంటె సేవకుడే మిన్న, భగవంతుడి కన్న భక్తుడే పైచెయ్యి అని ఆంజనేయుడు నిరూపించినాడు. ఇందులో భగవద్విలాసం, మనోరథం తేటతెల్లమగును. తనకంటె భక్తుడే గొప్పవాడుగా సంచరించ వలెనన్నది భగవంతుని ఆంతర్యం, అంతరంగం.

తన దౌత్య కార్య నిర్వహణలో దానవుల యెడ సామదాన వేధదండో పాయాలను యధామతి యధాశక్తి ప్రయోగించి తన ఆసాధారణ చాతుర్యమును

ప్రదర్శించి దక్షతతో, విజ్ఞతతో నిర్వహించిన ప్రజ్ఞాశాలి హనుమంతుడు. అతడు అందజేసిన రాముని అంగుళీయకాన్ని సీతాదేవి అపురూప వరప్రసాదంలా భావించింది. లంకానగర ప్రవేశ సందర్భంలో లంకిణి ఎడ అతడు ప్రయోగించిన భేధోపాయంతో లంకానగర రహస్యముల నెల్ల ఆమెచే వెలువరింప జేసిన బుద్ధి చతురుడు హనుమంతుడు. రామకార్యమును అతిసమర్థవంతంగా, అతి ఉత్సాహంగా హనుమంతుడు నిర్వహించిన పాత్ర అనితర సాధ్యం అనిదం పూర్వం. "ఉత్సాహమే సంపదకు మూలం. అదే గొప్ప సుఖం. అదే సకల కార్యాలను సఫలం చేస్తుంది." ఈ మటలు అన్నది సాక్షాత్తు హనుమంతుడే! సీతాన్వేషణ యత్నం విఫలమై తన శ్రమ వ్యర్థమైనదని తపిస్తూన్న తరుణంలో అతడే అన్న మాటలివి. ఆ ఉత్సాహమే అతడిని కార్యోన్ముఖుడిని గావించి, ఎన్ని అడ్డంకులు వచ్చిన కార్య సాఫల్యత సాధించి ఆకాశదీపంలా నిలబడింది.

భారతమున దేవత లోక సందర్భంలో నలమహారాజును తమదూతగా ఎంపిక చేసుకొని తమ అభీష్టమును తామే దుర్వినియోగం చేసుకొన్నారు. కాని రామాయణంలో వానరులు తమ నాయకుని సామర్థ్యమును లెస్సగ విచారించి అందులకు యోగ్యుడైన హనుమంతుని ఎంపిక చేసుకొని కృతకృత్యులైరి. హనుమంతుని దౌత్యం వానర జాతికి సంతోష ప్రదాయకమై భాసించినది. వాయుపుత్రుని సందేశప్రాప్తియే సమకూరనిచో జనక పుత్రికకు ప్రాణత్యాగమే శరణ్యమయ్యేడిది. అశోకవనంలో అలమటిస్తూన్న సీతా సాధ్వీమణికి పరిపూర్ణ విశ్వాసం, నూతనోత్తేజం, ఆనందోత్సాహం, జీవితానురక్తి ప్రసాదించినవాడు హనుమంతుడు. ఆమెలో జీవించాలనే అచంచల విశ్వాసం పాదుకొల్పి ధన్యతగాంచినవాడు అనిలపుత్రుడు. శ్రీరాముని అనుగ్రహంతో ఉత్తేజకర వానర ప్రోత్సాహంతో సుగ్రీవాజ్ఞ ప్రోద్బలంతో తన దౌత్యకార్యాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చినట్లు అంజనేయుని వాక్కుల ద్వారా నేమనకు తేటతెల్లమవుతుంది :

"రాఘవస్య ప్రసాదేన భవతాంచైవ తేజసా
సుగ్రీవస్యచ కార్యార్థం మయామనుష్ఠితం"

(సుందరకాండ - సర్గ 58 - 168 శ్లో॥)

శ్రీరాముడు సత్వరమే వచ్చి రావణుని సబాంధవముగా వధించి సీతను చేకొనిపోగలడని ఆమె దుఃఖమునకు ఇక తావులేదని, తాను వాయుదేవుని పుత్రుడనని తన మాట విశ్వసింపుమని హనుమంతుడు అశోకవనంలో ఒక సందర్భంలో సీతాదేవికి విన్నవించుకొంటాడు. సీతాదేవితో అన్ని సంగతులు మాట్లాడిన పిదప ఆమెకు తన యందు సంపూర్ణ విశ్వాసం కుదిరిన పిమ్మట కాని హనుమంతుడు శ్రీరామ నామాంకితమైన అంగుళీయకాన్ని బయట పెట్టలేదు. తన మాటల వలన కల్గిన నమ్మకమును దృఢపర్చుటకు అంగుళీయకమును సద్వినియోగ పరచుకొన్నాడు. ఆదిలోనే అంగుళీయకమును సీతాదేవికి ఇచ్చి వుండునేని ఆమెకు దానివలన నమ్మకం కల్గి వుండెడిది కాదు. అది ఏదో రాక్షస మాయయని భావించి తీసుకొనుటకు నిరాకరించెడిది. అంగుళీయకమును రాముని వద్ద నుండి సంగ్రహించిన వంచనపరుడిగా తలంచి వుండెడిది లేక సందేహమైన కలిగివుండెడిది. ఈ పూర్వాపరాలు ఆలోచించుకొనియే బుద్ధిమంతుడైన హనుమంతుడు అంగుళీయకాంశం చిట్టచివరిలో యెఱింగించినాడు. దానిని చూచుకొని శ్రీరాముని కాంచినంత సంతోషం పొందెను. హనుమంతుణ్ని పలువిధాల ప్రశంసించింది. గొప్ప కార్యసాధకుడని, అతడి పరాక్రమం సామాన్యమైనది కాదని, అతడి బుద్ధి సాహసం ఎంతగానో ప్రశంసనీయాలని సముద్ర లంఘనం చేసి తానొక్కడే వచ్చి లంకా ప్రవేశం చేయుట మాటలు కాదని దుష్ట రావణుని సైతం లక్ష్యపెట్టని ధైర్యం ప్రదర్శించినాడని సీతాదేవి హనుమంతుణ్ని ప్రశంసించడం గమనార్హం. ఇంతటి ప్రశంసలు హనుమంతుడు శ్రీరామ చంద్రుని వద్ద నుండి కూడ పొందలేరు. రామదూత అని చెప్పినపుడు శక్తి సామర్థ్యములు సీతకు అవగతమయ్యెను.

సీతాదేవి దుఃఖమును సత్వరమకే బాప వలెనన్న తలంపుతో తన వీపుపై నెక్కి రమ్మని హనుమంతుడు సీతాదేవిని అభ్యర్థిస్తాడు. ఆసందర్భంలో అగ్నిహోత్రుడు హవిస్సును కొనిపోయి ఇందునికిచ్చునట్లు తాను సీతాదేవిని శ్రీరాముని కర్పింతునని చెపుతాడు. తనను అగ్నిహోత్రునితో సరిపోల్చుకోవడం

చాలా అర్థవంతమైనది. ఏలయన, అగ్నిహోత్రుడెంత పవిత్రుడో హనుమంతుడు అంతటి పవిత్రుడే కదా!

హనుమంతుని తోకకు నిప్పంటించి పురమంతయు ఊరేగించుచున్న వార్తను తెలిసికొన సీతాదేవి అగ్నిహోత్రుడ్ని ప్రార్థిస్తుంది. హనుంతునికి అపుడు అగ్ని బాధ ఏమి కలుగలేదరు. వాయుదేవుడు తన కుమారునిపై చల్లగా వీచినాడు. సీతాదేవి దయ వలన శ్రీరామ ప్రభావం వలన, వాయుదేవునికి అగ్నిదేవునికి గల మైత్రి వలన అనలుడు హనుమంతుని దహింపలేదు. సీతాదేవి తన భక్తునికి వచ్చిన ఆపద కూర్చి ఎంతగనో పరితపించినది. భక్తుని రక్షణ విషయంలో ఆమె ఆరాట పడింది.

విభీషణుని సలహా మేరకు దూత వద్ద నింద్యమని భావించిన రావణుడు హనుమంతుని తోకను కాల్చుటకు ఆజ్ఞాపిస్తాడు. జ్వలించే తోకతో మెరుపుతో కూడిన మేఘం వలె హనుమంతుడు లంకా నగర భవనాల మీద వీరవిహారం గావించి పట్టణాన్ని పరశురామ ప్రీతి గావిస్తాడు. లంకాదహన బీభత్సాన్ని పరికించేక హనుమంతునికి తనపై తనకే ఏవగింపు కల్గుతుంది. ఈ అనాలోచితకార్యం వలన పూజ్యురాలు సీతాదేవికి అనుకోని ఆపద సంభవిస్తే తన ప్రభుకార్యాన్ని హతమార్చినవాడుగా హనుమంతుడు అపకీర్తి మూటకట్టుకొనేవాడు. సీతాసాధ్వి అగ్ని వంటి పునీత. ఆమె సురక్షితంగా ఉన్నదను విషయం తెలుసుకొని కుశలంగా వున్న ఆమెనను మరొకసారి చూసి తిరుగు పయనానికి హనుమంతుడు ఆయత్త మవుతాడు. సుందరకాండకు సుందరమైన ముగింపు అది.

హనుమంతుడు తిరుగు ప్రయాణంలో మహేంద్ర పర్వతమును సమీపించి ఒక సింహ గర్జన చేసినాడు. అతడు గావించిన సింహనాదమును వినిన ఊహించి గ్రహింపగల్గినాడు. రాగానే వానరుల కెల్లరుకకు కనబడినది సీత (దృష్టా సీతా) అని సారాంశమును సంక్షేపముగా వివరించినాడు. హనుమంతుడు వాక్యకోవిదుడు. వానర మిత్రుల ఆందోళనమును తన సింహగర్జనతో కొంత వరకు ముందుగనే ఉపశమనం చేసినాడు. సమీపమునకు వచ్చినపుడు 'కనబడినది'

అన్నాడు. ఆ ఒక్కమాట చాలు వారి బాధ తీర్చుటకు 'సీత'యని ప్రారంభించునేని రెండవ మాట వచ్చు వరకు వారలకు సందేహమే కదా! 'దృష్టా' అని ప్రారంభించుట హనుమంతుని సమయ స్ఫూర్తికి దర్పణం పట్టును.

అంగదుడు మున్నగు వానర వీరులు మధువనములో ప్రవేశించి ధ్వంసం చేసి మధువును గ్రోలుచున్నారని సుగ్రీవుని మేనమామ దధిముఖుడు సుగ్రీవునికి మొరపెట్టుకొంటాడు. కార్యరసిద్ధి కానిచో అట్టి సాహసమునకు పూనుకొనరని ఇంగితజ్ఞుడైన సుగ్రీవుడు భావిస్తాడు. సీతాదేవి తప్పక కనబడి వుండునని హనుమంతుడే ఈ కార్యమును సాధించి వుండునని సుగ్రీవుడు తలపోస్తాడు. అతడు బుద్ధిమంతుడని అతని యందు ఉత్సాహం, పరాక్రమం జ్ఞానం కార్యసిద్ధికి వలయు లక్షణములన్ని పుష్కలంగా రాశీభూతమై వున్నవని సుగ్రీవుడు భావించడం హనుమంతుని భాగ్య విశేషం. హనుమంతుడు శ్రీరామునికి సాష్టాంగ ప్రణామం ఆచరించి "పాతివ్రత్య తేజంతో వెలుగుచున్న సీతాదేవి క్షేమంగా వున్నది" అని నివేదిస్తాడు.

"నియతామక్షతాం దేవీం రాఘవాయన్య వేదయతే"

(సుందరకాండ - 64 సర్గ - 368 శ్లో॥)

దృష్ట్వా సీతా (కనబడింది సీత) అని తన వానర మిత్రులతో చెప్పిన హనుమంతుడు రామునికి ఆ విధముగా నివేదింపలేదరు. అందలి హనుమ జేచితే ప్రజ్ఞా దురీణత గమనార్హం. సీతాదేవి కనబడినది, ఉన్నది అను మాటలు రామునికి చాలవు. సీతాదేవి పతివ్రతగా నున్నది అని చెప్పినచో రామునికది మిగుల ఆనంద సంధాయకముగా నుండును. ఎవరికి ఏ మాట చెప్పవలయునో ఆ మాట వారికి చెప్పుటలో హనుమంతునికి సరివచ్చువారు ఈ ప్రపంచంలో ఎవరూ లేరు. అందుచేతనే రాముడంతటి వాడు హనుమంతుని సంభాషణా చాతుర్యమును కిష్కింధలో ప్రశంసించినాడు. "ఋగ్యజు సామవేదములను చక్కగా అధ్యయనం చేసిన వాడు తప్ప ఈ హనుమంతుని వలె సంభాషించ లేరు. వ్యాకరణం కూలంకషంగా అధ్యయనం చేసినవాడు ఎంతసేపు మాట్లాడినా అపశబ్దం రాని వాడు" అని రాముడు ప్రశంసించడం గమనార్హం.

రావణ వధానంతరం భరతుడు తన అన్న గార్కి రాజ్యం సమర్పించి స్వీకరించమంటాడు. అతివైభవంగా జరిగిన శ్రీరామ పట్టాభిషేక సందర్భంలో హనుమంతునికి జరిగిన సత్కారం అనిర్వచనీయు అనిదంపూర్వ అవ్యక్తానుభూతి జనక రాజపుత్రి తనకంఠం నుంచి ముత్యాల హారం మాటిమాటికి తీసి వానరుల సమక్షంలో తన భర్త శ్రీరామ చంద్రుని వైపు సాభిప్రాయంగా వీక్షిస్తుంది. అపుడు ఇంగితజ్ఞుడైన ఇనకుల దీపకుడు శ్రీరామచంద్రుడు సీత ఆంతర్యాన్ని అవగాహన చేసుకొని నీవు ఎవరి పట్ల అత్యంత ప్రసన్నురాలవో వారికి ఆ హారం ఒసంగుమని, సూచిస్తాడు. అపుడు సీతాదేవి ఆ ముక్త హారాన్ని హనుమంతునికి ఇస్తుంది. అపూర్వమైన ఆ హారాన్ని ధరించి తెల్లని మేఘంతో కూడిన ఒక పర్వతం ప్రకాశించినట్లు హనుమంతుడు శోభిల్లినాడు. రామాయణంలో సగభాగం కాండలు - కిష్కింధ, సుందర, యుద్ధ కాండలలో సీతరామలక్ష్మణులతో ప్రాముఖ్యతను సంతరించుకొని తన బలమును, పౌరుషమును ప్రదర్శించి ఉత్తమ దూతగా ప్రవర్తించి రాముని ప్రీతిపాత్రమైన కౌగిలింత అందుకొన్న హనుమంతుడు ధన్యాత్ముడు, చరితార్థుడు :

త్వయ్యేవ హనుమన్నస్తి బలం బుద్ధిః పరాక్రమః
దేశ కాలానువృత్తిశ్చ నయశ్చ నయ పండితః

(కిష్కింద కాండ - 44 సర్గ - 7 శ్లో॥)

"మనోజవం మారుతతుల వేగం
జితేంద్రియం బుద్ధి మంతం వరిష్ఠం
వాతాత్మ జం వానర యూథ ముఖ్యం
శ్రీరామ దూతం శిరసా నమామి"

# గుహుడు

కోసల రాజ్య ప్రాంతమున ఒక చిన్న రాష్ట్రం కలదు. అది కోసల రాజ్యమునకు అంగరక్షకముగా నుండునది. దాని యధిపతి గుహుడు. అతడు విరాధ జాతీయుడు. ఇతడు అయోధ్యలో జరిగిన రాముని పట్టాభిషేక భంగ అశుభ సంఘటనకు అంత్యస్థానీయుడు సీతారాములను ఋషి వాటికలో చేర్చుటలో కీలకపాత్ర వహించినవాడు. ఇతడి మార్గ దర్శకత్వముననె రాముడు భరద్వాజుని ఆశ్రమమునకు సురక్షితంగా ప్రయాణం చేయగల్గెను.

శ్రీరాముని రథం గంగా తీరం నుండి శృంగిబేర పురమును చేరుకొనెను. పవిత్ర గంగానది సందర్శించిన అనంతరం సీతారామలక్ష్మణులు రథం నుండి దిగి ఒక గార చెట్టు క్రింద విశ్రమించినారు. వారు విడిసిన ప్రదేశం నిషాద రాజ్యంలోనిది. ఆదేశమునకు రాజా గుహుడు శ్రీరామునికి అతడు ప్రాణస్నేహితుడు. రాముడు తన రాజ్యములో అడుగుపెట్టెనన్న వార్త వినగానే గుహుడు ఆనందించి తన మంత్రులతో, పరిజనములతో వచ్చి వారికి అపూర్వ స్వాగత మిచ్చినాడు :

"రామ ప్రభూ! ఈ రాజ్యం నీకు సొంతం. నీ ఆగమనం మా రాజ్య ప్రజలెల్లరికి మహద్భాగ్యం. నీవంటి అతిథి మాకు లభ్యమగుట నా పురాకృత సుకృతం. ఇవిగో పిండివంటలు. భోజన పదార్థములు సిద్ధముగా నున్నవి. వీనిని ఆరగింపుము. మీ అందరకు ప్రశస్తమైన పాన్పులను సిద్ధం చేసినాను మీరు అధిరోహించి వచ్చిన గుఱ్ఱములకు వలయు మేత కూడ సమాయత్తపరచి

నానుసా ఆతిథ్యమును స్వీకరించి నన్ను కృతార్థుడిని చేయుడ"ని గుహుండు. పరిపరివిధాల రాముడ్ని అభ్యర్థిస్తాడు. ఇంటికి వచ్చిన అతిథులను యథోచితంగా సత్కరింపవలెనను భారతీయ సంప్రదాయమును ఆర్ష సమ్మతంగా ఆచరించుటలో సర్వోత్తముడు గుహుడు.

శ్రీరాముడు గుహుని రెండు బాహువులతో ఆలింగనము చేసుకొని నుడివిన పల్కులలో రాముని అసామాన్య సఖ్యత ప్రస్ఫుటమవుతుంది. "గుహా! బంధు పరిజనములతో కుశలముగా నిన్ను చూచు భాగ్యం మాకు కల్గింది. మేము ఎల్లపుడు నీ పూజనములందికొనుట హర్షదాయకం. కాలినడకన వచ్చి స్నేహ హస్తము అందింప చూడవచ్చితివి. నేను సర్వవిధాల పూజితుడనైతిని. నీవు ప్రీతితో సమకూర్చిన పదార్థము లన్నియు మరల నీకే ఇచ్చుచున్నాను పరిగ్రహింపుము. ప్రస్తుతము నేను వల్కలాజినమునలు ధరించి కందమూల ఫలదులు భుజించుచు వనవాస దీక్ష స్వీకరించితిని. కావున నేను ఇతరుల నుండి ఏ విధమైన పదార్థములు స్వీకరింపజాలను? ఈ గుఱ్ఱములు మా జనకునికి ప్రీతి పాత్రములు. వీనికి మేత సమకూర్చిన నాకది ఆనందదాయకం. అదియే నాకు నీవు చేయదగిన పూజనం."

శ్రీరాముడు నారబట్టలను ధరించి సంధ్యనుపాసించి లక్ష్మణుడు కొనితెచ్చిన గంగాజలమును త్రాగి సీతా సమేతుడై ఒక చెట్టు క్రింద శయనించాడు. సీతారాముల సంరక్షణార్థం ధనుష్పాణియై సుమంత్రునితో, లక్ష్మణునితో సంభాషించుచు ఆ రాత్రి అంతయు జాగారుకుడై రాముని కంటికి రెప్పవలె కాచిన భక్త శిఖామణి గుహుడు. గుహుడు రామునకు ఆత్మసముడైన సఖుడు. ఆత్మ సముడనగా ప్రాణ సమానుడనియు తనతో సమానుడనియు రెండు విధములుగా చెప్పుకోవచ్చును. వారి సఖ్యత లోక వ్యవహారములో కడు విలక్షణమైనది. ఈ బోయవానితో ఉత్తమ క్షత్రియ వంశ సంభూతుడైన రాజకుమారుడు రామునికి మైత్రి ఎపుడు కల్గెను, ఏ విధముగా వర్ధిల్లెనో వాల్మీకి మనకు వివరింపలేదు. అయినను గుహుని గూర్చి 'రాజా' 'బలవాన్' 'స్థపతి' అను మూడు విశేషాలు ఉపయోగించాడు. గుహుడు

అయోధ్యా పరిసరాలలోని బోయగూడెములకు చతురంగ బల సమన్వితుడైన రాజు. కోసల రాజ్య సరిహద్దులలోని ప్రాంతములకు పరిపాలకుడు. అట్టి ప్రభువులతో మైత్రి నెరపుట కోసల రాజ్యమునకు క్షేమంకరం; శుభంకరం. అందుచే రాముడు మృగయా వినోదార్థమో, వాహ్యాళి నిమిత్తమో వచ్చినపుడు గుహునితో మైత్రీ గావించికొని యుండును. ఆ మైత్రి కాలక్రమేణా ప్రాణ స్నేహంగా పరిణమించుటక్కు ఆస్కారం కలదు. అందువలన రాముడు వనవాసమునకేగు గుహుడి కలిసినపుడు రాముని గాఢాలింగ పురస్కారం పొందిన ధన్యుడు కాగల్గెను. నిషాదులకు అధిపతియైన వానిచే యజ్ఞమును చేయించవచ్చును. "నిషాద స్థ పతిం యాజయేత్" అను శ్రుతి వాక్యానుసారం నిషాధి పతికి యజ్ఞ కర్మకు అర్హత కలదు. అట్టి వానితో రాముని స్నేహం అనుచితమెట్లగును? అదియును గాక సేహం జాతిని బద్ధమై గాక గుణానుసారమై ఏర్పడును. సకల గుణములలో శ్రేష్ఠమైనది ధర్మ నిష్ఠ. అది గుహుని యందు పరాకాష్ఠకు చేరివున్నది. తనక అతిధులైన సీతారాములు నిద్రించునపుడు వారి రక్షణ నిమిత్తం రాత్రి అంతయు అతడు మేల్కొని యుండెను. అది అతని ధర్మ్రమ జాగారుకతకు ప్రబలతార్కాణం. రాముని రక్షణ విషయమున ఇతడు లక్ష్మణుని కాని, భరతుడ్ని కాని విశ్వసింపకుండుట గమనార్హం. వారు రామునికి సోదరులే కావచ్చును. మంచివారే కావచ్చును. కాని తన అతిధుల భద్రత తన ఆవశ్య కర్తవ్యమని భావించు నిష్కళాంక వర్తనుడు గుహుడు. రాజును రక్షించు సందర్భంలో ఎంతటి ఆత్మీయులనైనను నమ్మరాదను నైజం గుహునిది. ఇంతేకాదు భరతుడు రామునికి పట్టం కట్టి అయోధ్యకు మరల తోడ్కొని పోవుటకు చతురంగ బలములతో వచ్చి గంగానది పాడవున విడిసినప్పుడు అతడు రామునికి కీడు తలపెట్టి వచ్చిన వాడుగా గుహుడు శంకిస్తాడు. కల్లాకపటములు, లౌకిక మర్యాదలు తెలియని నిర్మల నిష్కల్మష ఆటవికుడు గుహుడు. భరతుడు రామునికి విరోధిగా వచ్చినచో తప్పక శిక్షార్హుడని, వాని నెదిరింప వలెనని నిశ్చయింప సమకట్టిన ఉదాత్తుడు గుహుడు. భరతుని అపార చతురంగ బలముల ముందట, భరతుని పరాక్రమం

ముంగిట, గుహుని ఆటవిక బలపరాక్రమాలు ముహూర్త మాత్రవిచ్ఛేదకాలని గుహునికి తెలుసు. అయినను ధర్మాత్ముడైన, మిత్రుడైన రాముని రక్షించుట తన విహిత కర్తవ్యమన్నది గుహుని ఆంతర్యం. ఆ కర్తవ్య నిర్వాహణలో తాను బంధు సపరివారంగా ఆహుతియగుటకు సిద్ధపడిన ఆత్మ సఖుడు గుహుడు. అవసర సమయంలో ఆదుకోని మిత్రుడు మిత్రుడే కాడనునది గుహుని నిర్మల అంతఃకరణ నివేదనం. ఈ ధర్మదీక్షాది దృక్ష వలననే గుహుడు రామునితో సమానుడగును కావుననే వాల్మీకి రామునికి ఆత్మ సమానుడైన సఖునిగా గుహుణ్ణి నిర్దేశించెను.

రాముడు ఎంతగానో గౌరవించినను గుహుడు మాత్రం "మేము సేవకులం. మీరు మాకు స్వామివి." అని వినయమునను, భక్తిని ప్రదర్శించెను. ఈ భక్తిని పురస్కరించుకొని సుప్రసిద్ధ రామాయణ టీకా తాత్పర్య విశ్లేషకుడు గోవింద రాజస్వామి గుహుడు అత్యుత్తమ భక్తశ్రేష్ఠుడని నిరూపించినాడు. "భగవద్భక్తులైన వారు జాతి చేత శూద్రులైనను వారిని భాగవతులైన విప్రులనియే భావింప వలెను. సర్వ వర్ణములందును ఎవరు భగవద్భక్తులు కారో వారు అందరును శూద్రులే యగుదురని పెద్దలు చెప్పియుండిరి." అయినను తన వర్తనములో గుహుడు వర్ణ ధర్మములను తూచా తప్పక పాటించెను. రాముని యొద్దకు పోవు సందర్భంలో కాలినడకనే గుహుడు వెళ్ళినాడు. రాముడు దానిని గమనించి మిగుల సంతోషించినాడు. (పదాభ్య మభిగమాచ్చైవ) తక్కువ జాతివారు ఉన్నతకులీనులైన వారి యొద్దకు వాహనములతో ఆడంబరంగా పోయి వైభవమును ప్రకటించుట అనుచితం. ఇంతేకాదు రాముడు గుహుణ్ణి ఆత్మీయంగా కౌగిలించుకొని గౌరవించినను అతడొసంగిన ఆహార పదార్థములను దేనిని స్వీకరింపలేదు. తాను వనవాస దీక్షలోనున్న కారణమున ప్రతి గ్రహింపను అని నిరాకరించినాడు (నహివర్తే ప్రతి గ్రహే) అంత మాత్రమున తమ యిద్దరి మధ్యను కల స్నేహం పలచబడినట్లు గాని, భంగం వాటిల్లినట్లు గాని గుహుడు అపార్థం చేసుకొనలేదు. అది అతని నిర్మల అంతఃకరణకు నిదర్శనం. మైత్రికి పరస్పర

ప్రీతియే ముఖ్యలక్షణం. అది అణువణువు జీర్ణించుకొన్న సాధు శీలి, పుణ్యచరితుడు గుహుడు. రాముడు తన చెంతకు వచ్చినపుడు గౌరవ ప్రేమ పురస్సరముగా గుహుడాతనిని ఆలింగనం చేసుకొని భక్తిని ప్రదర్శించెను. నిష్కల్మషమైన నిండు మనస్సుతో రాముడ్ని సేవించెను. రాముని అనుగ్రహం వలననే తాను సముహద్యశములు పొందన భిలషించెను. రాముని ఎడల గుహుడు ప్రకటించిన భక్తి సఖ్య పూరితం. అతడు అవలంబించినది సార్వభౌమవ్రతం. దీనికి జాతితో కాని ప్రదేశంతో కాని, కాలంతో కాని సమయంతో కాని ప్రసక్తిలేదు.

"ఏతే జాతి దేశకాల సమయూన వచ్చిన్నా సార్వ భౌమా మహావ్రతం" ఎల్లవారు ఎల్లపుడు ఎల్లర విషయమున చేయదగు మహోదార వ్రతం గుహుడాచరించెను. అందుచే రామాయణంలో గుహుడు నిర్వహించిన పాత్ర రాశి అత్యల్పమైనా అతడి గుణ వాసి అనల్పమైనది అని భావుకులు సంభావిస్తారు. విశాల భావబంధురమైన మహావ్రతమును ఆచరించిన గుహుని యింట రాముడు ఆతిధ్యమును గ్రహింపలేదు. గుహుడు తెచ్చిన పదార్ధములు స్వీకరింపలేదు. లక్ష్మణుడు తెచ్చిన గంగాజలములతోనే ఆ రాత్రి రాముడు గడిపెను. అందులకు కారణం రామునికి వాస్తవముగా గుహుని పట్ల స్నిగ్ధ భావం లేక కాదు. గుహుడు విజాతీయుడన్న వివక్షయుకాదు. ఆ సమయమున రాముని మనస్సు విందులు ఆరగించుటకై ఆత్రపడుటలేదు. పితృ వాక్యపాలనకై అతడు కైకేయికి మాట యిచ్చి కానన భూములకు కదలి వచ్చినాడు. దానిని నిర్విఘ్నంగా నిర్వహించవలెనన్న ఆలోచనతో అతడి మనస్సు సతమతమగుచుండెను. ఏ వ్రతం కాని, ఏ శుభకార్యం కాని ఉపవాస దీక్షతో నారంభించుట ఆర్ష సంప్రదాయం. అట్టి పవిత్ర దీక్షా బద్ధ కంకణుడైన రాముడు గుహుని ఆతిధ్యమును నాడు వనవాస ప్రారంభ దినమగుట వలన స్వీకరించుటకు నిరాకరించినాడు. అయినను గుహుని సంతోషపెట్టుటకు తన తండ్రి దశరధునికి ప్రేమ పాత్రములగు రధాశ్వములకు సంతృప్తికరముగా ఆహారమిడునని అభ్యర్ధించినాడు. రాముడు గుహుడ్ని ఆత్మ మిత్రుడుగా

భావించెను. కాని గుహుడు రాముడ్ని కేవలం మిత్ర మాత్రంగా దలంపలేదు. రాముని మహత్త్వం కుంచించి తన స్థాయికి అతడిని దిగజార్చలేదు. రామునికొక వినమ్ర భక్తునిగా, దాసానుదాసుడిగా గుహుడు తలంచెను.

గుహుని వద్ద విచిత్ర మైన వశీకరణ శక్తి గుప్తమై వున్నది. అది చాల సున్నితమైనది. స్నేహ ప్రధానమైనది. ప్రేమ పురస్సరమైనది. కనుకనే తన తండ్రి దశరధుడ్ని సైతం కట్టుడు, కొట్టుడు (బధ్యతాం, వధ్యతాం) అని వెర్రి కేకలు వేసిన కోపస్వభావుడు లక్ష్మణుడు తన ఉద్రేక స్వభావాన్ని అణచుకొని గుహుని వద్ద అన్నెం పున్నెం యెఱుగని అమాయక బాలుడి వలె ప్రవర్తించినాడు. దశరధుడు తన తండ్రియని చెప్పుటకు లజ్జ పడిన అభిమాన ధనుడు లక్ష్మణుడు రామునని రాజ్యాభిషిక్తు నొనరింపకయే మరణించునని శంకించినాడు. అందులకు ముఖ్య కారణం గుహుడున్న స్థలమహాత్య్మ పవిత్రత, అతడి ధరమ్ర శీలత్వం. రాముని కన్న ప్రియుడైనవాడు గుహునికి ఈ భువి యందు మరియొకడు లేడు.

"నహి రామా త్ప్రియత రోమయాస్తి భువి కశ్చిన
బ్రవీయ్మ్యే వచతే సత్యం సత్యా నైవచతేశేపే"

రామచంద్రుని అనుగ్రహం వలన ఈ లోకంలో ధర్మలాభం, పుష్కల అరధ్రకామాలు, మహనీయ కీర్తి కల్గునన్న అచంచల భక్తి విశ్వాసములు కల పరమ భాగవతోత్తముడు గుహుని శేష జీవితం పునీతం వినీతం కాగల్గడం అతని పూర్వజన్మ సుకృత విశేషం.

"తత్ర రాజాగుహో నామ రామన్మాత్మ సమసఖా
నిషాద జాత్యో బలవాన్ స్థపతిశ్చేతి విశ్రుతః

# సుగ్రీవుడు

భారతీయ సారస్వత వినీలాకాశంలో వాల్మీకి సమున్నల హిమవన్నగ సన్నిభుడు. రామాయణం ఒక పునీత మానస సరోవరం. సహృదయ భావుకులక ఆస్తిక జనవరేణ్యులకు పలుకుల రాణివాణి వాల్మీకికి ప్రసాదించిన అపురూప వరం. అట్టి రామాయణ కావ్య ప్రశస్తికి ప్రధానంగా కారణ భూతులైన నాయికానాయకులు - సీతారాములతో పాటు విశిష్ట గుణపారం ప్రబోధించు పాత్రలు అడుగడుగున మనకు తారసిల్లు చుండును. ధర్మ సంస్థాపన క్రతువులో శిష్టరక్షణ దుష్టశిక్షణ కార్యనిర్వహణలో పరాత్పరుడైన శ్రీరామచంద్రునికి సహాయ సంపత్తులు అందించి సేవలోనర్చిన భక్తులలో, మిత్రులలో పేరెన్నిక గన్న మహానుభావులు - హనుమంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు మున్నగు వారు. రాముని మహోన్నత ఆదర్శలక్ష్య సిద్ధికి సర్వాత్మనా సహకరించి సఖ్యమునకు వెలలేని గౌరవ ప్రతిష్ఠ లినుమడింప జేసిన వారిలో ఆద్యుడు సుగ్రీవుడు. రామాయణంలో రామసఖుడుగా ప్రప్రథమ ప్రాధాన్యత సంతరించుకొన్నవాడు సుగ్రీవుడు. ఆపద సమయమందు యధోచిత సలహాలొసంగి రామునికి అనేక విధముల అనేక సందర్భముల తోడ్పడిన దిట్ట సుగ్రీవుడు. ధర్మాధర్మ నిర్ణయములలో వీరుని వెన్నంటి లక్ష్యం వైపు పురోగమింప జేసిన ధీమంతుడు, కార్యదక్షుడు సుగ్రీవుడు. సీతా వియోగం వలన దుఃఖాను తప్తుడగు రామునికి ఊరట కల్గించుట నందేమి, వాలి వధకు రాముని ప్రోత్సహించుటలోను, చివరకు సీతాన్వేషణ సత్కార్యములో రాముడ్ని అనునయించి సాయపడుటలోనేమి. సుగ్రీవుని నిష్కామ నిర్మల నిస్వార్థ సఖ్యం కాకుత్స విహాయసంలో ధ్రువతార వలె ప్రకాశించినది. అతడే కాదు, అతడి

పర్యవేక్షణలో నున్న వానర సమూహమంతటిని సంఘటిత పరచి అన్ని సందర్భములలో త్రికరణశుద్ధిగా,అగ్ని సాక్షిగా రాముని సఖ్యతకు సార్ధక్యము సమకూర్చినవాడు సుగ్రీవుడు. అతడు చండశాసనుడై కోదండరామునికి అండదండలందించినాడు. సుగ్రీవాజ్ఞారక్ష జగత్ప్రసిద్ధమై జగత్కళ్యాణ కారకమై సంశోభిల్లినది. అతడు క్రమశిక్షణలో ఆదర్శప్రాయుడు. వానర ప్రముఖులనందరిని నలుదిశలకు పంపి సీతాన్వేషణ క్రతువు ఆరంభానికి సూత్రధారి కాగల్గెను. యుద్ధరంగంలో మహానాయకుడై అపారవానర సైన్యాన్ని క్రమబద్ధంగా నడిపించి విజయలక్ష్మి సాధన అంతిమ లక్ష్యాన్ని అవలీలగా నెరవేర్చిన అతిరధుడు సుగ్రీవుడు.

మహాభారతంలో భగవదంశ సంభూతుడగు శ్రీకృష్ణుడు పాండవులకు సారధి కాగా, రామాయణంలో భగవంతుడు రామునికి వానరులే సారధులై, సఖులై రావణ సంహార లక్ష్యసాధన వైపు పురోగమించిరి. అవతారమూర్తియగు శ్రీరాముని సందర్శ సంస్పర్శనములచే వానర మాత్రులకు కూడా ధర్మము నందు ఆసక్తి, సత్యమున నందు నిరతి, కిష్కింధకాండలో సర్వత్రా సాక్షాత్కరించును. రామాయణమును రామగీతగా భావించినచో వాల్మీకి అయోధ్యకాండలో కర్మయోగమునకు నాందీ ప్రస్తావన గావించుడు. అరణ్యకాండలో శబరి తీర్ధంతో జ్ఞానయోగం గఱపినాడు కిష్కిందకాండలో జ్ఞానాంతంలో వానర పుంగవుల భక్తి యోగం సాక్షాత్కరింప జేసినాడు. చివరకు యుద్ధకాండలో రామలక్ష్మణులు, వానర యోధుల అవక్ర పరాక్రమ విశ్వారూప సందర్శనానుభూతి కల్గించేడు. "రామార్థే త్యక్త జీవితాః" 'రాముని కొరకు మాజీవితాలర్పింతుము' - ఇవి వానరుల గళం నుండి ఉబికి వచ్చి వినమ్రభక్తి పూరిత భాషణములవి. నిష్కామ చింతనతో ధర్మ సంరక్షణ కొరకు శాఖామృగములు ఆ విధముగా పల్కుట రామాయణ మందు గాక మరెచ్చటైనా వినగల్గితిమా? కనుకనే వానరుల సఖ్య సంపత్తిని విస్మరింపక వారి స్నేహ జలధిలో శ్రీరాముడు ఓలలాడినాడు. ఆధ్యాత్మిక జ్ఞాన నిధులగు ఋషులు శ్రీరామునకు హృదయములు కాగా వనరులు నిర్మలమైన మనస్సులైరి. అట్టి వానరులకు నాయకుడైన సుగ్రీవుడు. శ్రీరాముని ప్రాపు వీడజాలని

ప్రియసఖుడైనాడు. సుగ్రీవుని సఖ్యత రామాయణంలో లోకాతీతం. వర్ణనాతీతం.

అరణ్యకాండలో రాముని దుష్టశిక్షణా కృత్యములలో ఒక భాగముగా విగత బాహు యుగళుడగు కబంధుడను రాక్షసుడు అసువులు బాసినాడు. తన నిజసుందర రూపమును దాల్చి రాముని బహుభంగుల ప్రస్తుతించి, శబరీ, సుగ్రీవుల జాడ నెఱింగించి రాముని మంగళకర ప్రతిజ్ఞకు అంకురార్పణ గావించాడు. సుగ్రీవుడు భాస్కరుని కౌరసుడు. ఋక్షరజస్సు కుమారుడు. వానరాధిపుడు. కామరూపి సుగ్రీవుడు. అగ్రజుడగు వాలిచే పరాజితుడై పరాభవింపబడి ఋశ్యమూక పర్వత ప్రాంతంలో తలదాచుకోవలసిన దైన్యావస్థకు చేరెను. రాముని వలె ఆపదలో నున్నవాడు. అతనితో అగ్ని సాక్షిగా మైత్రి నలవర్చుకొన్నచో రామునికి మేలు చేకూరగలదని కార్యసాధన విధానము కబంధుడు రామునికి సూచించినాడు. సుగ్రీవుడు, సత్యసంధుడు, వినీతుడు, బలపరాక్రమవంతుడు. సీతాన్వేషణమున రామునికి సాయపడగల సమర్ధుడు. అతనితో సఖ్యం ముఖ్యమని భావించి నాడు. రాముడు. రాక్షసులు నివసించు ప్రదేశములన్నియు చక్కగా నెఱిగిన వాడు సుగ్రీవుడు అతడొక సామాన్యమైన వానరమాత్రుడిగా సంశయింపనక్కరలేదు. అతనికి తెలియని ప్రదేశములు ఈ లోకములోనే వుండవు. అన్ని చోట్ల వెదకించి సీతాదేవి ఎందున్నదో అవలీలగా తెలిసికొన సమర్ధుడు సుగ్రీవుడు. సీతాదేవి పాతాళము నందున్ననున ఆమె జాడ తెలుసుకొని రాక్షసులను వధించి సీతాదేవిని రామునికి తెచ్చి సమర్పించగల కార్యదక్షుడన్న భావం కబంధుని వచనముల వలన రాముని హృదయంలో బలవత్తరంగా నాటుకు పోయింది. ఇప్పుడు సుగ్రీవాన్వేషణ రామునికి తక్షణ ఆవశ్య కర్తవ్యం. రామలక్ష్మణులు పంపా సరస్సును వీడి సుగ్రీవుడ్ని కలిసికొనే ప్రయత్నంలో ప్రయాణం సాగించారు.

ఋశ్యమూక పర్వత ప్రాంతమున ఒకనాడు సంచరిస్తూండగా రామలక్ష్మణులు ఇరువుర్ని సుగ్రీవుడు చూడటం తటస్థిస్తుంది. తొలుత వారిని చూడగానే భీతి చెంది దిగులుపడినాడు. వాలి పనుపున వచ్చిన వీరవరులై ఉందురని భావించినాడు. మునివేషంలో మారువేషమున వచ్చిన శత్రువులుగా సుగ్రీవుడు తలచాడు. ధనుర్బాణములను, ఖడ్గములను ధరించిన దేవతల

వలె అగుపించిన రామలక్ష్మణులను చూచుట తోడనే సుగ్రీవుడు భయపడుట లో అబ్బురం లేదు. ఆ భీతితోనే, వారెవరో వచ్చిన కారణమేదో అన్ని వివరములు కనుగొని రమ్మని త అమాత్య ముఖ్యుడు హనుమను ఆజ్ఞాపించినాడు. సుగ్రీవుని ఆజ్ఞానుసారం హనుమ భిక్షురూపంలో రామలక్ష్మణులను దర్శించి, నమస్కరించి వారిని తొలుత ప్రశంసించినాడు. తన ఆగమనమునకు కారణం సవివరంగా విన్నవించుకొన్నాడు :

"ధర్మాత్ముడగు సుగ్రీవుడను వానర ప్రభువునకు ముఖ్య సచివుడ్ని నేనను. ఆ మహాత్ముడు పంపగా మీ సన్నిధికి వచ్చినాను. అన్నయైన వాలి వలన అపకారం పొంది నిరాశ్రయుడై దీనావస్థలో నున్నవాడు. మీ సఖ్యం కోరుచున్నాడు." ఈ పల్కులు వినగానే రామునికి అమిత సంతోషం కల్గెను. సుగ్రీవుడ్ని కలిసికొనవలెనని రాముడు ఆత్రపడుచున్న తరుణంలో వెదకబోయిన తీగ కాలదగిలినట్లు ఆ సుగ్రీవుని మంత్రియే వారలను కలుసుకొన వచ్చినాడు.

"ఇతడు మనకు రావలసినవాడు. మాటకారితనం కలవాడు. ఇతడితో మధురంగా సంభాషింపము" అని రాముడి లక్ష్మణుడ్ని ఆదేశిస్తాడు.

సుగ్రీవుని సుగుణములు తాము ఇంతకు ముందే విని యున్నామని, అతని అన్వేషించుచున్నామనియు, సుగ్రీవుని విషయమున హనుమంతుడు కోరిన విధంగానే చేయుదమని లక్ష్మణుడు అభయం ఇస్తాడు. కబంధ వచనానుసారం లేము సుగ్రీవాన్వేషణలో తాము తలమునకలై వున్నామని లక్ష్మణుడు హనుమకు చెపుతాడు. "మాకు సుగ్రీవుడే శరణ్యుడు. లోకనాధుడని పేర్గాంచిన మా రాముడు సుగ్రీవుని నాధునిగా కోరుచున్నాడు. సర్వలోక శరణ్యుడైన రాముడు సుగ్రీవుని శరణు కోరుచున్నాడు. అందరికి అనుగ్రహం ప్రసాదించగల రాముడు సుగ్రీవునికి అనుగ్రహంకై నిరీక్షిస్తున్నాడు. దశరధ చక్రవర్తి జేష్టపుత్రుడు వానర రాజును శరణు వేడుచున్నాడు." ఇంతటి దీనాలాపములు లక్ష్మణుని నోటివెంట ఎట్లు బయలు పడినవా అను సందేహం ఎవరికైననను కలుగక మానదు. ఈ సందర్భంలో సీతావియోగ క్లేశ ఉపశమనమునకై లక్ష్మణుడు. అట్టి పరిదేవనములు పల్కుటకు

వెనుకంజవేయలేదు. సుగ్రీవుని ఔన్నత్యము చాటి చెప్పుటకు ఇంత కంటె నిదర్శనమేమున్నది?

వెంటనే అందరు సుగ్రీవునికి సన్నిధికి బయలు వెడలినారు. హనుమంతుడు వెంటనే భిక్షురూపమును విసర్జించి వానర రూపంతో తన భుజస్కంధములపై సోదరులిరువురను యిడికొని సుగ్రీవునికి చెంతకకు చేర్చినాడు. ఇక సుగ్రీవాన్వేష చంత రామలక్ష్మణులకు సమసిపోయినది. శ్రీరాముడే సుగ్రీవుని సఖ్యం చేయవచ్చినాడని, శరణు కోరుచున్నాడని హనుమ చెప్పిన మాటలకు సుగ్రీవుడు ఉప్పొంగిపోయినాడు. ఇంతదనుక అతడ్ని బాధించిన రామభయం మనుష్య రూపమును దాల్చి రామలక్ష్మణులకు చెంతకు వచ్చినాడు. అతడు పల్కిన నుడువులనే యధాతథంగా పరిశీలిద్దాం :

"రామ ప్రభూ! మీ సుగుణములు, అవక్రపరాక్రమాదులు వాయు పుత్రుని ద్వారా వింటిని. వానరమాత్రుడనైన నన్నింతగా గౌరవించి నా స్నేహం మీరు కోరుట నాకు శుభపరిణామ దశ. నాచేతిలో చేయి వేసి మన సఖ్యం సుస్థిరం చేయండి." అంటూ వినమ్రంగా తొలుత సుగ్రీవుడు సంభాషించాడు. ఆ పలుకులు సుగ్రీవుని వినమ్రతకు అద్దం పడుతాయి. శ్రీరాముడు వెంటనే సుగ్రీవుని చేతిలో చేయివేసి గాఢాలింగనం గావిస్తాడు. ఇంతలో హనుమ వచ్చి అగ్నిమధించి పుష్పములతో పూజించి రామ సుగ్రీవుల మధ్య వుంచుతాడు. అగ్నికి ముమ్మారు వారు ప్రదక్షిణం చేసి వారి మైత్రీ బంధాన్ని దృఢతరం చేసుకొంటారు. ఆ సన్నివేశం కిష్కింధ కాండలో ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కల్గిస్తుంది. స్నేహితులిరువురు పరస్పరం చూసుకొని ఆనంద పారవశ్యంలో మైమరచి పోతారు. ఈ విధమైన రామ సుగ్రీవుల సఖ్యం అగ్ని సాక్షికం చేసి దృఢతరంగా పవిత్ర బంధంగా చేసిన వాడు హనుమంతుడు. అతడి సద్యః స్ఫూర్తి, కార్య నిర్వహణ దక్షత వారిని కలుపుట యందు వ్యక్తమైనది. అగ్ని సాక్షికమైన మైత్రి వైవాహిక బంధతుల్యం. జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా దాంపత్య బంధం ఎట్లు వీడరానిదో అట్లే రాముని సుగ్రీవుల స్నేహ బంధం విడరానిదయ్యెను. వారి మైత్రి ఎంతటి గొప్పదో కదా! రాముడు కౌగలింతలిచ్చి ఎన్నో పర్యాయములు ఆదరించినాడు.

సుగ్రీవుడు ఎంతో అదృష్టవంతుడు. అతని భాగ్యమే భాగ్యం. రాముడు సుగ్రీవుడు సఖ్యంగావించుకొన్న తరుణంలో సీతాదేవికి, వాలికి, రావణాసురునికి ఎడమ కన్నులు అదిరినవి సుగ్రీవుడు తనకు గల్గిన కష్టములన్నియు వివరించి రాముని అభయహస్తం అభ్యర్థించాడు. వాలి వధకు రాముడు వాగ్దానం గావించేడు. ఆ సందర్భంలో సుగ్రీవుడు రామునికి ధైర్యం చెప్పి పల్కిన ఉపశమన వాక్యాలలో సుగ్రీవుని వ్యక్తిత్వం మనకు గోచరిస్తుంది. "రామా! నీ భార్య పాతాళ మందున్నను, ఆమెను నష్టపోయినవే దశ్రుతి వలె నీకు నేను సమర్పించగలను." ఈ వాక్యాలలో సుగ్రీవుని వాక్చాతుర్యం, జాగారుకత గమనార్హం. సీతను రావణుడు అపహరించెనని పక్షిరాజా జటాయువు ద్వారా విన్నప్పటి నుండియు ఆమెను గూర్చి ఆందోళనతో పరితపిస్తున్న రామలక్ష్మణులకు ఈ ఉపశమన వాక్యాలు కర్ణ రసాయానంగా తోచినది. వేదశ్రుతి సనాతనం అది స్వరూపం చేత ఎప్పుడూ నశించదు. వేదశ్రుతి నష్టం రాక్షస దాడుల వలన ఏర్పడే వైపరీత్యం. అంత మాత్రాన ఒకానొక ప్రాంతంలో వేదాధ్యయన పరులు లేకుండా పోరు. వేరొక ప్రాంతంలో వేద శ్రుతి నిరాటంకంగా సాగుతుంది. అట్లే సీత జీవించియే యుండును; పవిత్రంగా నుండును; ఆమెను మరల రాముడు భార్యగా స్వీకరించ వచ్చును. ఇట్టి మధురభాషణములతో సుగ్రీవుడు రామునికి ఊరట కల్గించినాడు.

సుగ్రీవుడు గుహలోనికి వెళ్లి తిరిగివచ్చి సీతన గల మూటను భద్రముగా తెచ్చి చూపినాడు. రాముడు వానిని విప్పి చూచినాడు. ఆభరణములన్నియు సీతా మహాసాధ్వికరి చెందినవిగా గుర్తించి గుండెలపై నిడుకొని దీనంగా రాముడు విలపిస్తాడు. సీతాదేవి నపహరించుకొనిపోయిన రావణుని ఉనికి, వివరాలు అడిగిన రామునికి సరియైన ప్రత్యుత్తరం ఇచ్చుటకు సుగ్రీవునికి శక్తి చాలకపోయెను. అయినా రావణుని అంతు తేల్చుకొని వధించి రాముని కానందం కల్గిస్తానని మరోసారి అభయమిస్తాడు సుగ్రీవుడు.

"రామా! నీవంటి వీరుడిట్లు దుఃఖించుట సరికాదు. నన్ను చూడు. నేను భార్యను పోగొట్టుకొన్నవాడనే! నేను ధైర్యం విడువలేదు. నావంటి వానరుడే ధైర్యమును వదలకయున్నచో నీవంటి మహాత్ముడు, ధృతిమంతుడు ఎంత

ధైర్యముగా నుండవలెను? శోకమును త్యజించి, ధైర్యము వలంబింపుము." వయస్య భావంతో సుగ్రీవుడు చేసిన హితవచనాలు తలమానికాలు. రామునకి దుఃఖ విదారకాలు. ఆ పల్కులకు రామునికెంతో ఊరట కల్గింది. సుగ్రీవుని వంటి మిత్రుడు లభ్యమగుట సులభం కాదని, కష్టకాలంఓ దొరుకుట అరుదని రాముడు భావించుట సుగ్రీవుని పురాజన్మ సుకృతం. తన దైన్యంపోయి, ధైర్యం కలిగింది శ్రీరాముడు సుగ్రీవుడ్ని హృదయపూర్వకంగా అభినందిస్తాడు. అవతారమూర్తి అభినందనలందుకొన్న సుగ్రీవుడంతటి అదృష్టశాలి వానర జాతిలో నభూతో నభవిష్యతి సీతాన్వేషణ ప్రయత్నమునకు పూనుకొమ్మని సుగ్రీవుడ్ని అభ్యర్థిస్తాడు. అందుకు ప్రత్యుపకారంగా వాలి వధ నిశ్చయమని ప్రమాణం చేసి మరల రాముడు చెపుతాడు. వలి పరాక్రమమునకు భీతిల్లు చున్న సుగ్రీవునికి తన పరాక్రమం చూపి రాముడు సందేహ నివృత్తి గావిస్తాడు. ఒక్క బాణం ప్రయోగించి సప్తసాల వృక్షములను బేధించి పర్వతమును, ఛేదించి, భూమిలోనికి ప్రవేశింపజేసి, భూమిని ఛేదించి, కొనివచ్చినట్లు చేస్తాడు. ఆ బాణం శ్రీరాముని తూణీరంలోనికి యధాస్థానంలో చయేరు అద్భుత దృశ్యాన్ని గాంచిన సుగ్రీవుడు నిశ్చేష్టుడవుతాడు. సాష్టాంగంగా ప్రణిమిల్లుతాడు. ఆవేశం చల్లారకముందే తన ఆకాంక్ష నెరవేరడం మేలని భావించు వివేకధనుడు సుగ్రీవుడు.

"రామా! నా శోకం తీరింది. నీ పరాక్రమం పట్ల నాకు యిసుమంతేని సందేహం లేదు. వాలినిప్పుడే వధింపవచ్చును." కిష్కిందకు పోయి వాలిని వెంటనే యుద్ధానికి సుగ్రీవుడు ఆహ్వానిస్తాడు. వాలి సుగ్రీవులకు ఘోర యుద్ధం జరిగింది. శ్రీరాముడు ధనస్సును సిద్ధం చేసినాడు. ముందుగా వాలి సుగ్రీవులను చూచినాడు. అచ్చుగుద్దినట్లు ఇద్దరూ ఒక్క పోలికలోనే గోచరించారు. వాలిని గుర్తింపక శ్రీరాముడు ఉపేక్షించాడు. పర్యవసానంగా సుగ్రీవుడు వాలిచే మర్దింపబడినాడు. సుగ్రీవుని శరీరమంతయు రక్తసిక్తమైంది. రాముని జాడకానరాలేదు. వాలి వెనుదిరిగినాడు. వాలి సుగ్రీవు లిద్దరికి ఆకృతులలో తేడాలేనందున తన శరసంధానానికి ఆటంకమయ్యెనని రాముడు సుగ్రీవుడ్ని అనునయిస్తాడు. మరల వాలితో యుద్ధానికి

అన్నగారు ఆదేశించిన మేరకు లక్ష్మణుడు కిష్కింధకు వెళ్లి దిక్కులు పిక్కటిల్లే లాగున ధనుష్టంకారం చేస్తాడు. భయకంపితుడై కలత చెందిన సుగ్రీవుడు లక్ష్మణుడి యెదుట పడసాహసించలేకపోయాడు. ఉత్తమ పురుషులు స్త్రీల పట్ల దురుసుగా వర్తించరన్న ఆలోచనతో ముందు తారను పురికొల్పి ఆమె ద్వారా రాయబారం పంపుతాడు సుగ్రీవుడు. ఇంగితజ్ఞురాలైన తార ఆర్ష ధర్మ సమ్మతంగా సంభాషించి తన భర్త ఎంత కామ పరతంత్రుడైనా రామునికి సహాయంలో అప్రమత్తుడుగానే వున్నాడని యెఱింగించి లక్ష్మణుడి క్రోధాగ్నిని చల్లారుస్తుంది. అంతలో వానరాజు సుగ్రీవుడు వినయవిధేయతలతో వచ్చి సమయోచిత సరస సంభాషణ గావించి అతడ్ని ఆనందింపజేస్తాడు. ఒక్క బాణంతో సప్తసాల వృక్షాలను, పర్వతాన్ని, భూమిని ఛేదించిన మహా పరాక్రమశాలి కోదండరామునికి వేరొకరి సహాయం అపేక్షణీయమా? అంటూ లక్ష్మణుడ్ని సుగ్రీవుడు అనునయిస్తాడు. చివరిలో అతడు గావించిన ముక్తాయింపు మనకు ముచ్చట గొల్పుతుంది.

"యదికిఞ్చి దతిక్రాన్తం విశ్వా సాత్ప్రణయేనవా
ప్రేష్యస్య క్షమితవ్యం యేన కశ్చిన్నాపరాధ్యతి"

చనువుతో విశ్వాసంతో భృత్యుడైన వాడు తప్పు చేస్తే క్షమించాలి. తప్పు చేయని వాడెవడు ఈ ప్రపంచంలో ఉండడు కదా!

వెంటనే సుగ్రీవుడు బలవంతులైన వానరులు మోసే ఒక బంగారు పల్లకిని తెప్పించి అందు లక్ష్మణుడ్ని అధివసింపజేసి తాను కూడ అభిముఖంగా ఆసీనుడై మాల్యవత్పర్వత ప్రాంతంలో వున్న రాముని సన్నిధికి చేరుకొంటాడు. అపారవానర సేనాని వహములతో దరిజేరి తన పాదాలపై మోకరిల్లి, ప్రణమిల్లి తలవాల్చిన సుగ్రీవుడ్ని లేవదీస్తాడు. ఆపైన ప్రసన్న రాముడు స్నేహ సౌహార్దాలతో ఆలింగనం చేసుకొంటాడు. వెంటనే సుగ్రీవుడు బలవంతులైన వానరముఖ్యులనందరిని రప్పించి, సమావేశ పఱచి సీతాన్వేషణలో ఎవరి గురుతర బాధ్యతలను వారికి అప్పగిస్తాడు. ఆ విధంగా కిష్కింధ కాండలో సుగ్రీవుడు ఒక ప్రముఖ నాయక పాత్ర సమర్ధవంతంగా పోషించి తన అకలంక స్వామి భక్తి అనన్య సామాన్య సఖ్యతను ప్రకటిస్తాడు. ఇక సుందరకాండలో

ప్రముఖపాత్ర నిర్వహణకు తనకు అభిమాన పాత్రయైన సచివుడు కార్య సాధకుడు, హనుమంతునికి శ్రీరామునిచే నా ముద్రాంకితమైన అంగుళీయకాన్ని అందజేసి సీతను అన్వేషించి రామలక్ష్మణుల కుశలవార్త నెఱింగింపమని ఆదేశిస్తాడు. హనుమంతుని నియోగం సుగ్రీవుని రాజనీతిజ్ఞతకు, మేధాసంపత్తికి దర్పణం పట్టింది.

యుద్ధ కాండలో యుద్ధ విధాన సైనిక వ్యూహారచనలో రామలక్ష్మణులు, హనుమంతుడు, అంగదుడు, నీలుడు, జాంబవంతుడు మొదలగు వానర ప్రముఖులలో తానొక ప్రముఖ పాత్ర నిర్వహిస్తాడు సుగ్రీవుడు. యుద్ధ ప్రారంభమునకు ముందు ఆభరణ శోభితుడై కిరీట ఛత్ర చామరాదులతో విరాజిల్లుచున్న రావణుడ్ని గోపుర శిఖరం మీద అధివసించియుండగా సుగ్రీవుడు చూడటంతటస్థిస్తుంది. వెంటనే అతడి కోపం అవధులు మించి ప్రవహిస్తుంది. తటాలున ఎగిరి రావణుని పైకి లంఘించి కిరీటాన్ని లాగి క్రింద పడవేస్తాడు. యుద్ధం ఆరంభం కాకుండానే సుగ్రీవుని ఈ సాహసచర్య రావణునికి తలకొట్టివేసినట్లయ్యింది. గోపుర శిఖరంపై రావణ సుగ్రీవులకు గొప్ప పోరు జరుగుతుంది. భీకర పోరాటం అనంతరం అలసట వస్తుంది. తన మాయాజాలం ప్రదర్శనకు పూనుకొనగానే సుగ్రీవుడు ఇంగితజ్ఞుడై ఆకసంలోకి ఎగిరి రామ సదనన్నిధి చేరుకొంటాడు. అలసిపోయి యుద్ధ చిహ్నాలతో గాయపడిన సుగ్రీవుని ఆలోచన రహిత ఆవేశపూరిత సాహసాన్ని రాముడు తీవ్రంగా మందలిస్తాడు. "ఏవం సాహస యుక్తాని నకుర్వంతి జనేశ్వరాః" రాజులు అనాలోచితంగా దుందుడుకు పనులు చేయ సమకట్టరని రాముడు హితవు చెపుతాడు. ఆప్తమిత్రునికి ఆపద వస్తే తనకు సీతతో ప్రయోజనం లేదని విలపించి రాముడు తన మిత్ర ధర్మ సౌశీల్యాన్ని సుగ్రీవుని పట్ల ప్రదర్శిస్తాడు.

రావణ వధానంతరం సీతారామ లక్ష్మణులు, సుగ్రీవుడు, విభీషణుడు, అంగదుడు మొదలగు సకల వానర యోధులు పుష్పక విమానారూఢులై నంది గ్రామమునకు తరలివస్తారు. ప్రతిజ్ఞ పాలనం, రావణ వధ దిగ్విజయంగా పూర్తి చేసుకొని వచ్చిన శ్రీరామునికి భరతుడు అపూర్వ స్వాగతం పల్కుతాడు.

సీతాదేవికి వినమ్ర అభివాదాలు చేస్తాడు. సుగ్రీవుణ్ని ప్రత్యేకంగా కౌగిలించుకొని అభినందిస్తూ పల్కిన పల్కులకు సుగ్రీవుని జీ ధన్యమవుతుంది :

"త్వమస్మాకం చతుర్ణాంతు భ్రాతాసుగ్రీవ పంచమః
సౌహృదాజ్జాయతే మిత్రమపకారో஽రి లక్షణ మ్"

"సుగ్రీవా! నీవు మానలుగురికి అయిదవ సోదరుడవైతివి."

"అతి బలుడైన రామునికి జయం, రాఘవ పాలితుడైన సుగ్రీ జయం" అంటూ అసంఖ్యాక ఋక్ష వానర యోధులు వీర నినాద గావించిన వాల్మీకి రామాయణం సఖ్యతకు అపురూప సంకేతంగా వరాజ సుగ్రీవునికి రామాయణంలో మహోన్నత స్థానం కలదని తేటతెల్లమైనది. ప్రాయుడై అంది మన్ననలందుకొన్న ధన్యాత్ముడు సుగ్రీవుడు.

"జయత్యతిబలో రామోలక్ష్మణశ్చ మహాబలః
రాజా జేయతి సుగ్రీవో రాఘవేణాభి పాలితః"

"శ్రీమదాకుండన్వయ పవిత్ర ఆత్రేయసగోత్ర మహా కవి, తత్త్వ సం రామాయణ కర్త వేంకట కవి ప్రపౌత్ర, విద్వత్కవి బిరుదాంకిత భార భాగవత నిర్వచన అధ్యాత్మ రామాయణ కర్త వేంకట శాస్త్రి పు మద్రామాయణ సుధా మాధురీ 'గీతా జ్ఞాన సుధ' 'రామాయణ ఆర్షధర్మాలు' ఇత్యాది గ్రంథకర్త, రాష్ట్ర జాతీయ స్థాయి ఉత్తమ అధ బహుమతి గృహీత మద్రాస్ తెలుగు అకాడమి ఉగాది సాహితీ పుర గృహీత రామశర్మ ప్రణీత గ్రంధ సర్వం సమాప్తం.

"ఓం తత్ శ్రీరామ చంద్రార్పణమస్తు"